
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 284

గురువారం 4-1-2024



సిరాజ్‌కు 6 వికెట్లు


తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 55 ఆలౌట్..భారత్ 153 ఆలౌట్ -12లో



ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్

2023లో హైదరాబాద్‌లో 32 శాతం అధికంగా లీజు -13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'అదానీ'కి భారీ ఊరట

అదానీ గ్రూప్‌పై కొనసాగుతున్న దర్యాప్తును సిట్ లేదా సీబీఐకి అప్పగించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

వివరాలు 6లో ▸



విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

'మద్యం' స్కామ్ కేసులో ఈడీ ఇచ్చిన సమన్లను మూడోసారీ ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బేఖాతరు చేశారు.

వివరాలు 6లో ▸



73కు చేరిన 'జపాన్' మరణాలు

ఇషికావా ప్రిఫెక్చర్‌లో 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య బుధవారానికి 73కు పెరిగింది.

వివరాలు 6లో ▸



జేఎన్1 వేరియంట్ విజృంభణ

జేఎన్1 వేరియంట్ వైరస్ విజృంభణ కొనసాగుతోంది. 24 గంటల్లో 511 జేఎన్1 ఉప వేరియంట్ రకం కేసులు నమోదయ్యాయి.

వివరాలు 6లో ▸

బదిలీ బాట!

పెద్ద సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు స్థానచలనం


స్మిత సబర్వాల్


సంగీత


రాహుల్ బొజ్జా


చంద్రశేఖర్ రెడ్డి

18 మంది ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్.. 8 మందికి అదనపు బాధ్యతలు

23 మంది ఐపీఎస్‌లు, 21 మంది నాన్‌కేడర్ ఎస్పీ స్థాయి అధికారుల బదిలీ

- 5 జిల్లాలకు కొత్త కలెక్టర్లు.. 3 కమిషనరేట్లకు కొత్త పోలీస్ కమిషనర్లు
- ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శిగా స్మితా సబర్వాల్
- నీటి పారుదల శాఖ బాధ్యతలు రాహుల్ బొజ్జాకు..
- రఘునందన్‌కు జీఏడీ అదనపు బాధ్యతలు
- బి.వెంకటేశంకు బీసీ సంక్షేమం అదనపు బాధ్యతలు
- సీఎంఓకు కొత్తగా మరో 3 ముఖాలు.. సీఎం కార్యదర్శిగా చంద్రశేఖరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ సర్కారు పాలనలో మార్పుబాట పట్టింది. ఇప్పటి వరకు వివిధ శాఖలు, విభాగాల్లో కీలకంగా పనిచేస్తూ వచ్చిన పెద్ద సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్, నాన్ కేడర్ ఎస్పీస్థాయి అధికారులను బదిలీ చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీల అమలుతో పాటు కొత్త ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి తన జట్టును సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ఈ క్రమంలో పాలనా యంత్రాంగంలో భారీ స్థాయిలో మార్పులు చేర్పులు చేపట్టారు. తాజాగా ఒకేసారి 26 మంది ఐఏఎస్‌లు, 23 మంది ఐపీఎస్‌లు, 21 మంది నాన్ కేడర్ ఎస్పీస్థాయి అధికారులకు స్థాన చలనం కల్పించారు. ఐఏఎస్‌లలో 18 మందికి పూర్తిగా కొత్త బాధ్యతలు అప్పగించగా.. మిగతా 8 మందికి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఐదు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. ఐపీఎస్‌లలో అందరినీ కొత్త స్థానాలకు బదిలీ చేశారు. నాన్ కేడర్ ఎస్పీ అధికారులకు కొన్ని స్థానాల్లో కీలక పోస్టింగ్‌లు ఇచ్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడం ఇష్టం లేని, 18 గంటలు పనిచేయాలా అని అసంతృప్తిగా ఉండే అధికారులను పెద్దగా పనిలేని స్థానాలకు బదిలీ చేయడానికి సర్కారుకు అభ్యంతరం లేదని ఇటీవల సీఎం రేవంత్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇది జరిగి వారం గడవక ముందే భారీగా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలు జరగడం గమనార్హం.

ఫైనాన్స్ కమిషన్‌కు స్మితా సబర్వాల్

గత ప్రభుత్వంలో సీఎం కార్యదర్శిగా, మిషన్ భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్) కార్యదర్శిగా అదనపు బాధ్యతలు చూసుకున్న

మిగతా 2వ పేజీలో ▶

ఆ అధికారం కేంద్రానిదే..

ఐఏఎస్, ఐపీఎస్ కేడర్ వివాదాన్ని డీవోపీటీకి అప్పగించిన హైకోర్టు



- రాష్ట్రాల మధ్య అధికారుల కేటాయింపు క్యాట్ పరిధిలోకి రాదని స్పష్టీకరణ
- అధికారుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి సూచన
- ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోవాలని ఆదేశం

3లో

దీపాదాస్ మున్షీకి పుష్పగుచ్ఛమిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మహేశ్‌కుమార్, వంశీచంద్



ఆరు గ్యారంటీల కోసం
ఇందిరమ్మ కమిటీలు

- ప్రతి గ్రామానికి, వార్డుకు ఐదుగురితో ఏర్పాటు
- పథకాలు ప్రజలందరికీ అందేలా కమిటీలు పనిచేయాలి.. టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో నిర్ణయం
- ఈ నెల 8 నుంచి రేవంత్ సమీక్షలు, సమావేశాలు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామానికి, వార్డుకు ఐదుగురితో ఏర్పాటు చేసే కమిటీల ద్వారా ఆరు గ్యారంటీలను ప్రజలందరికీ అందించేలా పనిచేయాలని టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా ఈ భేటీ రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం గాంధీభవన్‌లో ఈ సమావేశం జరిగింది. ఇందులో మూడు తీర్మానాలను ఆమోదించడంతో పాటు లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలు, ఆరు గ్యారంటీల అమలులో పార్టీ పాత్ర తదితర అంశాలపై చర్చించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయించే బాధ్యతను

మిగతా 5వ పేజీలో ▶

మహిళా సాధికారతే మా లక్ష్యం: మోదీ

కేరళలో బీజేపీ ఆధ్వర్యంలో 'మహిళా శక్తి మోదీ వెంటే' పేరిట నిర్వహించిన మహిళల బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకల్లో మహిళా త్రివిధ దళాల బృందం



గణతంత్ర వేడుకల్లో త్రివిధ దళాలకు చెందిన మహిళా బృందంతోపాటు.. మహిళా అగ్నివీర్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. త్రివిధ దళాలు, అగ్నివీర్‌ల్లోని మహిళా బృందం జనవరి 26న విన్యాసాలు చేయనుంది.

- వివరాలు 6లో▶

బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా ఇన్‌చార్జిగా బండి సంజయ్



బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ నియమితులయ్యారు. పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధిష్టానం కీలక నియామకాలను చేపట్టింది.

- వివరాలు 2లో▶

ఇస్రో అమ్ములపొదిలో ఎన్‌జీఎల్‌వీ!



సమీప భవిష్యత్తులో భారీ ప్రయోగాలకు తెర తీస్తున్న ఇస్రో, అందుకు తగ్గట్టుగా అత్యాధునిక రాకెట్ తయారీ ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఈ రాకెట్‌కు న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్‌గా నామకరణం చేశారు.

- వివరాలు 6లో▶

కలిసి పనిచేద్దాం



'కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేద్దాం. కలిసికట్టుగా ముందుకు సాగుదాం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి మనకు స్పీడ్ బ్రేకర్ లాంటిది' అని హరీశ్‌రావు చెప్పారు. బుధవారం పార్టీ ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నేతల భేటీలో ఆయన మాట్లాడారు.

- వివరాలు 2లో▶



.. అలాగైతే మరి మనమెలా గెలుస్తాం!

ఏకపక్ష నిర్ణయాలు ఉండవు



లోక్‌సభ అభ్యర్థుల ఎంపికలో అందరి అభిప్రాయాలు తీసుకుంటాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

- రాహుల్, మోదీ తెలంగాణ గురించి పార్లమెంటులో మాట్లాడరు
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం బీఆర్ఎస్ ఎంపీలతోనే సాధ్యం
- ప్రజలు గులాబీ దళాన్ని గెలిపించి తెలంగాణకు బలం ఇవ్వాలి
- కాంగ్రెస్ వంద రోజుల్లో హామీలు నెరవేర్చకుంటే బొంద పెడతాం

సాక్షి, హైదరాబాద్: 'పార్లమెంటు వేదికగా తెలంగాణ ప్రయోజనాలను కాపాడటం కేవలం బీఆర్ఎస్ ఎంపీలతోనే సాధ్యమవుతుంది. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు గులాబీ దళాన్ని గెలిపించి తెలంగాణకు బలం ఇవ్వమని ప్రజలను కోరుతున్నాం. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో ఏకపక్ష నిర్ణయాలుండవు. అందరి అభిప్రాయాలూ తీసుకుంటాం..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. లోక్‌సభ సన్నాహక సమావేశాల తొలిరోజు బుధవారం తెలంగాణ భవన్‌లో ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

పేగులు తెగేదాకా పోరాడేది బీఆరెస్సే

'బీఆర్ఎస్ దళం, గళం పార్లమెంటులో ఉండాలి. బీఆర్ఎస్ వల్లే పార్లమెంటులో తెలంగాణ మాట ప్రతిధ్వనిస్తుంది. రాష్ట్ర హక్కుల కోసం పేగులు తెగేదాకా కొట్లాడేది బీఆర్ఎస్ మాత్రమే. బెంగాల్‌కు మమతా బెనర్జీ, తమిళనాడుకు డీఎంకే స్టాలిన్, ఏపీకి జగన్, చంద్రబాబు, ఒడిశాకు నవీన్ పట్నాయక్, బీహార్‌కు నితీశ్‌కుమార్, మహారాష్ట్రకు శరద్ పవార్ తరహాలో తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రతీక, పర్యాయపదం కేసీఆర్. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, ఆ తర్వాత విభజన హామీల అమలు, రాష్ట్ర హక్కులు, ప్రయోజనాలు, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నిరంకుశ విధానాలపై కొట్లాడింది కూడా కేసీఆర్ మాత్రమే. మోదీ, రాహుల్ ఎన్నడూ తెలంగాణ ప్రయోజనాల కోసం పార్లమెంటులో మాట్లాడరు. తెలంగాణ గళానికి బలం లేకపోతే పార్లమెంటులో తెలంగాణ పదం వినపడకుండాపోయే చాన్స్ ఉంది..' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

లోటుపాట్లను సరిదిద్దుకునేందుకు కార్యాచరణ

'ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి కారణాలను సమీక్షించుకుంటున్నాం. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ, గతంలో జరిగిన పొరపాట్లను సవరించుకుంటాం. చిన్న చిన్న లోటు పాట్లను సరిదిద్దుకునే దిశగా అంతర్గతంగా

మిగతా 2వ పేజీలో ▶

కాంగ్రెస్ దుర్మార్గాలను ఎండగడతాం

'రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని ఎగవేసేందుకు చేస్తున్న సిల్లీ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు. తెలంగాణ విజయాలను వైఫల్యాలుగా చూపేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. అబద్ధాలను అస్త్రంగా మార్చుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వంద రోజుల్లో హామీలను నెరవేర్చకుంటే ప్రజలను చైతన్యవంతులను చేసి ఆ ప్రభుత్వాన్ని బొంద పెడతాం. రాబోయే రోజుల్లో మండల, నియోజకవర్గ స్థాయిలోనూ సమావేశాలు ఏర్పాటు చేసి అన్ని రకాల ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేస్తాం. కేడర్‌కు అండగా ఉంటూ కాంగ్రెస్ దుర్మార్గాలను ప్రజాస్వామికంగా ఎండగడతాం..' అని కేటీఆర్ అన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా' కూటమి కన్వీనర్‌గా నితీశ్ కుమార్!



ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సారథి ఎవరన్న దానిపై కొంత స్పష్టత వచ్చింది. జేడీ(యూ) సీనియర్ నేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను విపక్ష కూటమి కన్వీనర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. 'ఇండియా' భాగస్వామ్య పక్షాల వర్చువల్ సమావేశం త్వరలో జరుగనుంది. కన్వీనర్ నియామకంపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

- వివరాలు 6లో

రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధం

సీఎం రేవంత్‌తో భేటీలో అదానీ గ్రూప్ ప్రతినిధులు • పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు కల్పిస్తామన్న సీఎం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇందుకోసం ప్రభుత్వం నుంచి తగిన సహకారం కావాలని అదానీ గ్రూపు రాష్ట్ర సర్కారును కోరింది. బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో అదానీ గ్రూపు పోర్టులు, సెజ్‌ల సీఈవో గౌతమ్ అదానీ పెద్ద కుమారుడు కరణ్ అదానీ, అదానీ ఏరోస్పేస్ ఈసీవో ఆశీష్ రాజ్‌వన్షి తదితరులు సమావేశమయ్యారు. ఏరోస్పేస్ పార్కు, డేటా సెంటర్‌తో పాటు కొత్త ప్రాజెక్టుల స్థాపనపై చర్చించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడులు పెడతామని అదానీ గ్రూపు ప్రతినిధులు సీఎం దృష్టికి తెచ్చారు. ఇప్పటికే తలపెట్టిన పాత ప్రాజెక్టులను కొనసాగిస్తామని, కొత్త ప్రాజెక్టుల స్థాపనకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం కోరుతున్నామని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్.. అదానీ గ్రూప్ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నా మన్నారు. పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పన కోసం కొత్త పరిశ్రమలకు తగిన వసతులు, రాయితీలు కల్పిస్తామని చెప్పారు.

అమరరాజా గిగా ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష

అమరరాజా ఎనర్జీ, మొబిలిటీ సంస్థ సీఎండీ గల్లా జయదేవ్ నేతృత్వంలో కంపెనీ

మిగతా 3వ పేజీలో ▶

14న దావోస్ పర్యటనకు సీఎం రేవంత్

- వివరాలు 3లో

ఇరాన్‌లో రక్తమోడిన సంస్మరణ ర్యాలీ..

100 మందికిపైగా దుర్మరణం


ఇరాన్ కేర్మన్ నగరంలో పేలుళ్లలో గాయపడిన వ్యక్తికి చికిత్స అందిస్తున్న సహాయక సిబ్బంది

అమెరికా డ్రోన్ దాడిలో హతమైన ఇరాన్ అత్యున్నత సైనిక జనరల్ సులేమానీ సంస్మరణ సభలో భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 171 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులను ఇరాన్ ఖండిస్తున్న వేళ ఇరాన్‌పై దాడి చేసింది ఎవరనేది ఇంకా తెలియరాలేదు. బుధవారం ఖాసిమ్ సులేమానీకి నివాళిగా సంస్మరణ ర్యాలీ జరుగుతుండగా సాహెబ్ అల్–జమాన్ మసీదు సమీపంలో రోడ్డుపై ఈ పేలుడు ఘటన జరిగింది.

6లో

70 శాతం రోగులకు యాంటీ బయోటిక్స్!

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సూచిస్తున్నారన్న ఎన్‌సీడీసీ



- అందులోనూ అధిక సామర్థ్యం కలిగిన మందులే ప్రిస్క్రైబ్ చేస్తున్నట్టు వెల్లడి
- 70%లో 5% మంది 4 లేదా అంతకంటే ఎక్కువ రకాలు వినియోగం
- దేశవ్యాప్త అధ్యయనంపై నివేదిక విడుదల చేసిన కేంద్రమంత్రి

సాక్షి, హైదరాబాద్: యాంటీ బయోటిక్స్ వినియోగాన్ని పరిమితం చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)తో పాటు మరెన్నో వైద్య సంస్థలు సూచిస్తున్నప్పటికీ వాటి వినియోగం ఎంతమాత్రం తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా 20 ప్రభుత్వ ఆసుపత్రులలో జాతీయ వ్యాధి నియంత్రణ సంస్థ (ఎన్‌సీడీసీ) నిర్వహించిన తాజా అధ్యయనంలో ఈ విషయం తేలింది. యాంటీ బయోటిక్స్ వినియోగాన్ని అంచనా వేయడానికి ఇప్పటివరకు దేశంలో నిర్వహించిన అతిపెద్ద మల్టీ సెంటర్ పీపీఎస్ (పాయింట్ ప్రివలెన్స్ సర్వే)ల్లో ఇది ఒకటి. కాగా ఆసుపత్రుల్లో అడ్మిట్ అయిన 10 మంది రోగులలో ఏడుగురికి యాంటీ బయోటిక్స్‌ను సూచిస్తున్నట్టు (ప్రిస్క్రైబ్) ఈ సర్వే వెల్లడించింది. 70%లో కనీసం 5% మంది నాలుగు లేదా అంతకంటే ఎక్కువ రకాల యాంటీ బయోటిక్స్ తీసుకుంటున్నారని వెల్లడైంది.

వాచ్ గ్రూప్ యాంటీ బయాటిక్స్ ఎక్కువ

సాధారణంగా రోగులకు ఉపయోగించే 180 రకాల యాంటీబయోటిక్‌లను, వాటి సామర్థ్యాలకు అనుగుణంగా, వినియోగించాల్సిన

మిగతా 3వ పేజీలో ▶




నేడు కేసీఆర్‌కు వైఎస్ జగన్ పరామర్శ

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకుంటారు. తుంటి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావును బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని ఆయన నివాసంలో కలిసి జగన్ పరామర్శిస్తారు. మధ్యాహ్నం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లికి చేరుకుంటారు.

క్లుప్తంగా...

బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా ఇన్‌చార్జిగా బండి సంజయ్

- సునీల్ బన్సల్‌కు యువ మోర్చా..
- ఎస్సీ మోర్చా ఇన్‌చార్జిగా తరుణ్ ఛుగ్

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ నియమితులయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధిష్టానం కీలక నియామకాలను చేపట్టింది. పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా జాతీయ ప్రధాన కార్యదర్శులకు మోర్చాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యువ మోర్చా ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, ఎస్సీ మోర్చా ఇన్‌చార్జిగా తరుణ్ ఛుగ్, మహిళా మోర్చా ఇన్‌చార్జిగా బైజయంత్ పాండా, ఎస్టీ మోర్చా ఇన్‌చార్జిగా రాధామోహన్ దాస్ అగర్వాల్, ఓబీసీ మోర్చా ఇన్‌చార్జిగా వినోద్ తావ్డే, మైనార్టీ మోర్చా ఇన్‌చార్జిగా దుష్యంత్ కుమార్ గౌతమ్‌లను పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు.

నేడు ఢిల్లీకి మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: సాగునీటి శాఖమంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం ఢిల్లీ వెళ్తున్నారు. ఏఐసీసీ నుంచి పిలుపు రావడంతో ఉత్తమ్ ఢిల్లీ వెళ్తున్నారని, దీంతో గురువారం తలపెట్టిన ఎత్తిపోతల పథకాల సమీక్షా సమావేశం వాయిదా వేస్తున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు బుధవారం వెల్లడించాయి.

బీసీల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: పొన్నం



సాక్షి, హైదరాబాద్: బీసీల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా బీసీలకు విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేయాలని అధికారులను బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ పనితీరు, గురుకుల విద్యాలయాలు, బీసీ కార్పొరేషన్ రుణాలు, ఆత్మగౌరవ భవనాలు, ఫెడరేషన్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అధికారులందరూ బీసీల సమగ్రాభివృద్ధి కోసం, వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడం కోసం నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. బీసీ సంక్షేమ శాఖలోని హాస్టళ్లో విద్యార్థుల సంఖ్య, అవసరమైన నిధులు, వసతుల గురించి, రాష్ట్రంలోని స్టడీ సర్కిళ్లలో ఇస్తున్న కోచింగ్ గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. గురుకుల పాఠశాలల పనితీరు, విద్యార్థులు సాధిస్తున్న ఉత్తీర్ణత శాతం గురించి మంత్రి ఆరా తీశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎంబీసీ సీఈఓ అలోక్ కుమార్, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేసిన తప్పులు సీఎం రేవంత్ చేయొద్దు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



సూర్యాపేట: బీఆర్ఎస్ పార్టీ చేసిన తప్పులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయొద్దని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం సూర్యాపేటలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ ఓటమికి కారణాలు, లోటుపాట్లను విశ్లేషిస్తూనే వాటిని సరిదిద్దుకొని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఫలితాలతో పార్టీ కేడర్ ధైర్యం కోల్పోవద్దని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ప్రవీణ్ సూచించారు. ప్రభుత్వం ఏర్పడి కొద్దిరోజులే అయినందున ఇప్పుడే ఎలాంటి విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని ప్రవీణ్ అన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే భవిష్యత్‌లో కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. అనంతరం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ప్రవీణ్ నివాళులర్పించారు.

బదిలీ బాట!

▶ మొదటి పేజీ తరువాయి

స్మితా సబర్వాల్ పెద్దగా ప్రాధాన్యత ఉండని రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా బదిలీ అయ్యారు. గత ప్రభుత్వం నవంబర్ 30న ఆమెకు నీటిపారుదల శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించింది. కానీ సర్కారు మారడంతో ఆ బాధ్యతలను చేపట్టలేదు. ఇప్పుడా బాధ్యత నుంచి సైతం స్మితను ప్రభుత్వం తప్పించింది. ఇక ఈసీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రంగారెడ్డి కలెక్టర్‌గా నియమించిన భారతి హొళికేరిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతల నుంచి తప్పించి వెయిటింగ్‌లో పెట్టింది. తాజాగా రాష్ట్ర పురావస్తుశాఖ డైరెక్టర్‌గా ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేసింది. భూముల వ్యవహారంలో ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శిగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు అదనపు బాధ్యతలు అప్పగించింది.

రాహుల్ బొజ్జాకు నీటిపారుదల శాఖ

సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను నీటిపారుదల శాఖ కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసింది. సుదీర్ఘకాలం నుంచి అప్రాధాన పోస్టుల్లో కొనసాగుతున్న ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ అదనపు డీజీ మహేశ్‌దత్ ఎక్కాకు కీలక పోస్టింగ్ లభించింది. ఆయనకు ప్రభుత్వం గనుల శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అప్పగించింది. వెయిటింగ్‌లో ఉన్న డి.దివ్యను పురపాలక శాఖ డైరెక్టర్‌గా నియమించింది. సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను గిరిజన శాఖ కార్యదర్శిగా బదిలీ చేయగా.. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశంకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించింది. కార్మిక శాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్ ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా బదిలీ అయ్యారు. కీలకమైన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పదవి కె.శశాంకకు దక్కింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తల్లి, ఐఏఎస్ అధికారి చిట్టెం లక్ష్మి వెయిటింగ్‌లో ఉండగా.. టీఎస్ ఫుడ్స్ ఎండీగా నియమించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావుకు సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్) కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ జె.శంకరయ్య (నాన్ కేడర్)ను టీఎస్‌టీఎస్ ఎండీగా బదిలీ చేశారు.

సీఎం పేషీకి మూడు కొత్త ముఖాలు

ప్రభుత్వం మరో ముగ్గురు అధికారులను ముఖ్యమంత్రి కార్యాలయానికి బదిలీ చేసింది. తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ వీసీ, ఎండీగా ఉన్న ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) అధికారి జి.చంద్రశేఖరరెడ్డిని ముఖ్యమంత్రికి కార్యదర్శిగా సీఎంఓకు బదిలీ చేశారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ బాధ్యతలు కూడా నిర్వహించాలని ఆయనను ఆదేశించారు. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వేముల శ్రీనివాసులు (నాన్ కేడర్ అధికారి)ను ముఖ్యమంత్రికి ఓఎస్డీగా సీఎంఓకు బదిలీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ కుమార్తె, 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సంగీత సత్యనారాయణను టీఎస్ ఫుడ్స్ ఎండీ పోస్టు నుంచి బదిలీ చేస్తూ.. ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శిగా కీలక పదవిలో నియమించారు. దీంతో సీఎం కార్యాలయంలో కీలకమైన పదవుల్లో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, డిఫెన్స్ సర్వీసెస్, గ్రూప్-1 అధికారులను నియమించినట్టు అయింది. ఇప్పటికే సీఎం ముఖ్యకార్యదర్శిగా శేషాద్రి (ఐఏఎస్), కార్యదర్శిగా షానవాజ్ ఖాసీమ్ (ఐపీఎస్), అదనపు కార్యదర్శిగా అజిత్‌రెడ్డి (డిఫెన్స్ సర్వీసెస్) అధికారులను ప్రభుత్వం నియమించింది.

మూడు కమిషనరేట్లకు కొత్త సీపీలు

రాష్ట్రంలో మూడు కమిషనరేట్లకు ప్రభుత్వం కొత్త పోలీస్ కమిషనర్లను నియమించింది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా ఎల్ఎస్ చౌహాన్‌ను, ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా సునీల్‌దత్, సిద్దిపేట పోలీసు కమిషనర్‌గా బి.అనురాధను ప్రభుత్వం బదిలీ చేసింది. మరో ఐదు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావును అదనపు డీజీ (టెక్నికల్ సర్వీసెస్)గా ప్రభుత్వం బదిలీ చేసింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా అదనపు బాధ్యతల్లోనూ కొనసాగాలని ఆయనను ఆదేశించింది.

బదిలీ అయిన ఐఏఎస్ అధికారుల వివరాలివీ..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
మహేశ్‌దత్ ఎక్కా	ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ అడిషనల్ డీజీ	గనుల శాఖ ముఖ్యకార్యదర్శి
అహ్మద్ నదీమ్	కార్మిక శాఖ కమిషనర్	ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి
రాహుల్ బొజ్జా	సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి	నీటి పారుదల శాఖ కార్యదర్శి
స్మితా సబర్వాల్	ముఖ్యమంత్రి కార్యదర్శి	రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి
ఎ.శరత్	సంగారెడ్డి జిల్లా కలెక్టర్	గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి
డి.దివ్య	వెయిటింగ్	పురపాలక శాఖ డైరెక్టర్, రాష్ట్ర నోడల్ అధికారి-ప్రజావాణి
దాసరి హరిచందన	పురపాలక శాఖ డైరెక్టర్, రాష్ట్ర నోడల్ అధికారి-ప్రజావాణి	నల్లగొండ కలెక్టర్
భారతి హొళికేరి	వెయిటింగ్	పురావస్తు శాఖ డైరెక్టర్
కె.శశాంక	మహబూబాబాద్ కలెక్టర్	రంగారెడ్డి జిల్లా కలెక్టర్
అద్వైత్‌కుమార్‌సింగ్	కేంద్ర డిప్యుటేషన్ నుంచి వచ్చారు	మహబూబాబాద్ కలెక్టర్
చిట్టెం లక్ష్మి	వెయిటింగ్	డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీ
ఎస్.కృష్ణ ఆదిత్య	పీసీబీ సభ్యకార్యదర్శి	కార్మిక శాఖ డైరెక్టర్
ఆయేషా మస్రత్ ఖానమ్	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ సెక్రటరీ	టీఎస్ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి
ఎస్.సంగీత సత్యనారాయణ	టీఎస్ ఫుడ్స్ ఎండీ	జాయింట్ సెక్రెటరీ, సీఎంఓ
వల్లూరు క్రాంతి	జోగుళాంబ గద్వాల కలెక్టర్	సంగారెడ్డి కలెక్టర్
బీఎం సంతోష్	టీఎస్‌పీఎస్సీ అదనపు కార్యదర్శి/కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్	జోగుళాంబ గద్వాల కలెక్టర్
అభిలాష అభినవ్	వెయిటింగ్	జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్
పి.కదిరవన్	జయశంకర్ భూపాలపల్లి అదనపు కలెక్టర్	హైదరాబాద్ అదనపు కలెక్టర్

అదనపు బాధ్యతలు అప్పగించిన ఐఏఎస్ అధికారులు..

అధికారి	ప్రస్తుత బాధ్యతలు	అదనపు బాధ్యతలు
బి.వెంకటేశం	విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి	బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి
సందీప్‌కుమార్ సుల్తానియా	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి	ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి
జ్యోతిబుద్ధ ప్రకాశ్	రవాణా శాఖ కమిషనర్	పీసీబీ సభ్య కార్యదర్శి
ఎం.రఘునందన్‌రావు	వ్యవసాయ శాఖ కార్యదర్శి	సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి (పొలిటికల్)
ఎం.ప్రశాంతి	పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు కార్యదర్శి	ఆయుష్ డైరెక్టర్
డి.కృష్ణభాస్కర్	ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక కార్యదర్శి	ఆర్థిక, ప్రణాళిక శాఖల ప్రత్యేక కార్యదర్శి
ఆర్‌వీ కర్ణన్	వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్	తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ
ఎం.హరిత	విద్యా శాఖ సంయుక్త కార్యదర్శి	కో-ఆపరేషన్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ డైరెక్టర్

బదిలీ అయిన ఐపీఎస్ అధికారులు వీరే..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
1. వీవీ శ్రీనివాసరావు	చైర్మన్, పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు	అదనపు డీజీ (టెక్నికల్ సర్వీసెస్), రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా అదనపు బాధ్యత
2. గజరావు భూపాల్	వెయిటింగ్	డీఐజీ, సమన్వయం (డీజీపీ ఆఫీసులో)
3. రెమా రాజేశ్వరి	కమిషనర్, రామగుండం	డీఐజీ, మహిళా రక్షణ విభాగం
4. ఎల్ఎస్ చౌహాన్	డీఐజీ జోన్- VII (జోగుళాంబ)	కమిషనర్, రామగుండం
5. నోయల్ డేవిస్	డీసీపీ, ఎస్‌బీ, హైదరాబాద్	డీఐజీ, జోన్ VII (జోగుళాంబ)
6.విష్ణు ఎస్ వారియర్	ఎస్పీ, ఖమ్మం	డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ (ఎస్ఐఏ ఎస్పీ కేంద్ర సర్వీసుల్లోకి)
7. పీవీ పద్మజ	ఎస్పీ, మహిళా రక్షణ విభాగం	డీసీపీ, మల్కాజిగిరి
8. జానకి దేవవ్రత్	డీసీపీ, మల్కాజిగిరి	డీసీపీ, ఈస్ట్ జోన్ హైదరాబాద్
9. జానకీ నిర్మల	డిప్యూటీ డైరెక్టర్, టీఎస్‌పీఏ	ఎస్పీ, నిర్మల్
10. సునీల్‌దత్	డీసీపీ, ఈస్ట్‌జోన్ హైదరాబాద్	కమిషనర్, ఖమ్మం
11. ఎస్.రాజేంద్రప్రసాద్	వెయిటింగ్	ఎస్పీ, సీఐడీ హైదరాబాద్
12. ఉదయ్‌కుమార్‌రెడ్డి	ఎస్పీ, ఆదిలాబాద్	ఎస్పీ, టీఎస్ ట్రాన్స్‌కో
13. గౌష్ ఆలం	ఎస్పీ, ములుగు	ఎస్పీ, ఆదిలాబాద్
14. జి.వినీత్	ఎస్పీ, కొత్తగూడెం	డీసీపీ, మాదాపూర్
15. పి.శబరీష్	డీసీపీ (ఎల్ అండ్ ఓ), మేడ్చల్ జోన్	ఎస్పీ, ములుగు
16. నికిత పంత్	వెయిటింగ్	డీసీపీ (ఎల్ అండ్ ఓ), మేడ్చల్ జోన్
17. బి.అనురాధ	డీసీపీ, సైబర్ క్రైమ్స్, రాచకొండ	కమిషనర్, సిద్దిపేట
18. సీహెచ్ ప్రవీణ్	----	డీసీపీ, ఎల్‌బీ నగర్ జోన్, రాచకొండ
19. బి.రోహిత్‌రాజు	డీసీపీ సౌత్‌ఈస్ట్ జోన్, హైదరాబాద్	ఎస్పీ, కొత్తగూడెం
20. బి.బాలస్వామి	డీసీపీ, సౌత్‌వెస్ట్ జోన్, హైదరాబాద్	ఎస్పీ, మెదక్
21. అశోక్‌కుమార్	ఓఎస్డీ ములుగు	ఓఎస్డీ, జయశంకర్ భూపాలపల్లి
22. ఆర్.వెంకటేశ్వర్లు	ఎస్పీ, వెయిటింగ్	డీసీపీ, ట్రాఫిక్- ఐఐఐ, రాజేంద్రనగర్ జోన్
23. సీహెచ్.శ్రీనివాస్	ఎస్పీ, వెయిటింగ్	డీసీపీ, రాజేంద్రనగర్

బదిలీ అయిన నాన్ కేడర్ ఎస్పీలు వీరే..

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
1. కేసీఎస్ రఘువీర్	ఎస్పీ(అడ్మిన్) సైబర్ సెక్యూరిటీ బ్యూరో	ఎస్పీ, నార్కోటిక్స్ బ్యూరో
2. బి.శ్రీనివాసరెడ్డి	ఎస్పీ (ఎన్‌సీ), వెయిటింగ్	జాయింట్ డైరెక్టర్, ఏసీబీ
3. కె.ప్రసన్నరాణి	జాయింట్ డైరెక్టర్, ఏసీబీ	ఎస్పీ, ఇంటెలిజెన్స్
4. కె.శిల్పవల్లి	డీసీపీ(అడ్మిన్), హైదరాబాద్ సిటీ	డీసీపీ, క్రైమ్స్, సైబరాబాద్
5. మహ్మద్ ఇక్బాల్ సిద్దిఖీ	అడిషనల్ డీసీపీ, మేడ్చల్, సైబరాబాద్	అడిషనల్ డీసీపీ (అడ్మిన్) హైదరాబాద్
6. ఎస్.వెంకటేశ్వర్లు	డీసీపీ, ట్రాఫిక్-3, హైదరాబాద్ సిటీ	డిప్యూటీ డైరెక్టర్, టీఎస్‌పీఏ
7. ఎం.రవీందర్‌రెడ్డి	ఎస్పీ, టీఎస్ ట్రాన్స్‌కో	ఎస్పీ, ఇంటెలిజెన్స్
8. దేవీందర్‌సింగ్	ఎస్పీ, ఇంటెలిజెన్స్	ఎస్పీ (అడ్మిన్), సైబర్ సెక్యూరిటీ బ్యూరో
9. భాస్కర్ అగ్గడి	ఎస్పీ(ఎన్‌సీ) వెయిటింగ్	ఎస్పీ, నార్కోటిక్స్ బ్యూరో
10. చంద్రమోహన్ గుండేటి	ఎస్పీ(ఎన్‌సీ) వెయిటింగ్	డీసీపీ, టాస్క్‌ఫోర్స్, రాచకొండ
11. కరుణాకర్ పుల్లా	ఎస్పీ(ఎన్‌సీ)వెయిటింగ్	డీసీపీ, ఎస్‌బీ, రాచకొండ
12. మనోహర్ కసివ	ఎస్పీ(ఎన్‌సీ), వెయిటింగ్	డీసీపీ, ట్రాఫిక్, రాచకొండ
13. నర్సింహ కొత్తపల్లి	ఎస్పీ(ఎన్‌సీ), వెయిటింగ్	డీసీపీ, క్రైమ్స్, సైబరాబాద్
14. రమణకుమార్ మాదాడి	ఎస్పీ(ఎన్‌సీ), వెయిటింగ్	డీసీపీ ఏఐజీ (ఎల్ అండ్ ఓ) డీజీపీ ఆఫీస్
15. సృజన కర్నం	ఎస్పీ(ఎన్‌సీ), వెయిటింగ్	డీసీపీ, మహిళా రక్షణ, సైబరాబాద్
16. శ్రీనివాస్ సైదేవర్	ఎస్పీ(ఎన్‌సీ), వెయిటింగ్	డీసీపీ, సీఐడీ
17. శ్రీనివాస్ దన్నారపు	ఎస్పీ(ఎన్‌సీ), వెయిటింగ్	డీసీపీ, ఎస్ఓటీ మేడ్చల్, సైబరాబాద్
18. రఘువీర్‌రెడ్డి జాజాల	ఎస్పీ(ఎన్‌సీ), వెయిటింగ్	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్
19. డి.సునీతారెడ్డి	ఎస్పీ, నార్కోటిక్స్, రాచకొండ	డీసీపీ, మహేశ్వరం జోన్, రాచకొండ
20. ఆర్.జగదీశ్వర్‌రెడ్డి	డీసీపీ, రాజేంద్రనగర్ జోన్, సైబరాబాద్	డీసీపీ, సీఐడీ
21. బి.సాయిశ్రీ	డీసీపీ, ఎల్‌బీనగర్ జోన్, రాచకొండ	డీసీపీ, ఈస్ట్‌జోన్ హైదరాబాద్ సిటీ

ఓటమిని ఆరునెలల ముందే గుర్తించా

- పార్టీ లైన్‌లోనే ఉంటా.. టీపీసీసీ బాధ్యతలు అప్పగిస్తే రాష్ట్రమంతా తిరుగుతా..
- విలేకరులతో చిట్‌చాట్‌లో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డిలో ఓడిపోతానని ఆరు నెలల ముందే గుర్తించానని, కొందరు తన గురించి మాట్లాడిన మాటలు, చేసిన ప్రచారంతోనే గెలవాలనే ప్రయత్నం కూడా చేయలేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. తన ఓటమికి హరీశ్‌రావు రూ.60 కోట్లు ఖర్చు చేశాడని, తాను కూడా గెలవాలనుకుంటే డబ్బులు ఎక్కడి నుంచి తెచ్చయినా ఖర్చు పెట్టేవాడినని, ఓడిపోయినా ఫర్వాలేదనే ఆ ప్రయత్నం చేయలేదని చెప్పారు. టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు గాంధీభవన్‌కు వచ్చిన ఆయన బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. సంగారెడ్డి ప్రజలు తనను తిరస్కరించలేదని, వారినే తాను రిజెక్ట్ చేశానని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రేవంత్ సీఎం అవుతాడని, గెలిస్తే మంత్రిని అవుతానని తనకు ముందే తెలుసునని, అయినా గెలుపు కోసం ప్రయత్నం చేయలేదని చెప్పారు. భవిష్యత్‌లో సంగారెడ్డి ప్రజలను ఓట్లు అడగబోనని చెప్పిన జగ్గారెడ్డి ఇక నుంచి పూర్తి సమయం పార్టీ లైన్‌లోనే పనిచేస్తానని, అధిష్టానం తనకు టీపీసీసీ బాధ్యతలు అప్పగిస్తే రాష్ట్రమంతటా తిరిగి పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానన్నారు.

హిందూ దేవుళ్లంటే ఒవైసీకి చులకన

- రామమందిర ప్రతిష్ట కార్యక్రమాన్ని వివాదాస్పదం చేసే కుట్ర
- 22న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



కరీంనగర్‌లో అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేస్తున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్: అయోధ్యలో ఈనెల 22న రామమందిరంలో అంగరంగ వైభవంగా జరిగే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వివాదాస్పదం చేసి, రాజకీయంగా లబ్ధి పొందాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కుట్ర చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఆరోపించారు. ఇందులో భాగంగానే '500 ఏళ్లపాటు ఖురాన్ చదివిన ప్రదేశం మనకు కాకుండా పోతుంటే మీ గుండెల్లో బాధ లేదా?' అంటూ ముస్లిం యువతను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా ముస్లిం మత పెద్దలు సైతం రామమందిర నిర్మాణంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకించిన దాఖలాలు లేవని ఆయన స్పష్టం చేశారు. శ్రీరామ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలను బుధవారం కరీంనగర్‌లో ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమంలో సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా ఈనెల 22న అయోధ్యలో జరిగే రామవిగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజు సాయంత్రం ప్రతి హిందువు తమ ఇళ్లల్లో దీపాలు వెలిగించాలని కోరారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని జీర్ణించుకోలేకనే ఒవైసీ యువతను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ దేవుళ్లను చులకన భావంతో చూసే ఎంఐఎం పార్టీపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రూ. 7,500 కోట్లు ఖర్చు చేసినా ఎకరాకూ నీరివ్వలేదు

అధికారులపై మంత్రి తుమ్మల అసహనం



సీతారామ టన్నెల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేట: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల్లో జాప్యంపై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసహనం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి వద్ద సీతారామ లిఫ్ట్ పనులను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు ప్రియాంక ఆల, వీపీ గౌతమ్‌లతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు పనులను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. గండుగులపల్లి లిఫ్ట్ తర్వాత టన్నెల్‌ను సుమారు 300 మీటర్లకు పైగా తవ్వాల్సి ఉందని.. అయితే రోజుకు కేవలం ఒక మీటరు మాత్రమే తవ్వగలుగుతున్నామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. దీంతో మంత్రి తుమ్మల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వేసవి ముగిసేలోగా పనులు పూర్తి చేయాలని సూచించగా, అధికారులు సాధ్యం కాదని చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రాజెక్టు వ్యయం రూ.1,300 కోట్లు అయితే ఇప్పటికే రూ.7,500 కోట్లు ఖర్చు చేశారని, అయినా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా యాతాలకుంట టన్నెల్‌ను త్వరగా పూర్తి చేసి సత్తుపల్లి ట్రంక్ కెనాల్‌కు, మరో మార్గం ద్వారా వైరా రిజర్వాయర్‌కు వచ్చే అగస్టు నాటికి సాగునీరు అందించాలని ఆదేశించారు. కృష్ణా జలాలు అందకపోతే గోదావరి మిగులు జలాలను కృష్ణా కాల్వలకు తరలించాలని, గోదావరి నీటితో వైరా, పాలేరు, లంకాసాగర్ ప్రాజెక్టులతోపాటు, కరువు మండలమైన వేంసూరుకు నీరందించేలా పనులు వేగవంతం చేయాలని తుమ్మల సూచించారు.

కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేద్దాం

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి స్పీడ్ బ్రేకర్ లాంటిదే

- మళ్లీ పికప్ అవుతాం.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం
- మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- ఏ కష్టమొచ్చినా 39 మంది ఎమ్మెల్యేలం బస్సు వేసుకుని వస్తం
- బీఆర్ఎస్ ఆదిలాబాద్ లోక్‌సభ సన్నాహక భేటీలో హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: 'కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేద్దాం. కలిసి కట్టుగా ముందుకు సాగుదాం. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి మనకు స్పీడ్ బ్రేకర్ లాంటిది. మళ్లీ మనం పికప్ అయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. ఇది ఎన్నికల కోసం జరుగుతున్న భేటీ కాదు. కేవలం కేడర్‌తో ఉన్న గ్యాప్‌ను సవరించుకునేందుకు ఏర్పాటు చేశాం. మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటాం. మీరు గ్రామ మండల స్థాయిలో కేడర్‌లో ధైర్యం నింపండి. కార్యకర్తలకు ఆపదలో అండగా నిలబడండి. ఓడినా ప్రజల మధ్య ఉంటూ వారి మంచి చెడుల్లో భాగం పంచుకుంటే సానుభూతి వస్తుంది..' అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. బుధవారం పార్టీ ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నేతల భేటీలో ఆయన మాట్లాడారు.

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను నిలదీయండి

'జెడ్పీటీసీ, ఎంపీటీసీ సహా అన్ని రకాల ఎన్నికల్లో కేడర్‌కు అండగా నిలబడతాం. కార్యకర్తలకు కష్టమొస్తే 39 మంది ఎమ్మెల్యేలం బస్సు వేసుకుని వస్తాం. ఉద్యమ కాలంలో, అధికారంలో విభిన్న పాత్ర పోషించిన బీఆర్ఎస్ ప్రతిపక్షంగానూ సమర్థవంతంగా పని చేస్తుంది. ఓటమితో మన పార్టీ మీద ఉన్న దిష్టి తొలగిపోయింది. ఇక అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను క్షేత్ర స్థాయిలో 420 హామీలపై నిలదీయాలి. వైఫల్యాలను ఫ్లెక్సీల ద్వారా ఎండగట్టండి.

ప్రలోభాలకు లొంగొద్దు

హామీల అమలు సాధ్యం కాదని గ్రహించిన కాంగ్రెస్ డ్రామాలకు తెరతీసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో మనమే విచారణ కోరాం. అసెంబ్లీ ఎప్పుడు జరిగినా వారి బట్టలు విప్పుతాం. పార్టీ మారమనే ప్రలోభాలకు లొంగొద్దు. గృహలక్ష్మి, దళితబంధు పథకాల నిలిపివేతపై కోర్టులను ఆశ్రయిద్దాం. ఇకపై జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు చురుగ్గా పనిచేస్తాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కమిటీలు వేయాల్సిందిగా కేసీఆర్ ఆదేశించారు..' అని హరీశ్ తెలిపారు.

సొంత తప్పిదాలూ కారణమే..

ఈ భేటీలో 500కు పైగా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. 26 మంది నాయకులు, కార్యకర్తల నుంచి 170కి పైగా సలహాలు, సూచనలు వచ్చినట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. సొంత తప్పిదాలతో పాటు పార్టీ సంస్థాగత నిర్మాణం పటిష్టంగా లేకపోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారం వల్లే ఓటమి పాలయ్యామంటూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కొన్నిచోట్ల గ్రూపు తగాదాలు పార్టీకి నష్టం చేశాయని, దళితబంధు పథకంతో లబ్ధి పొందని వారితో పాటు పొందిన వారు కూడా పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయలేదని చెప్పారు. ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఓట్లు కూడా పూర్తి స్థాయిలో పార్టీకి పడలేదని, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేశారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తదితరులు మాట్లాడారు.


ఏకపక్ష నిర్ణయాలు ఉండవు

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాచరణ ప్రారంభించాం. కేసీఆర్ కోలుకునేందుకు మరో ఐదారు వారాలు పడుతుంది. ఏకపక్ష నిర్ణయాలు కాకుండా కేసీఆర్ కూడా తెలంగాణ భవన్‌కు వచ్చి అందరితోనూ మాట్లాడి నిర్ణయాలు తీసుకుంటారు. ఆదిలాబాద్ లోక్‌సభ సమీక్ష సందర్భంగా సుమారు 26 మంది నేతలు మాట్లాడిన అంశాలను క్రోడీకరించి కేసీఆర్‌కు వివరిస్తాం. స్థానిక వ్యతిరేకతతో కొందరు ఎమ్మెల్యేలు ఓడినా సీఎంగా కేసీఆర్ ఉంటారని ప్రజలు భావించినట్లు మా నేతలు చెప్తున్నారు. అభివృద్ధి విషయాల్లో ఎక్కడా బీఆర్ఎస్ పనితీరుపై ఫిర్యాదులు లేవు. కాంగ్రెస్ ఫేక్ ప్రాపగాండాతో యువత, ఉద్యోగులు కొంత దూరమయ్యారు. పార్టీ, పాలనలో కొన్ని లోటుపాట్లు సవరించక పోవడం వల్ల ఓటమి పాలయ్యామనే ఫీడ్ బ్యాక్ వచ్చింది. దానికనుగుణంగా పార్టీ నిర్మాణంపై దృష్టి సారిస్తాం..' అని చెప్పారు.

అయోధ్య ఆయుధంగా ఎన్నికలకు మోదీ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రామాలయ అంశాన్ని ప్రధాని మోదీ ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా మార్పులు చోటుచేసుకోబోతున్నాయని, సీపీఐ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అందరికీ సన్‌స్ట్రోక్ వస్తే, మాజీ సీఎం కేసీఆర్‌కు 'డాటర్ స్ట్రోక్' వచ్చిందని, కుమార్తె కోసం ఆయన బీజేపీతో రాజీపడ్డారని విమర్శించారు. రెండు రోజులపాటు జరిగే సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కరణ్ అదానీ. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

పెట్టుబడులకు సిద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతినిధి బృందం బుధవారం సచివాలయంలో సీఎంను కలిసింది. రాష్ట్రంలోని దివిటిపల్లిలో ఏర్పాటు చేస్తున్న లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సంబంధించిన గిగా ప్రాజెక్టు పురోగతిపై ఈ భేటీలో చర్చించారు. అమరరాజా ప్రాజెక్టు వేగంగా అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మద్దతు ఇస్తోందని, ప్రభుత్వ సహకారంతో తమ ప్రాజెక్టును మరింత విస్తరిస్తామని ఈ సందర్భంగా గల్లా జయదేవ్ పేర్కొన్నారు. న్యూఎనర్జీ, లిథియం అయాన్ బ్యాటరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇతర రంగాల్లో మరిన్ని పెట్టుబడులకు సిద్ధమని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ.. అమరరాజా సంస్థ రాష్ట్రంలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. క్లీన్ ఎనర్జీకి తెలంగాణ కట్టుబడి ఉందని, కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు.

క్లుప్తంగా...

14న దావోస్ పర్యటనకు సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి విదేశీ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 14న దావోస్ పర్యటనకు వెళ్తున్నారు. దావోస్‌లో జరిగే ప్రపంచ దేశాల పారిశ్రామికవేత్తల సమావేశానికి సీఎంకు ఆహ్వానం అందింది. ఈ నేపథ్యంలో భారీ పెట్టుబడులు ఆకర్షించడానికి ఆయన వెళ్లనున్నారు. తిరిగి ఈనెల 20న హైదరాబాద్‌కు రానున్నట్లు సమాచారం. సీఎంతోపాటు పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ అధికారులు, సీఎం ముఖ్యకార్యదర్శి కూడా ఈ పర్యటనకు వెళ్తున్నట్లు సమాచారం.

టీఎస్‌టీఎస్ ఎండీగా శంకరయ్య



సాక్షి, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో అడిషనల్ కమిషనర్ (ఎన్నికలు)గా పనిచేస్తున్న జె.శంకరయ్య తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. జీహెచ్‌ఎంసీ నుంచి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆయన్ను టీఎస్‌టీఎస్ ఎండీగా నియమించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు గతంలో నిజాంపేట్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్ల కమిషనర్‌గా, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ, యూసీడీ, విద్యుత్ తదితర విభాగాల అడిషనల్ కమిషనర్‌గా పనిచేసిన శంకరయ్య.. మంచి ఆఫీసర్‌గా గుర్తింపు పొందారు.

'ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సుభాకర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ప్రతి నెలా మొదటి వారంలోనే పెన్షనర్ల బ్యాంకు ఖాతాలో పెన్షన్లు జమ అయ్యేలా చూడాలని, ఐఆర్‌ను కనీసం 20 శాతం పెంచాలని విన్నవించారు. పెన్షనర్ల భవన్ నిర్మించాలని, ప్రతీ జిల్లాలో కనీసం రెండు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి డాక్టర్లు, మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పెన్షనర్లకు చెల్లించే 'కమ్యూటేషన్ విలువ' తిరిగి చెల్లించే కాలాన్ని 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు కుదించాలని విజ్ఞప్తిచేశారు.

అభిషేక్ బోయినపల్లి బెయిల్‌పై విచారణ 29కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్ వ్యాపారవేత్త అభిషేక్ బోయినపల్లి బెయిల్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఇప్పటికే అభిషేక్ బోయినపల్లి 16 నెలలుగా జైలులో ఉన్నారంటూ న్యాయస్థానంకు ఆయన న్యాయవాది ముకుల్ రోహత్గీ తెలిపారు. బెయిల్‌పై వాదనలను వినిపించేందుకు మరింత సమయం కావాలంటూ అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు సుప్రీంకోర్టుకు వెల్లడించారు. దీంతో అభిషేక్ బెయిల్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈనెల 29కి వాయిదా వేసింది.


'లెక్చరర్ల బకాయిలు చెల్లించాలి'

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ బోర్డు పరిధిలో గతేడాది జరిగిన పరీక్షల్లో విధులు నిర్వహించిన అధ్యాపకులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంటర్ నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. దానిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనివల్లే పరీక్ష విధులు నిర్వహించిన అధ్యాపకులకు డబ్బులు ఇవ్వలేదని మధుసూదన్‌రెడ్డి విమర్శించారు.

ఆ అధికారం కేంద్రానిదే..

ఐఏఎస్, ఐపీఎస్ కేడర్ వివాదాన్ని డీవోపీటీకి అప్పగించిన హైకోర్టు

- రాష్ట్రాల మధ్య అధికారుల కేటాయింపు క్యాట్ పరిధిలోకి రాదని స్పష్టీకరణ
- అధికారుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి సూచన
- స్థానికత, పదేళ్ల సర్వీస్, ఇకపై ఉన్న సర్వీస్‌కాలం తదితరాలను పరిశీలించాలి
- ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాల మేరకు నిర్ణయం తీసుకోవాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) అధికారుల కేటాయింపుపై తలెత్తిన వివాదంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిబ్బంది, శిక్షణ విభాగానికి (డీవోపీటీ) అప్పగిస్తూ తెలంగాణ హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. రాష్ట్రాల మధ్య అధికారుల కేటాయింపులు చేసే పరిధి కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)కు లేదని తేల్చిచెప్పింది. రాష్ట్ర విభజన సమయంలో అధికారుల కేటాయింపు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాల మేరకు చట్టప్రకారం అధికారి వారీగా నిర్ణయం వెలువరించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అధికారుల అభ్యంతరాలను విడివిడిగా పరిశీలించాలని.. స్థానికత, పదేళ్ల సర్వీస్, ఇంకా మిగిలి ఉన్న సర్వీస్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. కేడర్ వివాదం ఎదుర్కొంటున్న అధికారులు డీవోపీటీకి పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. నీ మేరకు ప్రత్యూష్ సిన్హా కమిటీ కేటాయింపులను క్యాట్ మార్చడాన్ని సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుల ధర్మాసనం తీర్పునిచ్చింది.

కేడర్ వివాదం ఇదీ..

ఉమ్మడి ఏపీ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారులను ఇరు రాష్ట్రాల మధ్య విభజించారు. కమిటీ ఏపీకి కేటాయించిన కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించి.. తెలంగాణలో విధులు నిర్వర్తించేలా ఉత్తర్వులు పొందారు. కేంద్ర ప్రభుత్వం క్యాట్ ఉత్తర్వులను తప్పుబడుతూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. విచారణ జరిపిన హైకోర్టు.. గత ఏడాది జనవరిలో తెలంగాణ సీఎస్‌గా ఉన్న సోమేశ్‌కుమార్‌ను ఏపీకి వెళ్లాల్సిందేనంటూ తీర్పునిచ్చింది. ప్రత్యూష్ సిన్హా కమిటీ కేటాయింపులలో క్యాట్ జోక్యాన్ని తప్పుపట్టింది. అయితే కేడర్, సర్వీస్, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా తమ పిటిషన్లను విడిగా విచారించాలంటూ అప్పటి డీజీపీ అంజనీకుమార్ సహా ఇతర అధికారులు కోరడంతో.. ఆ విచారణను జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ బెంచ్‌కు అప్పగించింది.

వాదనలు సాగాయిలా..

కేంద్రం తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహ శర్మ వాదనలు వినిపించారు. ఏఐఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించి ప్రత్యూష్ సిన్హా కమిటీ కేటాయింపులకు వ్యతిరేకంగా ఉపశమనం పొందడం చట్టరీత్యా ఆమోదయోగ్యం కాదని వివరించారు. సోమేశ్‌కుమార్ అంశంలో తీర్పు సందర్భంగా హైకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఐఏఎస్, ఐపీఎస్‌ల తరపున న్యాయవాదులు కె.లక్ష్మీనరసింహ, గోదా శివ, సుధీర్ తదితరులు వాదనలు వినిపించారు. ''ధర్మాసనం అలా నిర్ణయాన్ని కేంద్రానికి వదిలేయవద్దు. పిటిషన్ల వారీగా విచారణ చేయాలి. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్ 80 ప్రకారం అధికారుల కేటాయింపునకు ఏర్పాటు చేసిన ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను ఐపీఎస్‌లు సవాల్ చేశారు. స్థానికతను పరిగణనలోకి తీసుకోవాలి'' అని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. కేడర్ వివాదం ఎదుర్కొంటున్న అధికారుల కేటాయింపు బాధ్యతను కేంద్రానికే అప్పగిస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రత్యూష్ సిన్హా కమిటీ కేటాయించిన తర్వాత క్యాట్ మార్పులు చేసిన అధికారులు వీరే..

పేరు	సర్వీస్	కేటాయింపు	క్యాట్ ఆదేశాలు	ప్రస్తుతం ఉన్నది
హరికిరణ్	ఐఏఎస్	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్	ఆంధ్రప్రదేశ్
అనంతరాము	ఐఏఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
ఎం.ప్రశాంతి	ఐఏఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	తెలంగాణ
వాకాటి కరుణ	ఐఏఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	తెలంగాణ
ఎ.వాణీప్రసాద్	ఐఏఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	తెలంగాణ
రోనాల్డ్ రాస్	ఐఏఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	తెలంగాణ
శ్రీజన గుమ్మళ్ల	ఐఏఎస్	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్	ఆంధ్రప్రదేశ్
శంషేర్‌సింగ్‌రావత్	ఐఏఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
కాటా ఆమ్రపాలి	ఐఏఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	తెలంగాణ
శివశంకర్	ఐఏఎస్	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్	ఆంధ్రప్రదేశ్
అంజనీకుమార్	ఐపీఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	తెలంగాణ
అభిలాష బిస్త్	ఐపీఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	తెలంగాణ
అభిషేక్ మహంతి	ఐపీఎస్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ	తెలంగాణ

(ఇందులో ప్రశాంతి, కరుణ, వాణీప్రసాద్ ప్రమోటీ ఐఏఎస్ అధికారులు)

భారం పడనీయం.. చార్జీలు పెంచం

- ప్రతినెలా మహాలక్ష్మికి నిధులు
- ఆదాయమార్గాలు అన్వేషించాలని ఆర్టీసీ అధికారులకు సూచన
- రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆర్టీసీ అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఆర్టీసీ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్ : ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకానికి నిధుల కొరత రానీయబోమని.. ఎప్పటి కప్పుడు ఆర్టీసీకి నిధులు సమకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రయాణికులపై ఎలాంటి చార్జీల భారం మోపబోమని...సంస్థ ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో వారిద్దరూ ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యామ్నాయ ఆదాయమార్గాలపై దృష్టి పెట్టాలని, నిర్వహణ సామర్థ్యం పెంచుకోవాలని అధికారులకు సూచించారు. టీఎస్ ఆర్టీసీ ఆర్థిక అంశాలు, మహాలక్ష్మి పథకం అమలుతీరు, ప్రభుత్వ ఆర్థిక సహాయం, తదితర విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో సంస్థ ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ పథకం కింద ఇప్పటివరకు 6.50 కోట్ల మంది మహిళలు ప్రయాణాలు సాగించడం గొప్ప విషయమని, ఈ పథకం ఇలానే ప్రశాంత వాతావరణంలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి రావాల్సిన బకాయిలు, సంస్థ అప్పులు, పీఎఫ్, సీసీఎస్, ఇతర సెటిల్‌మెంట్లకు సంబంధించిన నిధులపై సమీక్షించి..త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతీరోజు సగటున 27 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని, దాదాపు రూ.10 కోట్ల విలువైన జీరో టికెట్లు మంజూరు చేస్తున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారులు వివరించగా.. రోజు వారీ నిర్వహణకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూర్చుతుందని భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రజల సంస్థ.. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రత్యామ్నాయ ఆదాయమార్గాలపై సంస్థ ఆలోచిస్తోందని, టికెట్ ఆదాయంపైనే కాకుండా..లాజిస్టిక్స్, వాణిజ్య, తదితర టికెటేతర ఆదాయంపై దృష్టి పెట్టిందని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, రవాణా, రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్, కృష్ణకాంత్, ఆర్థిక సలహాదారు విజయపుష్ప, సీఎంఈ రఘునాథరావు, సీటీఎం జీవన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల గౌరవ వేతనం ఇప్పించండి

సీఈవో వికాస్‌రాజ్‌కు ట్రెసా విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పని చేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ఇందుకు సంబంధించిన ప్రోత్సాహక గౌరవ వేతనాన్ని ఇప్పించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కోరింది. ఈ మేరకు ట్రెసా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్‌లతో కూడిన ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధా నాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. జిల్లా కలెక్టర్ల ప్రతిపాదనల మేరకు ఇందు కోసం అదనపు బడ్జెట్ కేటాయించాలని విన్నవించింది. తమ వినతి పట్ల సీఈవో వికాస్‌రాజ్ సానుకూలంగా స్పందించారని ట్రెసా నేతలు తెలిపారు.

సావిత్రీబాయి జయంతి

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా

మంత్రిమండలిలో చర్చిస్తాం: మంత్రి సీతక్క



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క. చిత్రంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ, పంజగుట్ట (హైదరాబాద్): మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించే అంశంపై మంత్రి మండలిలో చర్చిస్తామని తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే 193వ జయంతుత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి మహిళా విద్యావంతురాలు కావాలని.. అప్పుడే సమాజం బాగుంటుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలతో పాటు ప్రతి మహిళ జీవితంలో వెలుగును తీసుకురావడానికి కృషి చేసిన ధీర వనిత సావిత్రీబాయి పూలేనని కొనియాడారు. అనంతరం వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ మనిమంజరి, బీసీ నాయకులు గణేష్‌చారి తదితరులు పాల్గొన్నారు. సావిత్రీ బాయి పూలే నాడు వేసిన విద్యా పునాదులే నేటి బాలికలకు ఆదర్శ అడుగుజాడలని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా భారతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదర్శ మహిళా టీచర్లకు, తెలంగాణ ఉద్యమకారిణులకు, మహిళా పాత్రికేయులకు ప్రత్యేక అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క పలువురు మహిళామణులను సత్కరించి జ్ఞాపికలను అందించారు.



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న అర్చక జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ తదితరులు

అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

డిప్యూటీ సీఎంకు అర్చక జేఏసీ చైర్మన్ ఉపేంద్రశర్మ వినతి

సుల్తాన్‌బజార్: అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను అర్చక జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి కోరారు. బుధవారం వారు భట్టిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి, నాచారం గుట్ట దేవాలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అధ్యాపకుల వయోపరిమితి పెంచాలి

సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్న అధ్యాపక వర్గాలు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకుల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలన్న డిమాండ్ అన్ని వర్గాల నుంచి వినిపిస్తోంది. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఉన్నత విద్య వర్గాలు కూడా ఈ వాదనను బలపరుస్తున్నాయి. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో పదవీ విరమణ వయసు 65 ఏళ్లు ఉండగా, మెడికల్ కాలేజీల్లోనూ బోధన సిబ్బంది రిటైర్మెంట్ వయసు కూడా 65 ఏళ్లకు ఉంది. చివరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగుల పదవీ విరమణ వయసును 61 ఏళ్లకు పెంచింది. కానీ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల రిటైర్మెంట్ వయసు మాత్రం 60 ఏళ్లుగానే ఉంది. రాష్ట్రంలో త్వరలో కొంతమంది అధ్యాపకులు రిటైర్ అయ్యే వీలుందని చెపుతున్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత తీవ్ర స్థాయిలో ఉంది. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే రిటైర్మెంట్ల కారణంగా మరికొన్ని ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. మరో పక్క రాష్ట్రంలోని కొన్ని వర్సిటీల వైస్ చాన్స్‌లర్ల పదవీ కాలం మరో ఐదు నెలలు మాత్రమే ఉంది. దీంతో కొత్త వీసీల నియామకం చేపడితే తప్ప యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీపై దృష్టి పెట్టే వీల్లేదు. ఈ సమయంలో బోధన సిబ్బంది కొరత విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే వీలుందని అధ్యాపక వర్గాలు అంటున్నాయి. 2024లోనే ఉస్మానియా యూనివర్సిటీ న్యాక్ అసెస్‌మెంట్‌కు వెళ్లాల్సిన అవసరం ఉంది. న్యాక్‌లో మంచి గ్రేడ్ వస్తే తప్ప రీసెర్చ్ ప్రాజెక్టులు ఈ యూనివర్సిటీకి వచ్చే అవకాశం లేదు. ఇతర వర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అధ్యాపకుల పదవీ విరమణ వయసును పెంచే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది.

70 శాతం రోగులకు యాంటీ బయోటిక్స్!

▶ మొదటి పేజీ తరువాయి

తీరుతెన్నులను నిర్ధారించడానికి వాచ్ గ్రూప్ యాంటీ బయోటిక్స్, యాక్సెస్ గ్రూప్ యాంటీ బయోటిక్స్, రిజర్వ్ గ్రూప్ యాంటీ బయోటిక్స్ అంటూ మూడు కేటగిరీలుగా విభజించారు. వీటిలో అత్యధిక సామర్థ్యం కలిగిన హయ్యర్ రెసిస్టెన్స్ పొటెన్షియల్ కిందకు వచ్చే వాచ్ గ్రూప్ తరహా యాంటీ బయోటిక్స్‌నే ఎక్కువగా సూచిస్తున్నారని సర్వే నిర్ధారించింది. అదే సమయంలో తక్కువ రెసిస్టెన్స్ పొటెన్షియల్ కలిగిన యాక్సెస్ గ్రూప్ రకాన్ని తక్కువగా సూచిస్తున్నట్టు వెల్లడించింది. యాక్సెస్ గ్రూప్ యాంటీ బయోటిక్స్ ప్రిస్క్రిప్షన్‌ను రెండు వెబ్‌సైట్లు మాత్రమే అధికంగా నమోదు చేశాయని తెలిపింది.

యాంటీ బయోటిక్స్ వల్ల ప్రతికూల ప్రభావం

చాలా కేసుల్లో పాలీ ఫార్మసీ (బహుళ ఔషధాలను ఒకే సమయంలో వినియోగించడం) గమనించామని, రెండు యాంటీ బయోటిక్స్ కలపడం వలన ప్రతికూల ప్రభావాలు చూపేందుకు, ఔషధ పరస్పర చర్యల ప్రమాదాన్ని పెంచేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఈ సర్వే నివేదికను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవ్య మంగళవారం విడుదల చేశారు. యాంటీ బయోటిక్స్ అధిక వాడకం వల్ల కలిగే హానిని దృష్టిలో ఉంచుకుని, రిజర్వ్ గ్రూప్ యాంటీ బయోటిక్స్ వినియోగం వీలైనంత తక్కువ స్థాయిలో ఉండేలా చూడాలని ఈ అధ్యయనం ఆసుపత్రులకు సిఫారసు చేసింది.

సావిత్రీ బాయి పూలే ఆశయాలను మోదీ కొనసాగిస్తున్నారు



సాక్షి, హైదరాబాద్: దేశంలో తొలి ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త, విద్యావేత్త సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్, పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రీ బాయి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

వీఆర్‌ఏల జీతాలు క్లియర్

15,560 మంది సిబ్బందికి ఊరట

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో పనిచేస్తూ వివిధ ప్రభుత్వ శాఖల్లో విలీనమైన గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ), రెవెన్యూలోనే మిగిలిన వారి వేతనాల చెల్లింపు అంశం కొలిక్కి వచ్చింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లాస్ట్ గ్రేడ్ సర్వీస్/రికార్డ్, జూనియర్ అసిస్టెంట్స్/తత్సమాన హోదాల్లో నియమితులైన వారితో పాటు రెవెన్యూ శాఖలోనే కొనసాగుతోన్న వారితో కలిపి మొత్తం 15,560 మందికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ), అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇతర శాఖల్లో విలీనమైన వీఆర్‌ఏలకు ఆయా శాఖల నుంచి, రెవెన్యూలోనే కొనసాగుతున్న వారికి ఆ శాఖ నుంచి వేతనాలు లభించనున్నాయి. ఈ ఉత్తర్వులతో ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వీఆర్‌ఏల వేతనాల చెల్లింపు, ఐడీ కార్డుల మంజూరీకి సమస్యలు తొలగిపోయినట్టయింది.

గత ఏడాది ఆగస్టు నుంచి జీతాల కోసం ఎదురుచూస్తోన్న 15,560 మందికి ఊరట కలగనుంది. కాగా, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి అంబాల శ్రీధర్‌గౌడ్, కన్వీనర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఏపీ సీఎం జగన్ ఇంటికి సోదరి షర్మిల

- తనయుడి వివాహానికి విచ్చేయాలని ఆహ్వానం
- వివాహ ఆహ్వాన పత్రిక అందించిన వైఎస్సార్ తనయ
- షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఆ పార్టీకి చెందిన నేతల ప్రకటన



మీడియాతో మాట్లాడుతున్న షర్మిల



బీటెక్ రవితో అనిల్‌కుమార్

సాక్షి, అమరావతి/కడప అర్బన్/గన్నవరం : వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో కలిశారు. తన తనయుడు రాజారెడ్డి వివాహానికి విచ్చేయాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. తొలి ఆహ్వాన పత్రికను మంగళవారం తన తండ్రి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ నుంచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ గ్రీన్ పవర్ అండ్ ఏవియేషన్స్ లిమిటెడ్ సంస్థకు చెందిన ప్రత్యేక విమానంలో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన షర్మిల.. ఇడుపులపాయకు రోడ్డు మార్గంలో వెళ్లారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద తనయుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను ఉంచి ఆశీస్సులు తీసుకుని, మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇడుపులపాయలోని గెస్ట్ హౌస్‌లో బస చేశారు.

వైఎస్సార్ మనవడి పెళ్లికి అందరినీ ఆహ్వానిస్తున్నా..

సీఎం రమేష్‌కు చెందిన అదే స్పెషల్ ఫ్లైట్‌లో తనయుడు రాజారెడ్డి, కూతురు అంజలి తదితరులతో కలిసి బుధవారం కడప నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న షర్మిలకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షర్మిల అక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి మనవడు రాజారెడ్డి వివాహానికి అందరినీ ఆహ్వానిస్తున్నానన్నారు. పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయని, అందరూ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం అక్కడికి ముందుగానే ప్యాసింజర్ ఫ్లైట్‌లో చేరుకున్న భర్త అనిల్‌కుమార్‌తో పాటు తనయుడు రాజారెడ్డి, కూతురు అంజలితో కలిసి తాడేపల్లిలోని సీఎం వైఎస్ జగన్ నివాసానికి చేరుకున్నారు. సుమారు అరగంటపాటు సీఎం వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తన తనయుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను సీఎం వైఎస్ జగన్‌కు షర్మిల అందజేశారు. అనంతరం తిరిగి గన్నవరం విమానాశ్రయం చేరుకుని, ఎయిర్ ఇండియా విమానంలో భర్తతో కలిసి ఢిల్లీకి బయలుదేరారు. కాగా, షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ప్రకటించారు.


బీటెక్ రవితో అనిల్‌కుమార్ చర్చలు

ప్యాసింజర్ ఫ్లైట్‌లో విజయవాడకు వెళ్లేందుకు షర్మిల భర్త అనిల్ కుమార్ బుధవారం కడప విమానాశ్రయం చేరుకున్నారు. అయితే అప్పటికే టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆ పార్టీ జమ్మలమడుగు సమన్వయకర్త భూపేష్‌రెడ్డి తండ్రి దేవగుడి నారాయణరెడ్డి (మాజీ మంత్రి, బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి సోదరుడు)లు కూడా విజయవాడకు వెళ్లేందుకు కడప విమానాశ్రయానికి వచ్చారు. వీరిద్దరితో వీఐపీ లాంజ్‌లో అనిల్‌కుమార్ సమావేశమవ్వడం ఆసక్తికరంగా మారింది. ఫ్లైట్ అరగంటపాటు ఆలస్యం కావడంతో బీటెక్ రవి, నారాయణరెడ్డి, అనిల్‌కుమార్ రాజకీయ పరిస్థితులపై మాట్లాడుకున్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని.. పీసీసీ అధ్యక్ష పదవి తీసుకుంటే.. కడప జిల్లాలో, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయని తనతో అనిల్‌కుమార్ చర్చించినట్లు బీటెక్ రవి మీడియాకు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న షర్మిలకు తన తరపున శుభాకాంక్షలు చెప్పాలని అనిల్‌కుమార్‌కు చెప్పానని బీటెక్ రవి అన్నారు. ఆ తర్వాత ఒకే ఫ్లైట్‌లో అనిల్‌కుమార్, బీటెక్ రవి, నారాయణరెడ్డిలు విజయవాడ చేరుకున్నారు.



'బంజారా చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): బంజారాల చరిత్ర ఎంతో గొప్పదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బంజారా సాహిత్య అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య సూర్య ధనుంజయ్, హైకోర్టు న్యాయవాది ధనుంజయ్ నాయక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రచించిన బంజారా చరిత్ర పుస్తకాన్ని బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఆవిష్కరించారు. లిఖిత చరిత్రలేని బంజారా గిరిజన తెగ చరిత్రను పుస్తక రూపంలో సమాజానికి అందించడం అభినందనీయమని సీఎం ప్రశంసించారు.



మీ ఆశయాలను కించపరిచే వారి నుండి దూరంగా ఉండండి. గొప్ప మనుమలు మాత్రమే మీరు కూడా గొప్పవారు కాగలరన్న నమ్మకాన్ని మీలో కలిగిస్తారు.

– మార్క్ ట్వైన్

సాక్షి

గురువారం, 4 జనవరి 2024

ఇప్పటికైనా గ్రహిస్తారా?!

సదుద్దేశమే ఉండొచ్చు... సత్సంకల్పమే కావొచ్చు... బాధిత వర్గాలకు బాసటగా నిలవాలన్నదే ధ్యేయం కావొచ్చు. కానీ చట్టాల రూపకల్పనలో, విధాన నిర్ణయాల్లో సంబంధిత వర్గాలను సంప్రదించటం అవసరమని మరోసారి రుజువైంది. ఎవరు పిలుపునిచ్చారో, వారి డిమాండ్లేమిటో స్పష్టత లేదు. కానీ చెదురుమదురుగా మొదలైన ట్రక్కు ఆపరేటర్ల మూడురోజుల సమ్మె 48 గంటలు గడవకుండానే దేశవ్యాప్తంగా తీవ్ర గందరగోళం సృష్టించింది. నిత్యావసరాలకు కొరత ఏర్పడి జనం అల్లాడారు. పలు రాష్ట్రాల్లో చేంతాడంత క్యూలు పుట్టుకొచ్చాయి. చివరకు ట్రక్కు ఆపరేటర్ల సంఘాలతో మాట్లాడాకే చట్టం అమలు చేస్తామని కేంద్ర హోమ్ శాఖ హామీ ఇవ్వటంతో మంగళవారం సాయంత్రానికి సమ్మె విరమించారు. వలసపాలనలోని చట్టాలన్నిటినీ ప్రక్షాళన చేసి, కొత్త చట్టాలు తీసుకొస్తున్నామని ఆ మధ్య కేంద్రం ప్రకటించింది. మొన్న ముగిసిన పార్లమెంటు సమావేశాల్లో వాటి తాలూకు బిల్లులు ఆమోదం పొందాయి. తాజాగా జరిగిన ట్రక్కు ఆపరేటర్ల మెరుపు సమ్మె భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని నిబంధనలపైనే! గతంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నామంటూ కేంద్రం మూడు చట్టాలను తీసుకొచ్చింది. ఆ చట్టాలపై దాదాపు ఏడాదిన్నరపాటు రైతులు సాగించిన ఉద్యమంతో చివరకు ఆ చట్టాలను వెనక్కు తీసుకోకతప్పలేదు. దాన్నుంచి తెలుసుకున్న గుణపాఠాలేమిటో గానీ... పాత నేర చట్టాలకు పాతరేస్తున్నామంటూ తీసుకొచ్చిన కొత్త చట్టాల పైన కూడా అలాంటి వివాదమే బయల్దేరింది. తమ వాదనేమిటో తెలుసుకోకుండా ఈ నిబంధనలు పెట్టారని ట్రక్కు ఆపరేటర్లు అంటున్నారు. పార్లమెంటులో ఆ చట్టాలపై చర్చ జరిగింది. కానీ ఆ సమయంలో భిన్నస్వరం వినిపించగలిగిన విపక్షంలో అత్యధికులు సస్పెండయ్యారు. చట్టసభల్లో వుండే మెజారిటీతో అధికారపక్షాలు ఎలాంటి బిల్లులనైనా సులభంగా దాటించవచ్చు. కానీ అమలు సమయంలో సమస్యలు తలెత్తుతాయని గ్రహించలేనంత అమాయకత్వంలో పాలకులుంటే ఎలా?

మన రహదారులు తరచు రక్తసిక్తమవుతున్నాయి. ట్రక్కు ఆపరేటర్ల నిర్లక్ష్యమో, అజాగ్రత్తో కానీ ఏటా వేలాదిమంది ప్రాణాలు బలవుతున్నాయి. గత నెలలో విడుదలైన 2022 నాటి జాతీయ క్రైమ్ రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం ఆ సంవత్సరం దేశంలో 47,806 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. అంటే సగటున రోజుకు 140 మంది, గంటకు ఆరుగురు చనిపోయారు. కేంద్రం విడుదల చేసిన రోడ్డు ప్రమాదాల నివేదిక గణాంకాలు మరోలా వున్నాయి. దానిప్రకారం 2022లో రోడ్డు ప్రమాదాల్లో 67,387 మంది మరణించారు. అంటే సగటున రోజుకు 85 మంది, గంటకు నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ గణాంకాలకు అందని దుర్మరణాలు మరెన్ని వున్నాయో చెప్పలేం. వీటిని అరికట్టడం కోసం కఠిన చట్టం తీసుకురావాలని కేంద్రం చాన్నాళ్లుగా అనుకుంటోంది. 2019లో అందుకోసం మోటారు వాహనాల చట్టాన్ని సవరించారు కూడా! కానీ భారీ జరిమానాలు వసూలు చేయటం మొదలెట్టిన కొద్దిరోజులకే వెల్లువెత్తిన వ్యతిరేకత కారణంగా దాదాపు అన్ని రాష్ట్రాలూ ఆ చట్టాన్ని అటకెక్కించాయి. ఈసారి బీఎన్ఎస్ వంతు వచ్చింది. వాస్తవానికి అదింకా అమల్లోకి రాలేదు. కానీ అది అమలైతే వాహనాల డ్రైవర్లకు కఠిన శిక్షలుంటాయి. ప్రస్తుతం అమల్లోవున్న ఐపీసీలోని 304ఏ ప్రకారం ప్రమాదకారకులై, పరారీ అయిన డ్రైవర్‌లకు గరిష్ఠంగా రెండేళ్ల శిక్ష, జరిమానా విధిస్తున్నారు. కానీ బీఎన్ఎస్‌లోని 106/2 ప్రకారం అలాంటి డ్రైవర్లకు పదేళ్ల వరకూ జైలు శిక్ష, రూ. 7 లక్షల జరిమానా ఉంటుంది. పరారీ కావటానికి ట్రక్కు ఆపరేటర్లు చెబుతున్న కారణాలు వేరే వున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు తప్పు ఎవరిదైనా స్థానికులు తమనే బాధ్యుల్ని చేసి కొట్టి చంపడానికి, వాహనాన్ని తగలబెట్టడానికి లేదా లూటీ చేయటానికి ప్రయత్నిస్తారని అందువల్లే అక్కడి నుంచి నిష్క్రమించడానికి ప్రయత్నిస్తామని వారి వాదన. అందుకే ట్రక్కు ఆపరేటర్లు సమ్మెకు దిగారు. ఒక బలమైన వర్గం దేన్నయినా వ్యతిరేకిస్తే ఏ చట్టమైనా ఆగి పోవాల్సిందేనని ఈ అనుభవం నిరూపిస్తోంది. బీఎన్ఎస్ ఇంకా అమల్లోకి రాలేదని, రోడ్డు ప్రమాదాల నిబంధనలపై అఖిల భారత మోటార్ ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్‌తో చర్చించాకే అమలు చేస్తామని తాజాగా కేంద్రం చెబుతోంది. వలసపాలకులు తెచ్చిన చట్టాల స్థానంలో 'మనవైన' చట్టాలుండాలని ఉబలాటపడటం మంచిదే! అందుకోసం సంబంధిత వర్గాలతో ముందే చర్చించివుంటే, కనీసం విపక్షాలతో సహా అందరూ తమ అభిప్రాయాలు తెలియజేసేవరకూ బిల్లుల ఆమోదాన్ని ఆపివుంటే వ్యవహారం వేరేగా ఉండేది.

నిజానికి రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వుండటం లేదని సాధారణ ప్రజానీకం భావిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకో, ఇతరేతర ప్రలోభాలకో లొంగి పోలీసులు ప్రమాదకారకుల్ని తప్పిస్తున్న ఉదంతాలు సరే, నిబంధనలు కూడా సరిగా లేవని నిపుణుల వాదన. కనుక బీఎన్ఎస్‌లో నిర్దేశించిన శిక్షలు, జరిమానాలు సరైనవేనని వారి వాదన. కానీ చట్ట రూపకల్పన ప్రక్రియ సరిగా సాగకపోవటం వల్ల సమస్య తలెత్తింది. అమల్లోకి రాకముందే సవరణలు చేయక తప్పని స్థితి ఏర్పడింది. రహదారులు మన ఆర్థిక వ్యవస్థకు రక్తనాళాల వంటివి. అవి ఆరు లేన్లు, ఎనిమిది లేన్లుగా విస్తరించాయి. కానీ వాటి నిర్మాణం, నిర్వహణ, వాహనాల అదుపు సక్రమంగా లేకపోతే ప్రమాదాలు ముంచుకొస్తాయి. ఇందుకు ట్రక్కు ఆపరేటర్లను మాత్రమే బాధ్యుల్ని చేసి చేతులు దులుపుకునే కంటే మెరుగైన పరిష్కారాలు వెదకటం ఉత్తమం.

సన్నకారుకు నారూ నీరూ!



విశ్లేషణ

దేవిందర్ శర్మ

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ప్రస్తుతం ఒక ఫలవంతమైన మార్పు నిశ్శబ్దంగా జరుగుతోంది. ఇది సరికొత్త సన్నకారు వ్యవసాయానికి పరివర్తనను రూపొందిస్తోంది. ఏపీలో ఎనిమిది లక్షల మంది రైతులు రసాయనాల నుంచి పూర్తిగా రసాయనేతర వ్యవసాయం వైపు మళ్లారు. లేదా పరివర్తన దశలో ఉన్నారు. 2031 నాటికి రాష్ట్రంలో మొత్తం 60 లక్షల వ్యవసాయ జనాభాను రసాయనాల నుండి సహజ వ్యవసాయానికి తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే రైతు సంక్షేమానికి నారు, నీరు నీరు పోయడమే! కార్పొరేట్ ప్రయోజనాలకు మాత్రమే సరిపోయే కాలం చెల్లిన ఆర్థిక విధానాలను నియంత్రించడం ద్వారా ఏపీ ప్రభుత్వం ఈ అద్భుతమైన మార్పును సాకారం చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా వీరపనేని గూడెం గ్రామానికి చెందిన సన్నకారు రైతు మహిళ రాధిక. ఆమెకు 1.1 ఎకరాల భూమి మాత్రమే ఉంది. దాంట్లో సహజ వ్యవసాయం సాగుతోంది. తన కొడుకు ఎంబీఏ చేశాడని, కూతురు అమెరికాలో చదువుతోందని ఆమె చెప్పినప్పుడు నేను నమ్మలేకపోయాను. పిల్లలు బాగా చదువుతున్నందున ఆమె వ్యవసాయాన్ని ఎందుకు వదిలిపెట్టలేదని అడిగాను. అందుకు ఆమె "నేను నా పని వదులుకుని వారితో కలిసి జీవించాలని నా పిల్లలు కోరుకుంటారు. కానీ మీరు ఏం చేస్తున్నారో అది చేయండి. అలాగే నేను ఏం చేస్తూ ఆనందిస్తున్నానో ఆ పనిని చేయనివ్వండి అని వారికి చెబుతున్నాను" అని పేర్కొంది. ఆమె సహజసాగు పంట పద్ధతిని అనుసరిస్తోంది, దీనినే ఏటీఎమ్ (ఎనీ టైమ్ మనీ) అని పిలుస్తారు. ఇది ఆమెకు క్రమం తప్పకుండా ఆదాయాన్ని అందిస్తోంది.

ఏటీఎమ్ అనేది ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ–నిర్వహణలోని సహజ వ్యవసాయ కార్యక్రమం కింద పొందుపరిచిన కార్యకలాపాల వర్గీకరణలో ఒక రూపం, ఇది ప్రకృతికి అనుగుణంగా వ్యవసాయం చేయడంలో భాగం. రెండు దశాబ్దాల క్రితం ఖమ్మం జిల్లాలోని పునుకల గ్రామం నుంచి ప్రారంభమైన ఈ వ్యవసాయ- పర్యావరణ సేద్య విధానం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాల్లోని 3,730 గ్రామాలకు విస్తరించింది. ఎనిమిది లక్షల మంది రైతులు రసాయనాల నుంచి పూర్తిగా రసాయనేతర వ్యవసాయం వైపు మళ్లారు లేదా పరివర్తన దశలో ఉన్నారు. 2031 నాటికి రాష్ట్రం మొత్తం 60 లక్షల వ్యవసాయ జనాభాను రసాయనాల నుండి సహజ వ్యవసాయానికి తరలించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

మైసమ్మ ఎన్టీఆర్ జిల్లా బత్తినపాడు గ్రామానికి చెందిన మహిళ. ఆమె రెండు ఎకరాల్లో పత్తి సాగు చేసేది. 2018లో సహజ వ్యవసాయం వైపు మళ్లింది. తన కూతురు ఏరోనాటికల్ ఇంజనీర్ అని చెప్పినప్పుడు, ఒక్క క్షణం నేను ఒక మధ్యతరగతి గృహిణితో మాట్లాడుతున్నట్లు అనిపించింది. అయితే వీరు చిన్న, సన్నకారు రైతులు. ఎక్కువగా మహిళలు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వీరు వాతావరణాన్ని తట్టుకోగల, పర్యావరణానికి ఆరోగ్యకరమైన సహజ వ్యవసాయ విధానపు సద్గుణాలు, బలాలతో పాటు దాని అపారమైన సంభావ్యత గురించి తమ అనుభవాలను పంచుకున్నారు.

వారిలో కొందరికి, సగటున 1 ఎకరం కంటే తక్కువ భూమి ఉంది. కొంతమందికి 0.10 నుండి 0.50 సెంట్ల వరకు భూమి ఉంది. ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్)కి చెందిన గుంటూరు ప్రధాన కార్యాలయంలో వీరు సమావేశమయ్యారు. దీనిని ప్రభుత్వ యాజమాన్యంలోని రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) నిర్వహిస్తోంది.



ప్రధాన స్రవంతి ఆలోచన ఆచరణీయమైన ప్రత్యామ్నాయాలను అమలు చేయడానికి ఎందుకు ప్రయత్నిస్తుందో వెనువెంటనే స్పష్టమైంది. చిన్న భూకమతాలు తరచుగా పనికిరానివిగా పరిగణించబడతాయి కాబట్టి భూ సంస్కరణలు, కార్మిక సంస్కరణల పేరుతో ఆర్థికవేత్తలు, కార్పొరేట్ నాయకులు వ్యవసాయం నుండి వారిని మినహాయించాలని వాదించారు, చిన్న కమతాల్లో పనిచేసేవారిని పట్టణ శ్రామికశక్తిలో ఏకీకృతం చేయాలని కోరుతారు. ఎందుకంటే ప్రపంచ ఆర్థిక రూపకల్పన చిన్న, సన్నకారు రైతులను ఆర్థిక భారంగా మారుస్తుంది. కానీ కొద్దిగా చేయూత నివ్వడంతోపాటు తగిన మార్కెటింగ్ కార్యక్రమాలు ఈ పొలాలను ఆచరణీయంగా మార్చగలవు, ఇవి భూగ్రహాన్ని వేడి చేయవు. గాలి, నీరు, నేలను విషపూరితం చేయవు.

50 సంవత్సరాల కాలంలో 51 దేశాలలో నిర్వహించిన అధ్యయనాల నుండి సేకరించిన డేటాతో కొంతకాలం క్రితం 'నేచర్' పత్రికలో వచ్చిన ఒక వ్యాసం నాకు గుర్తొస్తోంది. సాధారణంగా భావించే అవగాహనకు విరుద్ధంగా, చిన్న పొలాలు మరింత ఉత్పాదకత కలిగి ఉండి పర్యావరణపరంగా స్థిరమైనవి అని ఆ వ్యాసంలో పేర్కొన్నారు. కానీ అలాంటి అధ్యయనాలు ప్రధాన స్రవంతి సైన్స్ విధానంలో భాగం కావు. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, మీడియా, విధాన నిర్ణేతలు వ్యవసాయ వ్యాపార దిగ్గజాల వాణిజ్య ప్రయోజనాలను దశాబ్దాలుగా ఆమోదించారు. ఇవి సాంద్ర వ్యవసాయాన్ని మినహాయించి, పర్యావరణపరంగా ఆరోగ్యకరమైన, సమాన ఉత్పాదక, స్థిరమైన ఆహార వ్యవస్థ వైపు వెళ్లే ప్రయత్నాలను నిరోధించాయి.

అయినప్పటికీ ఒక నిశ్శబ్ద మార్పు జరుగుతోంది. ఇది కొత్త వ్యవసాయానికి పరివర్తనను రూపొందిస్తోంది. నేను దీనిని కొత్త వ్యవసాయం అని పిలుస్తాను. ఎందుకంటే మిగులు ఉత్పత్తిపై ఎక్కువగా ఆధారపడే సాంప్రదాయిక ఏకరూప వ్యవసాయ పద్ధతులు వ్యవసాయ భూములను ఎండిపోయేలా చేశాయి. భూములను నిర్వీర్యంగా మార్చాయి, భూగర్భ జలాలను తోడేశాయి. ఆహార గొలుసును కలుషితం చేశాయి. పైగా వ్యవసాయ జనాభా వ్యవసాయాన్ని విడిచిపెట్టి వలస వెళ్లవలసి వచ్చింది. ఇంకా ఇది మానవ వ్యాధులు, వాతావరణ అత్యవసర పరిస్థితుల అధిక భారానికి చెందిన ద్వంద్వ సవాళ్లకు దోహదపడింది.

అయితే, పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా, భవిష్యత్తులో ఈ రకమైన వ్యవసాయం పరిమిత పాత్రతో మిగిలిపోతుంది. అందుకే ఆహార వ్యవస్థను వ్యవసాయ – పర్యావరణ వ్యవస్థ వైపు మళ్లించడం అనేది ఆహార భద్రత, పోషణను మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరిస్తుంది. ఆర్థికంగా లాభదాయకమైన జీవనోపాధిని ప్రోత్సహిస్తుంది. తద్వారా ఉపాధి కల్పనకు దోహదం చేస్తుంది.

వ్యవసాయం గురించి పునరాలోచించడం ఈ కాలపు అవసరం. ఫిలిప్పీన్స్ నుండి వియత్నాం వరకు, కంబోడియా నుండి మెక్సికో వరకు; భారతదేశం నుండి అమెరికా వరకు, వ్యవసాయ-పర్యావరణ శాస్త్రం వైపు ఒక బలమైన, శక్తిమంతమైన ఉద్యమంగా నెమ్మదిగానే కావచ్చు కానీ స్థిరంగా విధానాలలో మార్పును తీసుకువస్తోంది. అయితే కార్పొరేట్ ప్రయోజనాలకు మాత్రమే సరిపోయే కాలం చెల్లిన ఆర్థిక విధానాలను విస్మరించాల్సిన అవసరం మాత్రం ఉంది. వ్యవసాయ పరిశోధన, విద్య కోసం పర్యావరణ స్థిరత్వం వైపు పరివర్తనను ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యమైనది.

జన్యుపరంగా మార్పు చెందిన బీటీ పత్తి విఫలం కావడం వల్ల కలిగే విధ్వంసాన్ని తీసుకోండి. వెండి బుల్లెట్‌గా కీర్తించబడినది దుమ్ములో కలిసిపోయింది. మరోవైపు సేంద్రియ పద్ధతిలో పత్తి సాగు చేస్తున్న ఎన్టీఆర్ జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ వంటి రైతుల్లో నాకు ఆశ కనిపిస్తోంది. అతని పొలంలో 100 కంటే ఎక్కువ బంతులతో పెద్ద సంఖ్యలో మొక్కలు ఉన్నాయి. 50 కంటే ఎక్కువ ఆరోగ్యకరమైన బంతులు ఉన్న మొక్కను మంచి పంటగా పేర్కొనవచ్చు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని, ఇది చాలా ప్రోత్సాహకరంగా ఉందన్నారు. అదే విధంగా అదే జిల్లాకు చెందిన గోపాలరావు 3.5 ఎకరాల్లో సేంద్రియ వరి సాగు చేశాడు. రెండేళ్ల క్రితం సేంద్రియ వ్యవసాయానికి మారిన ఆయన ఎకరాకు దాదాపు 30 క్వింటాళ్ల పంట వస్తుందని చెప్పారు. రసాయనేతర వ్యవసాయం కాబట్టి ఇది సాంద్ర వ్యవసాయంతో సానుకూలంగా పోలిక అవుతుంది. దీనికి మరిన్ని పరిశోధనలు, ప్రభుత్వ రంగ పెట్టుబడులు అవసరం. ఏమైనా మనం వెనక్కి తగ్గకూడదు. చిన్న, సన్నకారు రైతులను చేయి చేయి పట్టి సరైన దిశలో నడిపిద్దాం. అప్పుడే వ్యవసాయం మరింత ఆశాజనకం అవుతుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అక్షర అంకుశం



భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి (జనవరి 3) వేళ ఆమెకు నివాళులు. దేశంలో మహిళల హక్కుల కోసం ఆమె నినదించారు. కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. మహిళా విద్య ద్వారానే స్త్రీ పురుష సమానత్వం సాధ్యమౌతుందని నమ్మి, అందు కోసం కృషి చేశారు. ఎన్నో అవమానాలకు నిలిచి, గెలిచారు.

– దయానంద్ కాంబ్లే, ఐ అండ్ పి.ఆర్. డీజీ, మహారాష్ట్ర

విజయ రహస్యం



ఈ సంవత్సరం మీ ఎదుగుదల ప్రయాణంలో భాగంగా మీ వైఫల్యాలను కూడా స్వీకరించండి. ప్రతి ఎదురు దెబ్బ తిరిగి మిమ్మల్ని పైకి లేపడానికేనని నమ్మండి. జరిగిపోయిన దాని గురించి ఆలోచించక, జరగవలసిన దానిని ఆచరణలో పెట్టండి.

– టియాగో ఫోర్ట్, యూట్యూబర్

వీళ్లా బాధితులు?!



ఇజ్రాయెల్ ఇప్పుడే బీరుట్ (లెబనాన్) పై దాడి చేసింది. ఇది చాలా దుందుడుకు చర్య. ఈ తెల్లవారు జామున సిరియా రాజధాని డమా స్కస్‌పై బాంబు దాడి చేసింది. గాజాపై బాంబులు కురిపిస్తోంది. ఇజ్రాయెల్ తన పొరుగు దేశాలపై ఇంతలా దాడి చేస్తుంటే ఇంకా ఆ దేశాన్ని బాధిత దేశమనే అందామా?

– సారా, జియో పొలిటికల్ కామెంటేటర్

అనైతికం



బీజేపీ ఐటీ సెల్ సభ్యులు 'ఎక్స్' లో తమ ఫాలోవర్స్‌ను పెంచుకోడానికి హనీ ట్రాప్‌లను ఉపయోగిస్తున్నారు! ఇది వెంటనే దృష్టి పెట్టాల్సిన అంశం. సోషల్ మీడియాలో మిమ్మల్ని అనుసరించేలా వ్యక్తులను వశపరచుకోడానికి అలాంటి ఫొటోలను ఉపయోగించడం అనైతికం. చాలా దేశాల్లో ఇది చట్ట విరుద్ధం కూడా!

– తన్మయ్, రాజకీయ పరిశీలకుడు

అర్థం చేసుకోలేం!



మహిళల్ని వేటాడే నేరగాళ్లను ప్రజలు ఎందుకు విస్మరిస్తారు? వారి అకృత్యాలనెందుకు మరచిపోతారు? సెల్ఫీల కోసం ఎందుకు ఎగబడతారు. అదే సమయంలో వారి బారి నుంచి బయటపడ్డ బాధిత మహిళలెందుకు 'ట్రబుల్ మేకర్స్'గా పేరుబడతారు?!

– ఏంజెలికా అరిబామ్, సామాజిక కార్యకర్త

వారి వేళ్లకు చూపుంది!

ఒకానొక ఎలివేటర్ ప్యానెల్‌పై మీ వేలికొనలకు దిగువన ఉబ్బెత్తు చుక్కల స్పర్శని గమనించారా? అవి దృష్టి లోపంతో జీవిస్తున్న బిలియన్ల మందికి జ్ఞానం, స్వాతంత్ర్యం ప్రసాదించిన ప్రత్యేక గవాక్షాలు. వీటి సృష్టికర్త లూయీ బ్రెయిలీ! 1809 జనవరి 4న ఫ్రాన్స్‌లోని కూప్రే గ్రామంలో బ్రెయిలీ జన్మించాడు. మూడేళ్ల వయసులో ప్రమాదవశాత్తు కంట్లో దబ్బనం గుచ్చుకోవడం, ఆ తర్వాత రెండేళ్లకు ఇన్‌ఫెక్షన్‌తో రెండో కన్నూ పోవడంతో పూర్తిగా చూపు కోల్పోయాడు. ప్యారిస్‌లోని 'రాయల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది బ్లైండ్ యూత్'లో చేరి చదువుకున్నాడు. పాఠశాల వ్యవస్థాపకుడు వాలెంటిన్ హావె స్వయంగా రూపొందించిన ఒక ప్రత్యేక విధానాన్ని ఉపయోగిస్తూ పిల్లలకు చదవడం నేర్పించాడు. యువ బ్రెయిలీకి, చార్లెస్ బార్బియర్ కనుగొన్న సంక్లిష్టమైన 12–చుక్కల వ్యవస్థ 'నైట్ రైటింగ్' పరిచయం చేయబడింది. 1824లో 15 ఏళ్ల బ్రెయిలీ దానిని కేవలం 6 చుక్కలకు కుదించి సులభతరం చేసి 1837లో 'సెల్' వ్యవస్థను విజయవంతంగా రూపొందించాడు. దీంతో అక్షరాలు, సంఖ్యలు, సంగీతం నోట్స్ కూడా బ్రెయిలీలో సులభంగా రాయడం మొదలైంది.



లూయీ బ్రెయిలీ

తను సృష్టించిన ఈ లిపిని ప్రపంచంతో పంచుకోవడం కోసం తన యావత్ జీవితాన్నీ అంకితం చేశాడాయన. అయితే ఆయన జీవితకాలంలో రావాల్సినంత గుర్తింపు రాలేదాయనకు. చివరికి తన 43వ ఏట మరణించాడు. కానీ, ఆయన ఆవిష్కరణల దీపం మాత్రం మిలియన్ల మంది జీవితాలను ప్రకాశమానం చేస్తూనే ఉంది. అంధుడంటే ఒక అనివార్యమైన పరిమిత ప్రపంచంలో జీవించడమనే అనుకుంటారు. కానీ బ్రెయిలీ లిపి నాలాంటి అంధులకు ఉన్న పరిమితులను చెరిపివేసిందనే చెప్పాలి. కంప్యూటర్ ఆవిర్భావం తర్వాత స్పీచ్ సింథసైజర్‌ల ద్వారా మనం టైప్ చేసిన పదాలను తిరిగి చదవడంతో జ్ఞాన సముపార్జనకు అంతే లేకుండా పోయింది.

కుర్జ్‌వీల్ 1976లో పుస్తకాలను స్కాన్ చేసి వాటిని సింథటిక్ స్పీచ్‌లో చదివే సాంకేతికతను అభివృద్ధి చేయడం ద్వారా చదువరుల విజ్ఞాన జిజ్ఞాసకు మరింత విస్తృతి పెంచాడు. నేడు ఇది ల్యాప్‌టాప్ ప్రోగ్రామ్ (కుర్జ్‌వీల్), సాంకేతికత యొక్క సూక్ష్మీకరణకు నిదర్శనం. మోటారు బైక్ రేసర్ అయిన టెడ్ హెంటర్ వంటి హీరోలు బ్లైండ్ టెక్ ఛాంపియన్లుగా మారారు. కంప్యూటర్‌లను మాట్లాడే సహచరులుగా మార్చే స్క్రీన్ రీడర్ 'జా' (జేఏడబ్ల్యూ)ని అంధులకు బహుమతిగా ఇచ్చారు. ప్రస్తుతం మరెన్నో సాంకేతిక వెసులుబాటులు అంధులకు అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా వారు అనేక రంగాల్లో ముమ్ముందుకు దూసుకు పోగలుగుతున్నారు. ఉపాధి, విద్య, ప్రజాస్వామిక వ్యవస్థల్లో భాగస్వామ్యం, రిజర్వేషన్లు వంటి అంశాలలో ప్రభుత్వాలు దృష్టి లోపం ఉన్న వ్యక్తులకు సరైన అవకాశాలు ఇవ్వడం లేదనే చెప్పాలి. అంధులు కేవలం గాయకులు, రిసెప్షనిస్టులు లేదా డేటా ఎంట్రీ స్పెషలిస్టుల వంటి ఉద్యోగాలకు మాత్రమే సరిపోతారని చాలా మంది అనుకుంటారు. ఇది నిజం కాదు. అంధత్వం అంటే చీకటి మాత్రం కాదు. అంధులు సివిల్ సర్వెంట్లు, లాయర్లు, బ్యాంకర్లు, అథ్లెట్లు, కళాకారులుగా తమ ప్రతిభా పాటవాలు చాటుకుంటున్న సంగతి గమనార్హం.

లూయీ బ్రెయిలీ లేకుంటే, అంధుల ప్రపంచం చాలా దుర్భరంగా ఉండేది. చూడలేని కళ్ళ వెనుక చూసే మెదడు, ఆలోచించే మనసు, కన్న కలలు నిజం చేసుకొని స్వతంత్రంగా జీవించాలనే హృదయం ఉంటాయి. ఎవరికైనా వైకల్యం ఉన్నదంటే అది అసమర్థత కాదు. ఎందుకంటే, 'వారి చెవులకు కళ్ళున్నాయి, వారి వేళ్లు చూస్తాయి!

– సాయి వానపల్లి | ఢిల్లీ జేఎన్‌యూ 'సెంటర్ ఫర్ పొలిటికల్ స్టడీస్'లో పరిశోధకుడు

ఒకవైపు వాగ్దానాలు భంగమవుతుంటే...




సందర్భం

అదితీ ముఖర్జీ

ప్రపంచ సగటు ఉష్ణోగ్రతను 2 సెంటీగ్రేడ్ డిగ్రీల లోపు ఉంచవలసిన పరిమితిని నవంబర్ 17, 18లలో వరుసగా రెండు రోజుల పాటు మనం ఉల్లంఘించిన (తాత్కాలికంగా అయినప్పటికీ) సంవత్సరంగా 2023 చరిత్రలో నిలిచి పోనుంది. గ్లోబల్ సగటు ఉష్ణోగ్రతను '2 సెంటీగ్రేడ్ డిగ్రీల కంటే తక్కువగా' ఉంచాలని 2015లో ప్యారిస్‌లో జరిగిన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సీఓపీ) నిర్దేశించింది. కానీ ఈ ఏడాదిలో నవంబర్ చివరి వరకు, ఎనభై ఆరు రోజులపాటు పారిశ్రామికీకరణ పూర్వ స్థాయి కంటే అధికంగా 1.5 సెంటీగ్రేడ్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మన రోజువారీ ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు చాలా ఎక్కువగా ఉన్నందున, సగటు ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.5 నుండి 2 సెంటీగ్రేడ్ డిగ్రీల వరకు పెరగడంపై అంత ప్రాధాన్యం ఎందుకు ఇవ్వాలని చాలామంది నన్ను అడుగుతారు. అయితే, ఈ రెండు సంఖ్యలు పోల్చదగినవి కావు. ఇక్కడ, మనం దీర్ఘకాలిక సగటు ఉష్ణోగ్రతల పెరుగుదల గురించి మాట్లాడుతున్నాం. ప్రపంచ ఉష్ణోగ్రత స్థాయిలలో ఇటువంటి పెరుగుదలలు శాశ్వత స్థితిలో జ్వరంతో ఉన్న శరీరానికి సమానంగా ఉంటాయి. 'భూతాపానికి తిరుగులేని కారణం ఏమిటంటే మానవ కార్యకలాపాల కారణంగా కార్బన్ డయాక్సైడ్ సహా గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలేనని విజ్ఞానశాస్త్రం చెబుతోంది. మనం విద్యుత్తును ఉత్పత్తి చేసే విధానం, ప్రయాణించే విధానం లేదా ఆహారాన్ని ఇచ్చే పంటలను పెంచే విధానమే గ్రీన్ హౌస్ ఉద్గారాలకు కారణమవుతుంది. అందువల్ల, భూతాపాన్ని తగ్గించడానికి ప్రధాన మార్గం అటువంటి వాయువుల ఉద్గారాలను తగ్గించడమే. ఉద్గారాలను తగ్గించడాన్ని సైన్స్ సాహిత్యంలో ప్రమాద తీవ్రతను తగ్గించడం అంటారు.

'వేడెక్కుతున్న ప్రపంచానికి సంబంధించిన ప్రభావాలు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్క మనిషీ ఈ సంవత్సరం వాతావరణ సంక్షోభ ప్రభావాలను అనుభవించాడు. తీవ్రమైన ఉష్ణోగ్రతల ద్వారా (మార్చి, ఏప్రిల్‌లో దక్షిణాసియా అంతటా వేడి తరంగాలు), విపరీతమైన వర్షపాతం లేదా కరవుల ద్వారా (ఈ సంవత్సరం భారత ఉపఖండంలో ఆలస్యమైన, అస్థిరమైన రుతుపవనాలు) తుఫాను ఆటంకాలు (మిచాంగ్ తుపాను ఈ డిసెంబరులో చెన్నైని తాకడం), లేదా హిమానీనదాలు వేగంగా కరగడం (సిక్కింలో



విధ్వంసం, హిమనదీయ సరస్సు ప్రబలడంతో వరదల కారణంగా 1,200 మెగావాట్ల తీస్తా ఐఐఐ ఆనకట్ట కూలిపోవడంతో సహా)... ఇలా ప్రపంచం నలుమూలల నుండి ఇలాంటి ఉదాహరణలను జోడించవచ్చు. ఇది బద్దలైన వాతావరణ రికార్డుల సంవత్సరం. దీనివల్ల ప్రపంచంలోని కొన్ని పేద దేశాలు ఎక్కువగా నష్టపోయాయి.

కాగా, ఈ సంవత్సరం... దేశం తర్వాత దేశం వారీగా వాతావరణ కార్యాచరణ కోసం చేపట్టిన వాగ్దానాలు విఫలమైపోయిన సంవత్సరంగా కూడా నిలిచిపోయింది. వాతావరణ చర్యకు మద్దతు ఇవ్వాలంటే ఆర్థిక వనరులు–ద్రవ్యం– అవసరం, ఇందులో ఉపశమనం, అనుసరణ రెండూ ఉన్నాయి. అన్ని దేశాలూ ఈ శతాబ్ది చివరి నాటికి ప్రపంచ ఉష్ణోగ్రతలను 1.5 సెంటీగ్రేడ్ డిగ్రీల లోపల ఉంచుతామని ప్యారిస్ ఒప్పందంపై సంతకాలు చేసినప్పటికీ, ఆ యా దేశాలు తాము జాతీయంగా నిర్దేశించుకున్న సహకారంలో భాగంగా ఉపశమన చర్యలు చేపడతామన్నాయి. ఇవి కార్యాచరణకు నోచుకునే 2100 నాటికి ప్రపంచ ఉష్ణోగ్రతలు 2.5 నుంచి 3 సెంటీగ్రేడ్ డిగ్రీలకు చేరతాయి. ముఖ్యంగా ఉష్ణమండలంలో నివసించే మనం అభివృద్ధి చెందడానికి ఈ వాతావరణం ఆటంకంగా నిలుస్తుంది. దుబాయ్‌లో ఇటీవల ముగిసిన కాప్–28 తన ఆశయాన్ని పెంచుకోలేక పోయింది, అయినప్పటికీ, మొదటిసారిగా శిలాజ ఇంధనాల పాత్రను, వాటి నుండి దూరంగా ఉండవలసిన అవసరాన్ని అది తన తుది ప్రక టనలో గుర్తించింది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలో వాతావరణ కార్యాచరణ లేకపోవడానికి ఆర్థిక వనరులు, అమలు సాధనాల కొరత కారణం. శిలాజ ఇంధనాల దహనం ద్వారా అపారమైన ప్రయోజనం పొందిన ధనిక దేశాల నుండి అధికంగా, చారిత్రకంగా ఉద్గారాలు జరిగినప్పటికీ అదే సంపన్న దేశాలు, ఇప్పుడు శిలాజ ఇంధనాల నుండి అవసరమైన పరివర్తనకుగాను పేద దేశాలకు ఆర్థిక సహాయం చేయడానికి నిరాకరించాయి. ప్రస్తుత శీతోష్ణస్థితి సంక్షోభానికి ఇదే ప్రధాన కారణం. ఉదాహరణకు, సంవత్సరానికి 100 బిలియన్ డాలర్ల వాతావరణ సంబంధిత ఫైనాన్స్‌ను సమకూరుస్తామని ధనిక దేశాలు చేసిన ప్రతిజ్ఞ ఎప్పుడూ నెరవేరలేదు.

అనేక నివేదికలు వాతావరణ మార్పులకు అనుగుణంగా ఉత్పత్తి వ్యవస్థలను, విధానాలను మార్చుకోవడానికి అవసరమైన పెట్టుబడులతో సహా సంస్థాగత మద్దతు లేదని చెబుతున్నాయి. ఉదాహరణకు, మారుతున్న వాతావరణం, శీతోష్ణస్థితి విధానాలకు అనుగుణంగా మన రైతులు తమ పంటల విధానాలను, పంట చక్రాల (క్రాప్ సైకిల్స్)ను సర్దుబాటు చేసుకునే క్రమంలో వారు ప్రయోగాత్మక ప్రాతిపదికన ప్రభుత్వం నుండి పెద్దగా సహాయం లేకుండానే ముందుకు వెళుతున్నారు. పైగా అనుసరణ (ఎడాప్టేషన్)కు అవసరమైన నిధులు తక్కువగా ఉంటున్నాయి.

2023లో అత్యంత ప్రధానంగా నొక్కిచెప్పిన విషయం నష్టం, నష్ట నిధికి సంబంధించిన కార్యాచరణ. హిమాలయ ప్రాంతంలో మంచు కరగడం వల్ల ప్రజలు వేరే చోటికి మకాం మార్చవలసి వస్తోంది. పైగా వారు తమ సంప్రదాయ జీవన విధానాలను కోల్పోతున్నారు.

వాతావరణ హాని ప్రభావానికి గురవుతున్న దేశాలు దాదాపు 20 సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ వచ్చిన తర్వాత, ఈజిప్టులో జరిగిన కాప్27 సదస్సులో నష్టాలు, ప్రమాదాల నిరోధక నిధిని ఏర్పర్చడానికి అన్ని దేశాలు అంగీకరించాయి. చివరకు దుబాయ్‌లో జరిగిన కాప్28లో, ఈ ఫండ్ అమలులోకి వచ్చింది. అభివృద్ధి చెందిన దేశాలు దీనికి దాదాపు 500 మిలియన్ డాలర్లను అందించాయి. అయితే ఈ ఏడాది వాతావరణ సంబంధిత నష్టాలు బిలియన్ల కొద్దీ డాలర్లను దాటిన నేపథ్యంలో ఈ సహాయం చాలా చిన్నదనే చెప్పాలి.

వాతావరణ సంక్షోభాన్ని కలిగించడంలో లేదా దాని పరిహారణకు సహకరించడంలో వ్యక్తులుగా మనకు ఎలాంటి పాత్ర లేదని అనిపించవచ్చు. కానీ ఇది నిజం కాదు. జనాభా అత్యధిక ఆదాయాన్ని పొందే పది శాతం లోపు ప్రజల జీవన శైలి... మొత్తం గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల్లో 60 శాతం నుండి 70 శాతం వరకు కారణమవుతోందన్న సంగతి ఇక్కడ గమనార్హం. మనం ఎలక్ట్రిక్ వాహనాల్లో ప్రయాణించడం, వాతావరణానికి హాని చేకూర్చని వ్యవసాయాన్ని చేయడం, అవసరానికి మించి వస్తువులను కొనుగోలు చేయకపోవడం వంటి చర్యల ద్వారా వాతావరణ రక్షణలో మన వంతు పాత్ర నిర్వహించవచ్చు.

వ్యాసకర్త సీజీఐఏఆర్ క్లైమేట్ ఇంప్యాక్ట్ ప్లాట్‌ఫామ్ డైరెక్టర్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.అష్టమి రా.6.29, తదుపరి నవమి, **నక్షత్రం:** హస్త ప.2.50 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.11.31 నుండి 1.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.14 నుండి 11.02 వరకు, తదుపరి ప.2.41 నుండి 3.29 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.14 నుండి 10.12 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.35.

క్లుప్తంగా...

11న 'అలిశెట్టి' రాష్ట్రస్థాయి పురస్కారాలు

జగిత్యాల: సాహితీ కళా వేదిక జగిత్యాల వారి ఆధ్వర్యంలో ఈనెల 12న ప్రముఖ కవి అలి శెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతిని పురస్కరించుకుని 11వ తేదీన రాష్ట్రస్థాయి పురస్కా రాలు అందించనున్నారు. ఈ పురస్కారాలకు ఆదోనికి చెందిన కవయిత్రి జంగం స్వయంప్రభ, కరీంనగర్‌కు చెందిన వాణిశ్రీ, మెట్ పల్లికి చెందిన శరత్‌చంద్ర, హైదరాబాద్‌కు చెందిన సురేందర్ ఎంపికైనట్లు సాహితీ కళావేదిక అధ్యక్షుడు గుండేటి రాజు తెలిపారు. కవి స మ్మేళనంలో పాల్గొనేందుకు ఈనెల 7లోపు దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాల్గొ న్న వారికి అలిశెట్టి కవిత్వంపై జగిత్యాలలోని శివ సాయి రెసిడెన్సీలో సమ్మేళనం ఉంటుందన్నా రు. మిగతా వివరాలకు 93915 35566 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.



తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ప్రత్యేక కార్యదర్శి, ఎండీ విజేంద్ర బోయి, సీఈ ఈశ్వరయ్య, ఎస్ఈ చైతన్య కుమార్ తదితరులు

వట్టె జానయ్య పిటిషన్లపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: సూర్యాపేట డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపులు, దొంగతనం, దోపిడీ కేసులకు సంబంధించి ఊరట కోరుతూ జానయ్య దాఖలు చేసిన పిటిషన్లను బుధవారం జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా కొలువుదీరినందున కౌంటరు దాఖలు చేసేందుకు సమయం కావాలని తెలంగాణ తరఫు న్యాయవాది దేవినా సెహ్‌గల్ కోరారు. దీనికి అనుమతించిన ధర్మాసనం విచారణను నాలుగువారాలు పాటు వాయిదా వేసింది.

ప్రజా సంఘాలపై నిషేధాన్ని ఎత్తివేయాలి

సాక్షి, హైదరాబాద్: ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ కావాలని, మావోయిస్టు, అనుబంధ ప్రజా సంఘాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉపా కేసులను రద్దు చేసి, ఎన్ఐఏ దాడులను ఆపాలంటూ ఆ పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ బుధవారం లేఖ విడుదల చేశారు.

కళలకు సముచిత ప్రాధాన్యం: మంత్రి జూపల్లి

- బ్రహ్మానందానికి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో మరుగున పడిన శాస్త్రీయ, నాట్య, సంగీత కళలకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో రాగ సప్తస్వరం 35వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు బ్రహ్మానందంకు జీవిత సాఫల్య పురస్కారం, స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేశారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ బ్రహ్మానందానికి పురస్కారాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. అంతకు ముందు వింజమూరి సుజాత ఆధ్వర్యంలో కృష్ణవేణి పేరిట నిర్వహించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో టర్కీ ప్రభుత్వ కన్సల్టెంట్ జనరల్ ఎల్మన్ పోకాన్, నటుడు మురళీమోహన్, జమైకా ట్రేడ్ కమిషనర్ వింజమూరి సుజాత, రాగసప్తస్వరం వ్యవస్థాపక అధ్యక్షురాలు వీఎస్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రేపు జేఎన్‌టీయూ స్నాతకోత్సవం



బాలానగర్: జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయంలోని జేఎన్ ఆడిటోరియంలో 12వ స్నాతకోత్సవాన్ని (కాన్వొకేషన్) శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉపకులపతి కట్టా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇస్రో చైర్మన్ శ్రీధర పణికర్ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. 54 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామన్నారు. సమావేశంలో రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ డా. మంజూరు హుస్సేన్, ప్రిన్సిపాల్ కె. విజయ్‌కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి, ప్రజా సంబంధాల అధికారి ప్రసన్నకుమార్, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో కోటిన్నర స్వాహా

ఓ సబ్ పోస్టుమాస్టర్ నిర్వాకం

- పోలీసుల విచారణలో వెలుగులోకి
- కోర్టులో లొంగిపోయిన సబ్ పోస్టుమాస్టర్?

నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లా నందికొండ మున్సిపాలిటీ పైలాన్ కాలనీలోని సబ్ పోస్టాఫీస్‌లో ఖాతాదారుల సొమ్ము సుమారు కోటిన్నరకుపైగానే సబ్ పోస్టుమాస్టర్ స్వాహా చేసినట్టు విచారణలో తేలింది. ఖాతాదారులు, పోస్టల్ డిపార్టుమెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నాగార్జునసాగర్ సీఐ బీసన్న బుధవారం తపాలా కార్యాలయానికి వెళ్లి విచారణ చేశారు. పోలీసులు విచారణ చేస్తున్న సమయంలో ఖాతాదారులు, డిపాజిటర్లు వారి పాసుబుక్‌లతో పెద్ద సంఖ్యలో వచ్చారు. సబ్ పోస్టుమాస్టర్ రామకృష్ణ పోస్టాఫీసు ఖాతాదారులకు డూప్లికేట్ పాసుపుస్తకాలు ఇచ్చి ఖాతాలో వేసిన నగదును ఆ పాసుపుస్తకంలోనే రాసి ఇస్తూ నగదును తన సొంత ఖాతాలో జమ చేసుకున్నట్లు పోలీసులు తేల్చారు. అలాగే ఖాతాదారుల ఫోన్ నంబర్లు కూడా మార్చి వేరే నంబర్లు నమోదు చేసినట్లు వెల్లడైంది. ఖాతాదారుల అకౌంట్లలోని నగదును విత్‌డ్రా చేసుకోవడంతో పాటు డిపాజిట్‌దారుల సొమ్మును విత్‌డ్రా చేసినట్లు తేలింది. ఖాతా నంబర్లకు లింకయిన ఫోన్ నంబర్లను ముందస్తుగానే మార్చడంతో నగదు విత్‌డ్రా చేసినప్పుడు వేరేవారికి సమాచారం వెళ్లలేదని విచారణలో తేలింది.

పసిగట్టని అధికారులు

లక్షల రూపాయలు విత్‌డ్రా అవుతుంటే సంబంధిత ఉన్నతాధికారులు పసిగట్టలేకపోయారు. గతంలో ఒక ఖాతా నుంచి చిన్న మొత్తాన్ని విత్‌డ్రా చేసుకున్నా.. ఫోన్ చేసి మీరు మీ నగదును విత్‌డ్రా చేసుకున్నారా అని అడిగేవారని, ఇంత నగదు అతి తక్కువ కాలంలో విత్‌డ్రా అవుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. డిసెంబర్ రెండవ వారంలోనే నగదు లెక్కల్లో తేడా వచ్చినట్లు గమనించి 17వ తేదీన రామకృష్ణను పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వెంటనే విచారణ చేసిన పోస్టల్ అధికారులు ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, రామకృష్ణ డబ్బులతో పరారవుతుంటే పోస్టల్, పోలీస్ శాఖలు ఏం చేసినట్లని ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. కాగా, అనుముల మండలం హజారుగూడెంకు చెందిన సదరు సబ్ పోస్టుమాస్టర్ రామకృష్ణ శనివారం నిడమనూరు కోర్టులో లొంగిపోయినట్లు తెలిసింది.



సబ్ పోస్టాఫీసులో విచారణ చేస్తున్న సీఐ బీసన్న

6 గ్యారంటీల కోసం ఇందిరమ్మ కమిటీలు

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ తీసుకోవాలని, ప్రజలకు చేరవేసే పనిని పార్టీ కార్యకర్తలకు అప్పగించాలని నిర్ణయించారు.

12 స్థానాల్లో గెలుపే ధ్యేయం

లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 12 స్థానాల్లో గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలని, ఇందుకోసం రేవంత్‌రెడ్డి సమక్షంలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రోడ్‌మ్యాప్‌లో భాగంగా ఈనెల 8వ తేదీన 5 ఉమ్మడి జిల్లాలు, 9న మరో 5 జిల్లాల నేతలతో ఆయన సమీక్ష నిర్వహించాలని, ఆ తర్వాత 10, 11, 12 తేదీల్లో 17 లోక్‌సభ నియోజకవర్గాల సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ నెల 20 తర్వాత ముఖ్యమంత్రి క్షేత్రస్థాయికి వెళ్లాలని నిర్ణయించారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా కొత్తగా నియమితులైన దీపాదాస్ మున్షీ, ఇప్పటివరకు ఇన్‌చార్జిగా పనిచేసిన మాణిక్‌రావ్ ఠాక్రేలను అభినందిస్తూ వేర్వేరు తీర్మానాలు, లోక్‌సభ ఎన్నికల్లో సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరుతూ మరో తీర్మానాన్ని రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

మరింత టీం వర్క్ కావాలి: మున్షీ

సమావేశంలో దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ..తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు పదేళ్ల పాటు కష్టపడ్డారని అన్నారు. భవిష్యత్తులో మన ముందు చాలా ఎన్నికలున్నాయని, ఈసారి ఎన్నికల్లో గెలుపొందేందుకు కార్యకర్తలు మరింత శ్రమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం ఉండాలని, మరింత టీంవర్క్‌తో కలిసి పనిచేయాలని కోరారు.

పదవులు అవే వస్తాయి...పైరవీలు అవసరం లేదు

నామినేటెడ్ పోస్టుల భర్తీపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు అవే వస్తాయని, పైరవీలు చేసి కాగితాలు తీసుకురావాల్సిన అవసరం లేదని చెప్పినట్టు తెలిసింది. పదవుల భర్తీలో సామాజిక న్యాయం పాటిస్తామని, బీఫారాలు ఇంటికి వచ్చినట్టే నామినేటెడ్ పదవులూ వస్తాయని చెప్పినట్టు సమాచారం. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నట్టే గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను నియమించాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ కోరగా ఇందిరమ్మ కమిటీలతో సహా అన్ని పదవులూ త్వరలోనే భర్తీ చేస్తామని సీఎం రేవంత్ హామీనిచ్చారు.

ఆరు గంటలకు పైగా ట్రాఫిక్ ఇబ్బందులు: టీపీసీసీ సమావేశం సందర్భంగా గాంధీభవన్, నాంపల్లి, ఆబిడ్స్, మొజాంజాహి మార్కెట్ పరిసరాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా, సీఎం మధ్యాహ్నం 3: 30కి గాంధీభవన్‌కు చేరుకున్నారు. అయితే అంతకంటే ముందే ట్రాఫిక్ జామ్ అయింది. మంత్రుల కాన్వాయ్‌లోని వాహనాలు, పైలట్ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేశారు. పెద్ద ఎత్తున వచ్చిన కార్యకర్తల వాహనాలతో గాంధీభవన్ పరిసరాలన్నీ కిటకిటలాడిపోయాయి. దీంతో రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

మల్లు రవిని అడ్డుకున్న పోలీసులు

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవిని పోలీసులు గాంధీభవన్ ప్రధాన ద్వారం వద్దే ఆపేశారు. భేటీకి హాజరయ్యే నేతల జాబితాలో పేరుంటేనే లోపలికి పంపుతామని చెప్పారు. దీంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను అడ్డుకుంటారా అని గట్టిగా కేకలు వేస్తూ లోనికి వెళ్లారు. మరోవైపు దీపాదాస్ మున్షీ గాంధీభవన్‌లోకి ప్రవేశించేందుకు పోలీసులు ఓవైపు నుంచి మార్గం ఏర్పాటు చేయగా, డ్రైవర్ ప్రధాన ద్వారం వైపునకు వాహనం తీసుకు వచ్చారు. పోలీసులు అనుమతించకపోవడంతో ఆమె అక్కడే దిగి నడుచుకుంటూ గాంధీభవన్‌లోకి వెళ్లాల్సి వచ్చింది.



దీపాదాస్ మున్షీని అభినందిస్తున్న జగ్గారెడ్డి. చిత్రంలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తదితరులు



గాంధీభవన్ వద్ద పోలీసులతో మల్లు రవి వాగ్వాదం

ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరతాం: రేవంత్

కాంగ్రెస్ కేడర్ అవిశ్రాంత కృషితోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని రేవంత్‌రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించే బాధ్యతను తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరతామన్నారు. ఎన్నికల్లో బోర్లాపడి బొక్కలు విరిగినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదని, తాము అధికారంలోకి వచ్చి నెలరోజులు గడవక ముందే కాంగ్రెస్ హామీలపై పుస్తకాలు విడుదల చేస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీ విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదాయం తగ్గినట్టుందని, అందుకే కాళేశ్వరంపై ఆయన సీబీఐ విచారణ కోరుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో కాళేశ్వరంపై తానే స్వయంగా సీబీఐ విచారణను కోరానని, అప్పుడు బీజేపీ నేతలు ఏం చేశారని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు తోడుదొంగలని, ఇద్దరూ కలిసే కాళేశ్వరం పేరుతో దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతిపై న్యాయ విచారణ జరిపిస్తామని అన్నారు.

పథకాలు ప్రజలకు చేరవేయండి: భట్టి విక్రమార్క

దశాబ్ద కాలం తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు గొప్ప అవకాశం లభించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పార్టీపై విశ్వాసంతో ప్రజలు గెలిపించారని, వారి నమ్మకాలను వమ్ము చేయకుండా ప్రభుత్వ పథకాలను వారికి చేరవేసే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని కోరారు. పార్టీ కార్యకర్తలు, నేతల త్యాగాల ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వారి కష్టానికి తగిన ఫలితం ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శులు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఇథనాల్'పై గ్రామస్తుల ఆగ్రహజ్వాల

- నిర్మల్ జిల్లాలో ఫ్యాక్టరీ నిర్మాణాలపై రైతులు, ప్రజల దాడి
- ప్రహరీ గోడ కూల్చివేత.. అగ్నికి ఆహుతైన వాహనం
- పోలీసుల స్వల్ప లాఠీచార్జీ.. పలువురికి గాయాలు

దిలావర్‌పూర్ (నిర్మల్): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రం–గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళన బుధవారం ఉద్రిక్తంగా మారింది. ఒక్కసారిగా తరలివచ్చిన గ్రామస్తులు, రైతులు ఫ్యాక్టరీపై దాడిచేసి, వాహనాన్ని తగులబెట్టడంతో ఆ ప్రాంతమంతా రణరంగాన్ని తలపించింది. పోలీసులు లాఠీచార్జీ చేసినా రైతులు వెనక్కి తగ్గకపోవడంతో కొన్ని గంటలపాటు ఉద్రిక్తత కొనసాగింది. చివరకు జిల్లా ఉన్నతాధికా రులు సముదాయించడంతో గ్రామస్తులు వెనక్కితగ్గారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ సమీపంలో నిర్మిస్తున్న ఫ్యాక్టరీపై మొదటి నుంచీ రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సమీప గ్రామస్తులు పలుమార్లు ఆందోళనలు చేయడంతోపాటు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ఫ్యాక్టరీ పనులు ఊపందుకోవడంతో బుధవారం దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ఒక్కసారిగా పరిశ్రమ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. అక్కడ నిర్మిస్తున్న ప్రహరీని కూల్చేశారు. నిర్మాణా లను అడ్డుకున్నారు. వందలమంది మూకుమ్మడిగా దాడికి పాల్పడటంతో నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. ఓ కారును ధ్వంసం చేసి నిప్పుపెట్టారు. నిర్మల్ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. మరోపక్క రైతులు, గ్రామస్తులు దిలావర్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వారిని సివిల్‌డ్రెస్‌లో ఉన్న పోలీసులు వీడియో తీస్తుండగా వారు ఇథనాల్ కంపెనీ వారని అనుకున్న గ్రామస్తులు దాడి చేశారు. పోలీసుల ఫోన్లు లాక్కుని ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టేందుకు స్వల్ప లాఠీచార్జీ చేశారు. ఇందులో పలువురు రైతులు, గ్రామస్తులకు గాయాలయ్యాయి. అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, తహసీల్దార్ సరిత అక్కడికి వచ్చి సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తామని, అప్పటివరకు శాంతియుతంగా ఉండాలని గ్రామస్తులను కోరగా, రైతులు శాంతించారు. కాగా, రైతులు, ప్రజలు గురువారం దిలావర్‌పూర్ మండల బంద్‌కు పిలుపునిచ్చారు.



కాలిపోతున్న వాహనం

నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా: డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కేస్లాపూర్ నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన నాగోబా దేవాలయ అభివృద్ధి కోసం నిధులివ్వాలని కోరుతూ రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి కేస్లాపూర్ మెస్రం వంశస్తులు బుధవారం రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కలిసి వినతిపత్రం అందజేశారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా నాగోబా దేవాలయాన్ని సందర్శించిన భట్టి విక్రమార్కకు ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను మెస్రం వంశస్తులు మొరపెట్టుకున్నారు. వారి సమస్యలను బాధలను విన్న తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామని, మెస్రం వంశస్తుల ఆరాధ్య దైవమైన నాగోబా దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాడు ఇచ్చిన మాట ప్రకారం మెస్రం వంశస్తులు ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరిన వెంటనే సుముఖత వ్యక్తం చేశారు. త్వరలోనే ఆలయాన్ని సందర్శిస్తానని, కేస్లాపూర్ గ్రామానికి వచ్చి అందరినీ కలుస్తానని వారికి చెప్పారు. నిధుల మంజూరుపై డిప్యూటీ సీఎం స్పందనతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు, మెస్రం వంశస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సావిత్రీబాయి పూలే సేవలు శ్లాఘనీయం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కాచిగూడ: భారతదేశ చరిత్రలో సావిత్రీబాయి పూలేకు ప్రత్యేక స్థానం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... బ్రిటిష్ పాలనలో దేశంలో అనేక మార్పులు తెచ్చేందుకు సావిత్రీబాయి పులే చేసిన సేవలు మరువలేనివన్నారు. మహిళలు విద్యారంగంలో రాణించేందుకు ఆమె విశేష కృషి చేశారని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పేర్కొన్నారు. నేతలు సి.నందకిషోర్ యాదవ్, కేసరి నర్సింగ్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఆనంద్ గౌడ్, కృష్ణాగౌడ్, అనంతలక్ష్మి, శ్యామ్‌రాజ్, రమేష్, మనోజ్ పాల్గొన్నారు.

నరసాపురం మాజీ ఎమ్మెల్యే కాళికాంబ కన్నుమూత



నరసాపురం/మణికొండ: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాజకీయ కుటుంబానికి చెందిన పరకాల కాళికాంబ (94) వృద్ధాప్య సమస్యలతో బుధవారం వేకువజామున హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు. రాష్ట్ర రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన పరకాల శేషావతారం సతీమణి ఆమె. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉండగా పరకాల శేషావతారం మృతిచెందారు. దీంతో 1981లో నరసాపురం నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున కాళికాంబ పోటీచేసి, సమీప జనతా పార్టీ అభ్యర్థి కుంచనపల్లి నాగేశ్వరరావుపై గెలుపొందారు.

నరసాపురం మహిళా ఎమ్మెల్యేగా..: నరసాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మహిళా ఎమ్మెల్యేగా కాళికాంబకు రికార్డు ఉంది. ఆమె విజయం తర్వాత దాదాపు మూడు దశాబ్దాల పాటు నరసాపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురలేదు. 1981 తర్వాత మళ్లీ 2009లో కాంగ్రెస్ తరఫున ముదునూరి ప్రసాదరాజు గెలిచే వరకూ నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. కాళికాంబ కుమారుడు పరకాల ప్రభాకర్ తర్వాత వేరు వేరు పార్టీలు మారినా, కాళికాంబ మాత్రం కాంగ్రెస్‌వాదిగానే ఉండిపోయారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కాళికాంబకు కోడలు. కాళికాంబకు మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావుతో సత్సంబంధాలుండేవి.

'వ్యూహం'పై 8న నిర్ణయం తీసుకోండి

- సింగిల్ జడ్జికి ద్విసభ్య ధర్మాసనం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన 'వ్యూహం' చిత్రానికి సంబంధించి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన రివైజింగ్ కమిటీ రికార్డులను పరిశీలించి.. ఉత్తర్వులు జారీ చేయాలని సింగిల్ జడ్జి ధర్మాసనాన్ని ద్విసభ్య ధర్మాసనం కోరింది. రివైజింగ్ కమిటీ సూచించిన మార్పులకు సంబంధించిన వివరాలను సింగిల్ జడ్జి ముందు ఉంచాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ)ని ఆదేశించింది. అలాగే 8వ తేదీన వాదనలు వినాలని, మెరిట్ ప్రకారం అదే రోజు ఉత్తర్వులు వెలువరించాలని సింగిల్ జడ్జిని విజ్ఞప్తి చేసింది. వ్యూహం చిత్రం విడుదలకు సెన్సార్ బోర్డు జారీ చేసిన సర్టిఫికెట్ అమలును ఈ నెల 11వ తేదీ వరకు నిలిపివేస్తూ గత నెల 28న తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ రామదూత క్రియేషన్స్, నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించారు. సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఈ అప్పీల్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. నిర్మాత తరఫున సీనియర్ న్యాయవాది ఎ.వెంకటేశ్, టీడీపీ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధర్‌రావు, కేంద్రం తరఫున ఏఎస్‌జీ బి.నరసింహ శర్మ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. నిర్మాత అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని రివైజింగ్ కమిటీ చెప్పిన సూచనలను పరిశీలించి ఉత్తర్వులు ఇవ్వాలని సింగిల్ జడ్జిని కోరింది. అనంతరం అప్పీల్ వాదనలను ముగించింది.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఏం చర్యలు తీసుకున్నారు?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు




సాక్షి, హైదరాబాద్: రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా ఏం పనులు చేపట్టారో చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. నోటీసులు జారీ చేస్తూ.. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు గత ఏడాది మార్చి 29న జారీ చేసిన మార్గదర్శకాలు అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన కె.అఖిల్ శ్రీగురు తేజ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్న ఉత్తర్వులను అమలు చేయాలని కర్ణాటక, బాంబే హైకోర్టులు ఉత్తర్వులు ఇచ్చాయని పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ చెప్పారు. మోటారు వాహనాల చట్టం–1988లోని 214(3) నిబంధన ప్రకారం రోడ్డు భద్రతా చర్యలు తీసుకోని కారణంగా జరిగిన ప్రమాదాల్లో తెలంగాణ 8వ స్థానంలో ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది.

ఇస్రో అమ్ములపొదిలో ఎన్‌జీఎల్‌వీ!

న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ తయారీకి సన్నాహాలు

2030కల్లా ఎన్‌జీఎల్‌వీ వెహికల్‌తో తొలి ప్రయోగం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సమీప భవిష్యత్తులో భారీ ప్రయోగాలకు తెర తీస్తున్న ఇస్రో, అందుకు తగ్గట్టుగా అత్యాధునిక రాకెట్ తయారీ ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఈ రాకెట్‌కు న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ (ఎన్‌జీఎల్‌వీ)గా నామకరణం చేశారు. తొలి నాళ్లలో చేపట్టిన రోహిణి సౌండింగ్ రాకెట్ల ప్రయోగాల తరువాత 40 కిలోల నుంచి 5,000 కిలోల ఉపగ్రహాలను మోసుకెళ్లే ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం03, ఎస్ఎస్ఎల్‌వీ... ఇలా ఆరు రకాల రాకెట్లను ఇప్పటిదాకా ఇస్రో అభివృద్ధి చేసింది. గగన్‌యాన్ ప్రయోగంలో భాగంగా త్వరలో మానవసహిత అంతరిక్ష ప్రయోగంతో పాటు చంద్రుడిపై వ్యోమగాములను తీసుకెళ్లి సురక్షితంగా తీసుకొచ్చే ప్రయోగాన్నీ చేపట్టాలని భావిస్తోంది. వీటితో పాటు అత్యంత బరువుండే సమాచార ఉపగ్రహాలను జీటీఓ కక్ష్యలోకి పంపే సాంకేతిక పరిజ్ఞానాన్నీ సమకూర్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఏకంగా 20 వేల కిలోల బరువున్న ఉపగ్రహాలను భూమికి సమీపంలోని లియో ఆర్బిట్‌లోకి, 10 వేల కిలోల ఉపగ్రహాలను జీటీఓ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టే సామర్థ్యంతో ఎన్‌జీఎల్‌వీ తయారీకి ఇస్రో తెర తీసింది. రూ.1,798 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టును 2008లోనే కేంద్రం ఆమోదించింది. సెమీ క్రయోజనిక్ దశను అభివృద్ధితో పాటు రాకెట్ విడి భాగాలను దేశీయంగానే రూపొందించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.



6న 'ఎల్‌పీ 1' వద్దకు ఆదిత్య ఎల్1: సౌర ప్రయోగాల నిమిత్తం గత సెప్టెంబర్ 2న ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహం జనవరి 6 సాయంత్రం సూర్యుడికి సమీపంలోని లాంగ్రేజియన్ పాయింట్ 1ను చేరనుంది. భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని ఈ పాయింట్‌ను చేరాక సూర్యుని రహస్యాలను అధ్యయనం చేయనుంది. సౌర తుఫాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వీటితో పాటు ఫోటోస్పియర్, క్రోమోస్పియర్, సూర్యు డి వెలుపలి వలయమైన కరోనాపై అధ్యయనాలు చేయనున్నారు.

ఎన్‌జీఎల్‌వీ విశేషాలు...

- ఎన్‌జీఎల్‌వీ రాకెట్ ఎత్తు 75 మీటర్లు
- వెడల్పు 5 మీటర్లు.
- పీఎస్ఎల్‌వీ ఎక్స్ఎల్ తరహాలోనే దీనికీ ఆరు స్ట్రాపాన్ బూస్టర్లుంటాయి.
- ప్రయోగ సమయంలో 600 టన్నుల నుంచి 770 టన్నులు
- రాకెట్‌ను మూడు దశల్లో ప్రయోగిస్తారు.
- ఇది ఫాల్కన్, అట్లాస్-వీ, ప్రొటాన్-ఎం, లాంగ్ మార్చ్-58 రాకెట్లకు దీటుగా ఉంటుంది.
- ఇస్రో చైర్మన్ సోమ నాథ్ ఇటీవలే ఎన్‌జీఎల్‌వీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.
- 2030-35 నాటికి మానవ అంతరిక్ష యానం, అత్యంత బరువైన ఉపగ్రహ ప్రయోగాలకు ఇది వీలుగా ఉంటుందని వివరించారు.



'అదానీ'కి భారీ ఊరట

- అదానీ గ్రూప్‌పై దర్యాప్తును బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ
- సెబీ కొనసాగిస్తున్న దర్యాప్తు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన న్యాయస్థానం
- పెండింగ్‌లో ఉన్న దర్యాప్తును 3 నెలల్లోగా పూర్తి చేయండి
- సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పు
- దేశ ప్రగతి చరిత్రలో తమ వంతు పాత్ర పోషిస్తూ ఉంటాం: గౌతమ్ అదానీ

న్యూఢిల్లీ: ప్రముఖ కార్పొరేట్ సంస్థ 'అదానీ గ్రూప్'నకు మరో విజయం లభించింది. స్టాక్ ధరల్లో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ సంస్థపై కొనసాగుతున్న దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా సీబీఐకి అప్పగించేందుకు సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. అదానీ గ్రూప్‌పై మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ) కొనసాగిస్తున్న దర్యాప్తు పట్ల న్యాయస్థానం సంతృప్తి వ్యక్తం చేసింది. సెబీ సమగ్ర దర్యాప్తు జరుపుతోందని వెల్లడించింది. ఈ దశలో సెబీ దర్యాప్తుపై జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దర్యాప్తును సెబీ నుంచి సిట్ లేదా సీబీఐకి బదిలీ చేయాలన్న వాదనలో అర్థం లేదని కొట్టిపారేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం 46 పేజీల తీర్పు వెలువరించింది. అదానీ గ్రూప్‌పై పెండింగ్‌లో ఉన్న రెండు దర్యాప్తులను 3 నెలల్లోగా పూర్తి చేయాలని సెబీని ఆదేశించింది.

సెబీ దర్యాప్తును అనుమానించలేం

అదానీ గ్రూప్ తన లిస్టెడ్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచిందని, మదుపర్లను మోసగించిందని ఆరోపిస్తూ అదానీ–హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ వివాదం తర్వాత సుప్రీంకోర్టులో నాలుగు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. న్యాయవాదులు విశాల్ తివారీ, ఎంఎల్ శర్మ, కాంగ్రెస్ నేత జయ ఠాకూర్, అనామికా జైస్వాల్ ఈ పిటిషన్లు దాఖలు చేశారు. అదానీ గ్రూప్ వ్యవహారంపై హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చిన తర్వాత ఆ కంపెనీ షేర్లు భారీగా పతనమయ్యాయని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. సెబీ చట్టంలో చేసిన మార్పుల కారణంగా అదానీ గ్రూప్ అవకతవకలు బయటపడడం లేదని పిటిషనర్లు ఆరోపించారు. సెబీని పటిష్టం చేయాలని కోరారు. ఈ నాలుగు పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. పత్రికల్లో వచ్చిన వార్తలు లేదా ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్‌పీ) వంటి థర్డ్ పార్టీ సంస్థల నివేదికల ఆధారంగా సెబీ దర్యాప్తును అనుమానించలేమని స్పష్టం చేసింది. అలాంటి నివేదికలను కేవలం ఇన్‌పుట్స్‌గా పరిగణించవచ్చని అభిప్రాయపడింది. సెబీ దర్యాప్తును అనుమానించడానికి అలాంటివి ఆధారాలుగా ఉపయోగపడవని పేర్కొంది. చట్టబద్ధమైన సంస్థ అయిన సెబీ కొనసాగిస్తున్న దర్యాప్తును మరో సంస్థకు బదిలీ చేసే అధికారం కోర్టుకు లేదని పేర్కొన్నారు. అసాధారణ పరిస్థితుల్లోనే మాత్రమే అలా బదిలీ చేయగలమని తేల్చిచెప్పింది.

నిర్ధారణ కాని సమాచారంపై ఆధారపడొద్దు

అదానీపై గ్రూప్‌పై 24 ఆరోపణలు రాగా, సెబీ ఇప్పటికే 22 ఆరోపణలపై దర్యాప్తు పూర్తి చేసిందని సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. అదానీ గ్రూప్‌పై ఆరోపణలు చేయడానికి, కోర్టుకెక్కడానికి నిర్ధారణ కాని సమాచారంపై పిటిషనర్లు ఆధారపడినట్లు తెలుస్తోందని వెల్లడించింది. వారు తగిన పరిశోధన కూడా చేయకుండానే కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని ఆక్షేపించింది. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకూడదని సూచించింది. న్యాయవాదులు గానీ, పౌర సమాజం సభ్యులు గానీ అప్రమత్తంగా ఉండాలని, నిర్ధారణ కాని సమాచారం లేదా థర్డ్‌పార్టీ నివేదికల ఆధారంగా ఇష్టారాజ్యంగా పిటిషన్లు వేయడం సరైంది కాదని తేల్చిచెప్పింది. ఇదిలా ఉండగా, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సానుకూల సంకేతాలు రావడంతో బుధవారం స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూప్‌లోని నమోదిత కంపెనీల షేర్ల ధరలు పైకి ఎగబాకాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, ఎన్‌డీటీవీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ విల్మార్, అదానీ పవర్, అదానీ పోర్ట్స్, అంబుజా సిమెంట్స్ వంటి సంస్థల షేర్ల ధరలు గణనీయంగా పెరిగాయి.



సత్యమేవ జయతే: గౌతమ్ అదానీ



సుప్రీంకోర్టు తీర్పుపై అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ స్పందించారు. సత్యమే జయిస్తుందన్న నిజాన్ని ఈ తీర్పు మరోసారి నిరూపించిందని అన్నారు. భారతదేశ ప్రగతి చరిత్రలో తమ వంతు పాత్ర పోషిస్తూనే ఉంటామని చెప్పారు. ప్రతికూల సమయంలో తమకు అండగా నిలిచినవారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 'సత్యమేవ జయతే' అంటూ గౌతమ్ అదానీ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కన్వీనర్‌గా నితీశ్ కుమార్!

త్వరలో ఇండియా కూటమి భేటీలో తుది నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి కన్వీనర్ ఎవరన్న దానిపై కొంత స్పష్టత వచ్చింది. జేడీ(యూ) సీనియర్ నేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను విపక్ష కూటమి కన్వీనర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. 'ఇండియా' భాగస్వామ్య పక్షాల వర్చువల్ సమావేశం త్వరలో జరుగనుంది. కన్వీనర్ నియామకంపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. నితీశ్ కుమార్‌ను కన్వీనర్‌గా నియమించాలన్న ప్రతిపాదన పట్ల కూటమిలో ప్రధాన పక్షమైన కాంగ్రెస్ సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సైతం నితీశ్ వైపు మొగ్గు చూపుతున్నారు. కన్వీనర్‌గా నితీశ్‌ను నియమించాలన్న ప్రతిపాదనకు ఆయన ఇప్పటికే మద్దతు ప్రకటించినట్లు తెలిసింది. కాంగ్రెస్ ముఖ్యనేతలు మంగళవారం నితీశ్ కుమార్‌తోపాటు ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌తో మాట్లాడారు. కూటమి కన్వీనర్ నియామకంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. నితీశ్ శివసేన(ఉద్ధవ్‌వర్గం) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడారు. ఇండియా కూటమి ఏర్పాటులో నితీశ్ కుమార్ కీలకంగా వ్యవహరించారని శివసేన సీనియర్ నాయకుడు సంజయ్ రౌత్ గుర్తుచేశారు. ఆయనను కన్వీనర్‌గా నియమించడానికి కాంగ్రెస్‌కు అభ్యంతరం ఉండకపోవచ్చని అన్నారు.

రక్తమోడిన ర్యాలీ

- ఇరాన్‌లో సులేమానీ సంస్మరణ ర్యాలీ వద్ద జంట పేలుళ్లు
- 100 మందికిపైగా దుర్మరణం!
- 188 మందికి గాయాలు

దుబాయ్: అమెరికా డ్రోన్ దాడిలో హతమైన ఇరాన్ అత్యున్నత సైనిక జనరల్ సులేమానీ సంస్మరణ సభలో భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 188కి పైగా క్షతగాత్రులయ్యారు. గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఇరాన్ ఖండిస్తున్న వేళ ఇరాన్‌పై దాడి ఖడ్గం ఝుళిపించింది ఎవరనేది ఇంకా తెలియరాలేదు. బుధవారం మధ్యాహ్నం మూడింటపుడు కెర్మాన్ నగరంలోని ఖాసిమ్ సులేమానీకి నివాళిగా ఆయన సమాధి దగ్గర నాలుగో సంస్మరణ ర్యాలీ జరుగుతుండగా సాహెబ్ అల్-జమాన్ మసీదు సమీపంలో రోడ్డుపై ఈ పేలుడు ఘటన జరిగింది. దారి పొడవునా వేలాది మంది సులేమానీ మద్దతుదారులతో ర్యాలీ కొనసాగుతుండగా సమాధికి 700 మీటర్లదూరంలో మొదటి పేలుడు సంభవించింది. గాయపడిన వారిని కాపాడేందుకు జనం, ఎమర్జెన్సీ విభాగ సభ్యులు భారీ సంఖ్యలో గుమికూడుతుండగా సమాధికి ఒక కిలోమీటర్ దూరంలో మరో భారీ పేలుడు సంభవించింది. దీంతో మృతుల సంఖ్య పెరిగింది. గాయపడి రక్తమోడుతున్న క్షతగాత్రులను వెంటనే హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారి ఆర్తనాదాలు, చెల్లాచెదురుగా పడిన మృతదేహాలతో ఘటనాస్థలి భీతావహంగా తయారైంది. ఇది ఉగ్రదాడేనని కెర్మాన్ నగర డెప్యూటీ గవర్నర్ రహ్మాన్ చెప్పారు. అయితే దాడికి పాల్పడింది తామేనని ఇంతవరకూ ఎవరూ ప్రకటించుకోలేదు.

ఎవరీ సులేమానీ?



ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్‌లోని కీలక ఖుద్స్ ఫోర్స్‌కు మేజర్ జనరల్ సులేమానీ నేతృత్వం వహిస్తుండేవారు. ఖుద్స్‌ఫోర్స్ అనేది విదేశీ సైనిక వ్యవహారాల విభాగం. సైన్యం కోసం ఆయుధాలు, నిధుల సేకరణ, నిఘా, సరకుల రవాణా బాధ్యతలను ఈ దళమే చూసుకుంటుంది. ఇరాన్‌కు మద్దతు పలికే గాజా స్ట్రిప్‌లోని హమాస్ మిలిటెంట్ గ్రూప్‌కు, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూప్‌కు, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులకూ సాయపడుతుంది. దీనిని విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా గతంలో ప్రకటించింది.

ఎందుకు చంపారు?

2020 జనవరిలో ఇరాక్‌లోని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎంక్యూ9 రీపర్ డ్రోన్ సాయంతో అమెరికా సులేమానీని హతమార్చింది. " 1998లో ఖుద్స్ ఫోర్స్‌ను ఏర్పాటుచేసినప్పటి నుంచి ఇరాక్, సిరియాలో లక్షలాది మంది అమాయకుల మరణాలకు సులేమానీ కారకుడు. ప్రపంచ నంబర్‌వన్ ఉగ్రవాది అయినందుకే అతడిని అంతమొందించాం' అని నాటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడిరోజున ప్రకటించారు. దీంతో ఆగ్రహంతో ఇరాన్ అప్పట్లో ప్రతీకార దాడులకు దిగడం తెల్సిందే. ఇరాన్ సైన్యాన్ని పటిష్టవంతం చేయడంలో సులేమానీది కీలక పాత్ర. అందుకే ఇరాన్ వ్యాప్తంగా సులేమానీకి అప్పట్లో విపరీతమైన క్రేజ్ ఉండేది. నేషనల్ ఐకాన్‌గా కీర్తింపబడ్డారు. 2011లో అరబ్ ఉద్యమం తర్వాత సిరియాలో బషర్ అస్సాద్ ప్రభుత్వం కూలిపోకుండా కాపాడారు. కానీ ఈ ఘటనలో సిరియాలో అంతర్యుద్ధం రాజుకుని అది ఇప్పటికీ రగులుతూనే ఉంది. 2018లో ప్రపంచ ఆర్థిక శక్తులు కీలక ఇరాన్ అణు ఒప్పందం నుంచి వైదొలిగాక ఇరాన్ సైనిక నాయకత్వాన్ని బలహీనపరిచేందుకు ట్రంప్ సర్కార్ ఇచ్చిన ఆదేశాలతో సులేమానీపై డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో అప్పట్లో సంచలనమైంది. సులేమానీ హత్యేకాదు అంత్యక్రియల ఘటనా వార్తపత్రికల పతాకశీర్షికలకెక్కింది. 2020లో వేలాదిమంది పాల్గొన్న అంత్యక్రియల్లో తొక్కిసలాట జరిగి 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 200 మందికిపైగా గాయపడ్డారు.



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సహాయక సిబ్బంది

గ్యాంగ్‌స్టర్ గడోలీ ప్రియురాలు దివ్యా పహుజా హత్య

గురుగ్రామ్: ఎనిమిదేళ్ల క్రితం అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్ సందీప్ గడోలీ ప్రియురాలు, మాజీ మోడల్ దివ్యా పహుజాను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఢిల్లీ శివారులోని గురుగ్రామ్‌లో ఓ హోటల్ గదిలో ఈ దారుణం జరిగిందని పోలీసులు బుధవారం వెల్లడించారు. ఐదుగురు వ్యక్తులు మంగళవారం రాత్రి ఆమెను హోటల్ గదికి తీసుకొచ్చినట్లు తెలిసింది. తుపాకీతో ఆమె తలపై కాల్చి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని కారులో బయటకు తరలిస్తుండగా, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. గడోలీ హత్య కేసులో నిందితురాలైన దివ్యా పహుజాకు గత ఏడాది జూన్‌లో బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఉత్తరాదిన పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ సందీప్ గడోలీ 2016 ఫిబ్రవరి 7న ముంబైలో హత్యకు గురయ్యాడు. నకిలీ ఎన్‌కౌంటర్‌లో హరియాణా పోలీసులే అతడిని హతమార్చినట్లు దర్యాప్తులో తేలింది. గడోలీ ప్రత్యర్థి అయిన మరో గ్యాంగ్‌స్టర్ వీరేంద్ర కుమార్ అలియాస్ బిందర్ గుజ్జర్ హరియాణా పోలీసులతో చేతులు కలిపి ఈ ఎన్‌కౌంటర్ చేయించినట్లు వెల్లడయ్యింది. గడోలీని ముంబైకి రప్పించడానికి హరియాణా పోలీసులు అతడి ప్రియురాలు దివ్యా పహుజాను పావుగా వాడుకున్నారు. ఆమె ద్వారా అతడిని హనీట్రాప్ చేశారు.

కూనో పార్క్‌లో కొత్త అతిథులు

భోపాల్: ఆఫ్రికా ఖండం నుంచి భారత్‌కు తీసుకొచ్చిన చీతాల్లో కొన్ని వరసబెట్టి మృత్యువాత పడటంతో 'ప్రాజెక్ట్ చీతా'పై నీలినీడలు కమ్ముకున్న వేళ ఒక చీతా చల్లని కబురు మోసుకొచ్చింది. కేంద్రప్రభుత్వం నమీబియా నుంచి తీసుకొచ్చి మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయ వనంలోకి ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రధాని మోదీ 'ఆశ'గా నామకరణం చేసిన చీతా మూడు కూనలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, మూడు కూనలపై అనుక్షణం పర్యవేక్షిస్తున్నామని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. వారం క్రితం ఇవి జన్మించగా బుధవారం అధికారికంగా ప్రభుత్వం వెల్లడించింది. గత ఏడాది మార్చిలో జ్వాలా అనే చీతా సైతం నాలుగు కూనలకు జన్మనిచ్చింది.



బుధవారం తిరువనంతపురంలో అభివాదం చేస్తున్న మోదీ

మహిళా సాధికారతే మా లక్ష్యం

తిరువనంతపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం కేరళలో పర్యటించారు. రాజధాని తిరువనంతపురంలో బీజేపీ ఆధ్వర్యంలో 'మహిళా శక్తి మోదీ వెంట' పేరిట నిర్వహించిన మహిళల బహిరంగ సభలో ప్రసంగించారు. కేంద్రంలో గత పదేళ్లలో మహిళల సంక్షేమం, సాధికారత కోసం తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. 'మోదీ గ్యారంటీ'ల్లో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించామని చెప్పారు. మహిళల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఉజ్వల పథకం, మంచినీటి కుళాయి కనెక్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణం, ముద్రా రుణాల పంపిణీ వంటి కార్యక్రమాలు అమలు చేశామని ఉద్ఘాటించారు. ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు స్వేచ్ఛ ప్రసాదించామని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మహిళా సాధికారతే తమ లక్ష్యమని అన్నారు. పేదలు, మహిళలు, యువత, రైతుల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తేల్చిచెప్పారు. మహిళల జీవన నాణ్యతను పెంచడమే లక్ష్యంగా మోదీ గ్యారంటీలను అమలు చేస్తున్నామని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. నారీశక్తి వందన్ అధినియమ్ ఇప్పుడు చట్టంగా మారిందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించే విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు విపరీతమైన జాప్యం చేశాయని నరేంద్ర మోదీ మండిపడ్డారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో మంచి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం

12 మంది దుర్మరణం

న్యూఢిల్లీ: అస్సాంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులుసహా 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 38 మంది గాయపడ్డారు. గోలాఘాట్ జిల్లాలోని డేర్గావ్ సమీప బలిజాన్ వద్ద 715 జాతీయరహదారిపై బుధవారం ఉదయం నాలుగున్నర ప్రాంతంలో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విహార యాత్రలో భాగంగా 49 మంది ప్రయాణికులతో బస్సు టిన్సుకియా జిల్లాలోని తిలింగా మందిర్‌కు బయల్దేరింది. మార్గమధ్యంలో జోర్హాట్ నుంచి ఎదురుగా రాంగ్‌సైడ్‌లో వేగంగా వస్తున్న బొగ్గు ట్రక్కు ఈ బస్సును బలంగా ఢీకొట్టింది. రెండూ వేగంగా ఢీకొనడంతో బస్సు కుడిభాగం మొత్తం తునాతునకలై కొద్దిమీటర్ల దూరంలో పడింది. పొగ మంచు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రమాదం వార్త తెల్సి రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు తలో రూ.50,000 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు.

గణతంత్ర వేడుకల్లో మహిళా త్రివిధ దళాల బృందం

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర వేడుకల్లో ఈ సారి త్రివిధ దళాలకు చెందిన మహిళా బృందంతోపాటు.. మహిళా అగ్నివీర్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. త్రివిధ దళాలు, అగ్నివీర్‌ల్లోని మహిళా బృందం సంయుక్తంగా అడుగులో అడుగు వేసి ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జనవరి 26న సరికొత్త విన్యాసాలు చేయనున్నారు. ఇప్పటి వరకు ఏ గణతంత్ర వేడుకల్లోనూ త్రివిధ దళాల ఉమ్మడి మహిళా దళం పరేడ్‌లో పాల్గొనలేదు. ఈ బృందానికి త్రివిధ దళాలకు చెందిన మహిళా ఆధికారులే నాయకత్వం వహిస్తారు. ఈసారి జరిగే బీటింగ్ రిట్రీట్‌లో పూర్తిగా స్వదేశీ సంగీత స్వరాలే వినిపించనున్నాయి. 1950 నుంచి జనవరి 29న నిర్వహించే బీటింగ్ రిట్రీట్ లో 'అబైడ్ విత్ మి' అనే విదేశీ స్వరాన్ని వాయించడం ఆనవాయితీ. అయితే దీనిపై విమర్శలు, వివాదం తలెత్తడంతో 2022లో నిలిపివేశారు. ఈసారి జరిగే బీటింగ్ రిట్రీట్‌లో పూర్తిగా స్వదేశీ స్వరాలే వాయించబోతున్నారు.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

న్యూఢిల్లీ: ఢిల్లీ పరిధిలో మద్యం విధానంలో అవకతవకలు జరిగాయన్న కేసులో ప్రశ్నించేందుకుగాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇచ్చిన సమన్లను మూడోసారీ ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బేఖాతరు చేశారు. బుధవారం ఢిల్లీలో ఈడీ ఆఫీస్‌కు రాకుండా డుమ్మా కొట్టారు. గత ఏడాది నవంబర్ రెండో తేదీన, డిసెంబర్ 21వ తేదీన విచారణకు హాజరుకావాలని ఈడీ సమన్లు జారీచేయడం తెల్సిందే. మూడోసారి ఇచ్చిన సమన్ల మేరకు బుధవారం ఆయన ఈడీ ఆఫీస్‌కు రావాల్సిఉన్నా రాలేదు. తాను రావడంలేదని కేజ్రీవాల్ ఈడీకి సమాచారం ఇచ్చారు. 'రాబోయే రాజ్యసభ ఎన్నికలు, గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహక కార్యక్రమాల్లో తీరకలేకుండా ఉన్నాను. మీరు అడగబోయే ప్రశ్నలు పంపిస్తే లిఖితపూర్వక సమాధానమిస్తా" అని కేజ్రీవాల్ ఈడీకి లేఖ రాశారు. విచారణ పేరుతో పిలిచి ఆయనను అరెస్ట్‌చేయాలని ఈడీ కుట్ర పన్నుతోందని ఆప్ పార్టీ బుధవారం ఆరోపించింది.

మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వండి

మొయిత్రా పిటిషన్‌పై లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌పై మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. బహిష్కరణను వ్యతిరేకిస్తూ మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. లోక్‌సభ సమావేశాలకు హాజరయ్యేందుకు తనకు అవకాశం ఇవ్వాలని, ఈ మేరకు ఉత్తర్వు జారీ చేయాలని మొయిత్రా కోరగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. ఈ దశలో అలాంటి ఉత్తర్వు ఇవ్వలేమని పేర్కొంది. ఆమె విజ్ఞప్తిని మార్చి నెలలో పరిశీలిస్తామని స్పష్టం చేసింది.

జేఎన్1 వేరియంట్ కేసుల విజృంభణ

న్యూఢిల్లీ: అత్యధిక సామర్థ్యమున్న జేఎన్1 ఉపవేరియంట్ తన సత్తా చూపిస్తోంది. భారత్‌లో ఇటీవల వెలుగుచూసిన జేఎన్1 వేరియంట్ వైరస్ విజృంభణ కొనసాగుతోంది. గత 24 గంటల్లో ఏకంగా 511 జేఎన్1 ఉపవేరియంట్ రకం కేసులు నమోదయ్యాయి. వీటిల్లో ఎక్కువగా కర్ణాటకలో వెలుగుచూడటం గమనార్హం. కర్ణాటకలో 199, కేరళలో 149, గోవాలో 49, గుజరాత్‌లో 36, మహారాష్ట్రలో 32, తమిళనాడులో 26, ఢిల్లీలో 15, రాజస్తాన్‌లో 4, తెలంగాణలో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ వేరియంట్‌ను ప్రపంచ ఆరోగ్యసంస్థ(డబ్ల్యూహెచ్‌వో) 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్'గా ప్రకటించిందిగానీ వెంటనే ఉపద్రవం ముంచుకురానుందని పేర్కొనలేదు.

73కు చేరిన 'జపాన్' మరణాల సంఖ్య

సుజు: నూతన సంవత్సరం రోజునే భారీ భూకంపం బారిన పడిన జపాన్‌లో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఇషికావా ప్రిఫెక్చర్‌లో సోమవారం రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య బుధవారానికి 73కు పెరిగింది. భారీ వర్షాలు, చంపేసే చలి కారణంగా సహాయక చర్యలకు ఆటంక ఏర్పడుతోందని, అయినాసరే సహాయక చర్యల్ని ముమ్మురం చేసినట్లు ప్రధాని ఫుమియో కిషిదా బుధవారం చెప్పారు. సగం కూలిన భవనాల కింద ఇంకా చాలా మంది చిక్కుకుని ఉన్నారని సహాయక సిబ్బంది అంచనావేశారు. రాత్రంతా కేవలం నాలుగు డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత ఉండటంతో చలిలో శిథిలాల వద్ద అన్వేషణ, గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. గాయపడిన 300 మందిని ఆస్పత్రిలో చికిత్స నందిస్తున్నారు. 33,000 మందిని సహాయక శిబిరాలకు తరలించారు.

తొలిసారిగా ఫాల్కన్ రాకెట్‌లో ఇస్రో శాటిలైట్

న్యూఢిల్లీ: సమయానికి వేరే రాకెట్ అందుబాటులోలేని కారణంగా ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) అమెరికాకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ఎక్స్ సేవలను వినియోగించుకోనుంది. 4,700 కేజీల బరువైన భారీ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు ఆ సంస్థకు చెందిన ఫాల్కన్ రాకెట్‌ను వాడుకోనుంది. విదేశీ ఫాల్కన్ రాకెట్‌ను ఇస్రో వాడటం ఇదే తొలిసారి. సంబంధిత వివరాలను ఇస్రో వాణిజ్యవిభాగమైన న్యూస్పేస్ ఇండియ లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్) బుధవారం వెల్లడించింది. ఇస్రోకు చెందిన జీఎస్ఎల్‌వీ-ఎంకే3 రాకెట్ దాదాపు 4,000 కేజీల పేలోడ్‌లనే మోసుకెళ్లగలదు. అంతకుమించి బరువున్న కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-20ని మోసుకెళ్లే రాకెట్ అందుబాటులోలేని కారణంగా స్పేస్ఎక్స్‌ను ఇస్రో సంప్రదించింది. ఫాల్కన్ రాకెట్ ఏకంగా 8,300 కేజీల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు.

నీ స్థాయి ఎంత? నువ్వేం చేయగలవు?

మధ్యప్రదేశ్‌లో డ్రైవర్ల ప్రతినిధిని ప్రశ్నించిన కలెక్టర్‌పై బదిలీ వేటు

భోపాల్: నీ స్థాయి ఎంత? నువ్వేం చేయగలవు? అంటూ ట్రక్కు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్‌పై బదిలీ వేటు పడింది. ఈ సంఘటన మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్ జిల్లాలో జరిగింది. న్యాయ సంహిత బిల్లులోని హిట్ అండ్ రన్ నిబంధనలను వ్యతిరేకిస్తూ ట్రక్కు డ్రైవర్లు ఆందోళనకు దిగారు. విధులను బహిష్కరించారు. ఈ నేపథ్యంలో డ్రైవర్ల సంఘం ప్రతినిధులతో షాజాపూర్ కలెక్టర్ కిశోర్ కన్యాల్ మంగళవారం సమావేశమయ్యారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తగదని, విధుల్లో చేరాలంటూ వారిని హెచ్చరించారు. తమతో సక్రమంగా మాట్లాడాలని ఓ ప్రతినిధి చెప్పగా, కలెక్టర్ ఆగ్రహానికి గురయ్యారు. నీ స్థాయి ఎంత? అంటూ మండిపడ్డారు. తమకు ఏ స్థాయి లేదు కాబట్టే ఈ పోరాటం చేస్తున్నామని ఆ ప్రతినిధి బదులిచ్చాడు. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ వ్యవహారం సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఆదేశాల మేరకు కలెక్టర్ కిశోర్ కన్యాల్‌ను ఆ పదవి నుంచి తొలగింగి, రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీగా బదిలీ చేసినట్లు సీఎం కార్యాలయం వెల్లడించింది.

గొంతు పెంచి కోర్టును భయపెట్టలేరు

ఓ లాయర్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా గట్టిగా అరుస్తూ మాట్లాడిన ఓ న్యాయవాదిపై బుధవారం జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గొంతు పెంచి కోర్టును ఎవరూ భయపెట్టలేరని హెచ్చరించారు. న్యాయస్థానంలో అనుచితంగా ప్రవర్తించడం తగదని తేల్చిచెప్పారు. "నువ్వు లాయర్‌గా సాధారణంగా ఎక్కడ ప్రాక్టీస్ చేస్తుంటావు? బిగ్గరగా అరుస్తూ మాట్లాడి మమ్మల్ని భయపెట్టడం నీవల్ల కాదు. నా 23 ఏళ్ల న్యాయవాద వృత్తిలో ఇలాంటిది ఎప్పుడూ చూడలేదు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో మాట్లాడే పద్ధతి ఇదేనా? న్యాయమూర్తుల ముందు ఎప్పుడూ ఇలాగే అరుస్తావా? నేను మరో ఏడాది లోగా పదవీ విరమణ చేయబోతున్నా. కోర్టులో లాయర్లు ఇష్టానుసారంగా మాట్లాడడం చూడాలని నేను కోరుకోవడం లేదు. నీ గొంతు తగ్గించు" అని సదరు లాయర్‌కు తేల్చిచెప్పారు. దీంతో ఆ లాయర్ వెనక్కి తగ్గారు. సుప్రీంకోర్టు నుంచి, జస్టిస్ చంద్రచూడ్ నుంచి క్షమాపణ కోరారు.

సాక్షి
కరీంనగర్
గురువారం | 4 | జనవరి | 2024



సద్వినియోగం చేసుకోవాలి

కేడీసీసీ బ్యాంకు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. -8లో▸



మధ్యాహ్న భోజనం లేక..

యామాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఈ విద్యాసంవత్సర ప్రారంభం నుంచి మధ్యాహ్నం భోజనం అందడం లేదు. -8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/17.0

వాతావరణం

వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. పొగమంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

6, 7 తేదీల్లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం పర్యటన

కరీంనగర్ అర్బన్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ నెల 6, 7 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పలు ప్రాంతాలకు వెళ్లనుండగా షెడ్యూల్‌ను కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఆయన ఈ నెల 6న సాయంత్రం 6 గంటలకు కరీంనగర్ చేరుకొని, వి పార్క్ హోటల్‌లో బస చేయనున్నారు. 7న ఉదయం 8 గంటలకు వేములవాడ చేరుకొని, శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయనున్నారు. అనంతరం వేములవాడ రూరల్ మండలంలోని వెంకటాంపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.15 గంటలకు కరీంనగర్ వి పార్క్ హోటల్‌కు చేరుకుంటారు. 12.30 గంటలకు కరీంనగర్ పార్లమెంట్ కోర్ కమిటీ మీటింగ్‌లో పాల్గొంటారు. భోజన విరామం అనంతరం సాయంత్రం 4.15 గంటలకు మానకొండూర్ మండలంలోని కొండపలకలకు చేరుకొని, యాత్రలో పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు.

అడిషనల్ కలెక్టర్ వివాహ రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందుకుంటున్న అడిషనల్ కలెక్టర్ దంపతులు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) ప్రఫుల్‌దేశాయ్–శ్వేతా దేశాయ్ దంపతుల వివాహ రిజిస్ట్రేషన్ బుధవారం కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగింది. సబ్ రిజిస్ట్రార్ రాజిరెడ్డి చేతులమీదుగా వారు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు.

తెలుగు మహాసభలకు మన కవులు

కరీంనగర్ కల్చరల్: ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్ సారథ్యంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు, చైతన్య విద్యాసంస్థలు రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నాయి. ఈ సభలకు రావాలని నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందినట్లు భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనంలో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత డా.ముదుగంటి సుధాకర్ రెడ్డి, నూజెట్టి రవీంద్రనాథ్, కల్వల రాజశేఖర్ రెడ్డి, మహేందర్ రాజు, ఇమ్మడోజు మహేందర్, సయ్యద్ సమీనా పర్వీన్, ఛత్రపతి ప్రజాపతి, కె.రామకృష్ణ కవితా పఠనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

సదరం షెడ్యూల్ విడుదల

కరీంనగర్ టౌన్: 2024 జనవరి నెలకు సంబంధించిన సదరం షెడ్యూల్‌ను బుధవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ విడుదల చేశారు. ఈ నెల 9న ఆర్థో, 18న బుద్ధి మాంద్యం, 22న కంటి, 29న చెవిటి, మూగ సమస్యలు ఉన్నవారికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసే సదరం శిబిరంలో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఈ నెల 5 నుంచి మీసేవ కార్యాలయాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సదరం శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, స్లాట్ బుకింగ్ రశీదుతో సంబంధిత తేదీల్లో హాజరుకావాలన్నారు.

క్వింటాల్ పత్తి రూ.6,750



వేలం పాడుతున్న వ్యాపారులు

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,750 పలికింది. బుధవారం మార్కెట్‌కు 76 వాహనాల్లో 682 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,600, కనిష్ట ధర రూ.6,000ను వ్యాపారులు చెల్లించారు.

సీసీఐ కొనుగోళ్లు..

మార్కెట్‌లో 73 మంది రైతుల వద్ద నుంచి సీసీఐ 1,029.10 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,920, కనిష్ట ధర రూ.6,850 పలికింది. క్రయవిక్రయాలను మార్కెట్ కార్యదర్శి రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.

భూముల లెక్క.. ఇక పక్కా

- హద్దుల గొడవకు స్వస్తి
- సబ్‌డివిజన్లు చేసేందుకు సర్వేయర్లకు అధికారం?
- అక్కడికక్కడే మ్యాప్ అందజేత
- త్వరలో జిల్లా అంతటా భూ కొలతలు



కరీంనగర్ అర్బన్: భూ ఆక్రమణదారులకు, భూ పంచాయితీల పేరుతో పబ్బం గడుపుకునేవారికి ఇది చేదువార్తే. గెట్లు జరుపుతూ పక్క రైతుల భూములను కలుపుకోవడం లాంటివాటికి శుభం కార్డు పడనుంది. హద్దులు, భూ రికార్డుల సమస్య లేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర భూ సర్వేకు నివేదికలు పంపాలని ఆదేశించగా జిల్లాలో తదనుగుణ నివేదికలు రూపొందిస్తున్నారు. కర్షకులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సబ్‌డివిజన్లు చేసేందుకు చర్యలు చేపడుతోంది. గతంలోనే భూ రికార్డుల నవీకరణ పూర్తవగా జిల్లాలోని ప్రతీ ఇంచు భూమిని కొలిచి భూ యజమానికి హద్దుల వివరాలను అందజేయనున్నారు.

భూ సర్వేతో చిక్కులకు చెక్

సాగుభూములతో పాటు నివాస స్థలాలను ప్రతీ ఇంచు కొలుస్తామని సీఎం ప్రకటించగా జిల్లాలో హెచ్చు సమస్యలు ఇవే. పోలీస్‌స్టేషన్లు, సర్వే లాండ్ రికార్డుశాఖలకు ఈ దరఖాస్తులే ఎక్కువ. అయితే గతంలో పైలట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి భూ సర్వే చేయాలని నిర్ణయించారు. నిజామాబాద్ జిల్లాలో భూ భారతి కార్యక్రమం నిర్వహించగా అంతగా సత్ఫలితాలివ్వకపోవడంతో నిలిపివేశారు. గత ప్రభుత్వంలోనూ భూ సమగ్ర సర్వేకు చర్యలు చేపట్టగా హుజూరాబాద్ ఉప ఎన్నికతో అటకెక్కింది. తాజాగా మళ్లీ తెరపైకి రాగా అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. తాజా భూ సర్వే ప్రకారం ప్రతీ పట్టాదారు భూమికి సర్వే నంబర్‌ను కేటాయించనున్నారని సమాచారం . అంటే సబ్ డివిజన్ చేయనున్నారు. సదరు సర్వే నంబర్లకు హద్దులు ఏర్పడనుండగా గెట్లు జరపడం ఇక అసాధ్యం.

తొమ్మిది దశాబ్దాల అనంతరం

1910–1930 కాలంలో నిజాం పాలకుల హయాంలో సమగ్ర భూ సర్వే నిర్వహించి రికార్డుల్లో భద్రపరిచారు. సాగు భూములు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, రహదారులు, అంతర్గత దారులు, అటవీ భూములు, ఇళ్ల స్థలాలు వంటి వివరాలు అక్షరీకరించారు. పటాలతో భద్రపరిచారు. సేత్వార్(రైతు పేరు, విస్తీర్ణం), వసూల్ బాకీ(ప్రస్తుత సర్వే నంబర్, గత సర్వే నంబర్ వివరాలు), క్లష్టర్ రిజిష్టర్ (భూమి విలువ, శిస్తు), ఆకార్ బంద్ (సర్వే ఆకారం, అందులో ఏముంది, బావి, కాల్వ వంటివి), పక్కా బుక్ (భూముల లెక్కలు), టీపాన్ వంటి వాటిని నిర్వహించారు. ఇక అప్పటి నుంచి భూముల సర్వే కానీ రికార్డుల నవీకరణ కానీ జరగలేదు. దీంతో రికార్డులను మాయం చేయడం, హద్దులను తొలగించడం, కబ్జాలకు పాల్పడటం యథేచ్ఛగా సాగింది.. సాగుతోంది. అప్పటి గణాంకాల ప్రకారం సాగు భూమి 15,63,025(6,25,210హెక్టార్లు) ఎకరాలుండగా ప్రస్తుతం 17,55,683 ఎకరాలకు చేరింది. అంటే 2లక్షల ఎకరాల వరకు భూమెక్కడిది. ప్రభుత్వం పంపిణీ చేసిన భూమి ఇంచుమించు లక్ష ఎకరాలు. మిగతా భూమి ఆక్రమణకు గురైనట్లేనని స్పష్టమవుతోంది. అయితే తాజా ప్రకటనతో ఆక్రమణల గుట్టు భారీగా తేలనుందని అర్థమవుతోంది.

భూ రికార్డుల నవీకరణలో తేలిన గణాంకాలు

సాగు విస్తీర్ణం: 3,33,450 ఎకరాలు
వ్యవసాయేతర భూమి: 33,007ఎకరాలు
ప్రభుత్వ భూమి: 40,366 ఎకరాలు
వక్ఫ్ భూములు: 517 ఎకరాలు
అటవీ భూములు: 1,748 ఎకరాలు
ఖాతాల సంఖ్య: 1,92,687
మొత్తం సర్వేనంబర్లు: 3,51,545

చిరిగిన దస్త్రాలకు చెల్లుచీటీ

ఉమ్మడి జిల్లా విస్తీర్ణం 11,82,300 హెక్టార్లు కాగా అందుకు సంబంధించిన ఆరు లక్షల టీపాన్లలో 4.30లక్షల టీపాన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 1.70లక్షల టీపాన్లు చిరిగిపోయాయి. 1910 కాలంలోని టీపాన్లను కాపాడుతూ వచ్చిన భూ కొలతలు, రికార్డుల శాఖ కాలక్రమేణ వాటిని తిరగేస్తూ ఉండటంతో చాలావరకు చిరిగిపోయాయి. ఇక కొందరు కాసులకు కక్కుర్తిపడి రికార్డులను మాయం చేశారన్న విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 50 గ్రామాల వరకు టీపాన్లు సరిగా లేవు. దీంతో దరఖాస్తు చేసుకున్న రైతు భూమికి కొలత వేయడం అధికారులకు తలనొప్పిగా మారేది. దీంతో గ్రామాల్లో భూ వివాదాలు పెరుగుతున్నాయి. భూ విలువ రోజురోజుకు పెరుగుతుండటంతో బలవంతులు బలహీనుల భూములను ఆక్రమించుకోవడం సహా పలు రకాల వివాదాలు పెరిగిపోతున్నాయి.. హత్యలకు దారితీస్తున్నాయి. వేలసంఖ్యలో కేసులు కోర్టుల్లో నలుగుతున్నాయి. ఇక కొలతల రూపురేఖలు మార్చే సర్వేయర్లు లేకపోలేదు.

ఐదోరోజు.. 47,812 అర్జీలు

- ప్రజాపాలనకు విశేష స్పందన

కరీంనగర్ అర్బన్: ప్రజాపాలనకు అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం జిల్లాలో 48 గ్రామాలతోపాటు 5 మున్సిపాలిటీల్లోని 14 వార్డుల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ పమేలా సత్పతి పలుచోట్లకు వెళ్లి, కార్యక్రమ తీరును పరిశీలించారు. నివాసాల సంఖ్య క్రమంలో కౌంటర్లను ఏర్పాటు చేయగా రేషన్ కార్డు లేనివారి దరఖాస్తులను ప్రత్యేకంగా తీసుకున్నారు. మొత్తం 47,812 అర్జీలు రాగా 23,886 నివాసాలను కవర్ చేశామని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 2,34,634 దరఖాస్తులు వచ్చాయన్నారు.

నేడు ప్రజాపాలన జరిగే ప్రాంతాలు..

సుందరగిరి, ఉల్లంపల్లి(చిగురుమామిడి), ముప్పిడి నర్సయ్యపల్లి, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, నర్సింహులపల్లి(గంగాధర), బహదూర్‌ఖాన్‌పేట, చేగుర్తి, నల్లగుంటపల్లి, తాహెర్‌కొండాపూర్(కరీంనగర్ రూరల్), నిజాయితీగూడెం, పచ్చునూరు, పెద్దూర్‌పల్లి(మానకొండూరు), రామచంద్రాపూర్, రంగసాయిపల్లి, రుద్రారం, షానగర్(రామడుగు), మక్త, మెట్‌పల్లి, ముత్తారం, రాజాపూర్(శంకరపట్నం), నుస్తులాపూర్, పొలంపల్లి, పోరండ్ల, రాం హనుమాన్‌నగర్(తిమ్మాపూర్), సర్వాయిపేట, సోమారం, వెంకపల్లి, వెంకటేశ్వర్లపల్లి(సైదాపూర్), మల్ల న్నపల్లి, మల్లారెడ్డిపల్లి, మామిడాలపల్లి, నర్సింహులపల్లి(వీణవంక) గ్రామాల్లో గురువారం ప్రజాపాలన నిర్వహించనున్నారు. అలాగే, కరీంనగర్ మున్సిపాలిటీలో 11, 24, 43, 44, 47, 55, 56, 58, 59, 60వ డివిజన్లలో, హుజూరాబాద్ మున్సిపాలిటీలో 21 22, 23, 24వ డివిజన్లలో, జమ్మికుంట మున్సిపాలిటీలో 21, 22, 23, 24వ, కొత్తపల్లిలో 9వ, చొప్పదండిలో 11, 12వ డివిజన్లలో అధికారులు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఎంపీ సంజయ్‌కి మూడో స్థానమే..

- ఆయన విమర్శలు అర్థరహితం
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే పోటీ
- మేయర్ వై.సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీకి ఓటేస్తే మోరీలో వేసినట్టేనని ఎంపీ బండి సంజయ్ చేసిన విమర్శలు అర్థరహితమని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. కరీంనగర్ పార్లమెంట్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే పోటీ అని, ఎంపీ మూడో స్థానానికి పరిమితం కావడం ఖాయమని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్ మూడుసార్లు శాసనసభ ఎన్నికల్లో తిరస్కరించిన వ్యక్తి అని ధ్వజమెత్తారు. సానుభూతితో ఎంపీగా అవకాశం ఇచ్చారని విమర్శించారు. గెలిచాక కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించని అసమర్థ ఎంపీ అని మండిపడ్డారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించిన తర్వాత కూడా ప్రజలు బీజేపీ తిరస్కరించారని పేర్కొన్నారు. సంజయ్ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని, రాజకీయం చేస్తూ కాలం గడిపారన్నారు. బీజేపీలో కుమ్ములాటలు మొదలయ్యాయని, ఈటల రాజేందర్, బండి సంజయ్‌లు ఒకరి గోతులు ఒకరు తవ్వకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధు పథకం డబ్బులు రాక రైతులు, కరెంట్ సరిగా లేక విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు వాల రమణారావు, గందె మాధవి, నేతికుంట యాదయ్య, కంసాల శ్రీనివాస్, చాడగొండ బుచ్చిరెడ్డి, ఐలేందర్ యాదవ్, తుల రాజేశ్వరి, లెక్కల స్వప్న, ఎదుల్ల రాజశేఖర్, నక్క పద్మ, ఎడ్ల సరిత, వంగల శ్రీదేవి, నాయకులు కొలిపాక శ్రీనివాస్, కరీం, అనిల్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తాం

- సీపీ అభిషేక్ మహంతి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తామని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి అన్నారు. బుధవారం కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, స్మార్ట్ సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశారు. బస్టాండ్ ఇన్ గేట్ వద్ద గల కార్గో కేంద్రాన్ని మార్చాలని, నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే ఆర్టీసీ స్టాప్‌లను గుర్తించి వేరేచోటుకు తరలించాలని ఆ సంస్థ అధికారులను కోరారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని, పార్కింగ్ స్థలాలు, ఆటోస్టాండ్‌ల గుర్తింపు, కూరగాయలు, పండ్ల మార్కెట్ తరలింపు, జీబ్రా క్రాస్ లైన్స్, సిగ్నల్స్ వద్ద స్టాప్ లైన్లు, సైన్ బోర్డులు, యూటర్న్ వద్ద బ్లింకింగ్ లైట్స్, ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద సిమెంట్ బ్లాక్‌లు, కొత్త యూటర్న్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెడిపోయిన రోడ్లకు మరమ్మతు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఈఈ మహేందర్, అడిషనల్ డీసీపీలు రాజు (పరిపాలన), లక్ష్మీనారాయణ (శాంతిభద్రతలు), ఆర్అండ్‌బీ ఈఈ సాంబశివరావు, ఆర్టీసీ కార్గో ఏఎం సదాశివ్, ట్రాఫిక్ మేనేజర్ రజనీకాంత్, మ్యాట్రిక్స్ (సిగ్నల్ వ్యవస్థ) ప్రతినిధి నాగేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ సర్వర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, కరీముల్లా ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలను ఈ నెల 31 వరకు పొడిగిస్తూ సీపీ అభిషేక్ మహంతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత ఏసీపీల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించొద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, భద్రతా కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఏయిర్ క్రాఫ్ట్‌ల వినియోగంపైనా నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న హరిశంకర్

గంగాధర(చొప్పదండి): సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ డిమాండ్ చేశారు. గంగాధరలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మున్నూరుకాపులు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలన్నారు. త్వరలోనే గ్రామాల వారీగా కమిటీలు వేసి, మండల, జిల్లాస్థాయి కమిటీలను ఓటింగ్ ద్వారా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడలో మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించామని తెలిపారు. ఫిబ్రవరి 4న నిర్వహించే నిత్యాన్నదాన సత్రం వార్షికోత్సవానికి మున్నూరుకాపులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు మద్దపల్లి శ్రీనివాస్, వేముల అంజి, రేండ్ల శ్రీనివాస్, రామిడి సురేందర్, వంగళ మల్లికార్జున్, కరుణాకర్, రవి, రేండ్ల కిరణ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రజనీశ్రీ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌కల్చరల్: ప్రముఖ నటుడు, కవి, నాటక రచయిత, నాట్యాచార్యులు రజనీశ్రీ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాతీయ సాహిత్య పరిషత్ కరీంనగర్ అధ్యక్షుడు గాజుల రవీందర్, పురస్కార కమిటీ కన్వీనర్ జి.వి.శ్యాంప్రసాద్‌లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సొంతంగా రచించిన, జనవరి 1, 2014 నుంచి 31 డిసెంబర్ 2023 మధ్య ముద్రించిన నవలలనే పోటీలకు పంపాలని సూచించారు. అనువాద నవలలు వద్దన్నారు. ప్రతీ నవల టైటిల్స్ నాలుగు ప్రతులు ఫిబ్రవరి 10, 2024లోగా గాజుల రవీందర్, ఇంటి నంబర్ 8–3–255/1 రామచంద్రపూర్ కాలనీ, భగత్‌నగర్, కరీంనగర్ 505001 చిరునామాకు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 98482 55525, 94904 01861 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రంగారెడ్డిలో ‘జమ్మికుంట’ పంచాయితీ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన లొల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట/కొత్తూరు: హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో బుధవారం రాజకీయ గొడవకు దారి తీసింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగడం సంచలనంగా మారింది. ఇరు పార్టీల నాయకులు వందలాదిగా 15 మంది కౌన్సిలర్లు ఉన్న ఫాంహౌస్ వద్దకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసుల రంగప్రవేశం.. చర్చలతో లొల్లి సద్దుమణిగింది. వివరాలిలా ఉన్నాయి.. ప్రస్తుతం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్న రాజేశ్వర్ రావుపై ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పొన్నగంటి మల్లయ్య వర్గం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా మల్లయ్య తనకు అనుకూలంగా ఉన్న వారిని మంగళవారం హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఓ హోటల్‌లో క్యాంపు కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ప్రస్తుత చైర్మన్, ఆయన వర్గీయులు క్యాంపు నుంచి ఒక కౌన్సిలర్‌ను బయటకు రప్పించి, తమతో తీసుకెళ్లారు. అవిశ్వాస తీర్మానానికి ఇంకా సమయం ఉండటం.. క్యాంపు ప్రాంతాన్ని బీఆర్ఎస్ నేతలు తెలుసుకోవడంతో మల్లయ్య వర్గం షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులను సంప్రదించింది. దీంతో కొత్తూరు మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి ఇన్ముల్‌నర్వ సమీపంలోని వైఎం తండా దగ్గర ఉన్న ఓ ఫాంహౌస్‌లో అదేరాత్రి వారికి బస ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న చైర్మన్, ఆయన అనుచరులు అర్ధరాత్రి ఫాంహౌస్ వద్దకు వచ్చి, గేటు తెరవాలని గొడవ చేయగా వారు మాజీ జెడ్పీటీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో శ్యాంసుందర్‌రెడ్డి ఉదయం ఫాంహౌస్ వద్దకు బయలుదేరారు. దారిలో కార్లు కనిపించడంతో వారిని వివరాలు అడిగే క్రమంలో వాగ్వాదం



క్యాంపులో కౌన్సిలర్లు

మొదలైంది. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కుమారుడు, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు విడివిడిగా పెద్ద సంఖ్యలో ఫాంహౌస్ వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకొచ్చారని ఆరోపిస్తుండగా కాంగ్రెస్ నాయకులు పోలీసుల సమక్షంలో కౌన్సిలర్ల వద్దకు తీసుకెళ్లగా తమ ఇష్టంతోనే క్యాంపునకు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ క్రమంలోనే గేటు బయట ఇరు వర్గాల నాయకులు తమ వారికి అనుకూలంగా నినాదాలు చేస్తూ నెట్టుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకొని, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

చైర్మన్ హత్యకు ప్లాన్ చేశారు..

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు హత్యకు షాద్‌నగర్ నియోజకవరగంలోని కొత్తూరులో ప్లాన్ చేశారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట కౌన్సిలర్లను పొనగంటి మల్లయ్య ఓ రిసార్టులో నిర్బంధించారని, శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని కౌన్సిలర్లు సమాచారం ఇవ్వడం వల్లే చైర్మన్ కొత్తూరు వచ్చారని పేర్కొన్నారు.

తప్పుదోవ పట్టిస్తున్నారు..

కౌన్సిలర్లు తమ ఇష్టంతోనే ఫాంహౌస్‌కు వచ్చినట్లు మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు రఘు, మల్లయ్య తెలిపారు. ఇవేవీ తెలుసుకోకుండా తాము ప్రస్తుత చైర్మన్ రాజేశ్వర్‌రావును హత్య చేయడానికి సుపారీ తీసుకున్నామని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. నిజంగా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకొస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి, ఫాంహౌస్‌కు రావాలన్నారు. అర్ధరాత్రి వచ్చి ఎందుకు రెక్కీ నిర్వహించారని నిలదీశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎంపీపీ రవీందర్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు వాస్తవాలు దాచి అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై దాడి చేసిన కాంగ్రెస్ నేత శ్యాంసుందర్‌రెడ్డితోపాటు పలువురిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు కొత్తూరు సీఐ నర్సింహారావుకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్



జగదీశ్వర్‌ను సత్కరిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్: అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడిగా నియమితులై, బుధవారం కరీంనగర్ వచ్చిన మారం జగదీశ్వర్‌కు ఉద్యోగ సంఘాలు ఘన స్వాగతం పలికాయి. నగరంలోని టీఎన్జీవోల సంఘ భవనంలో నాయకులు ఆయనను సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జగదీశ్వర్ కేక్ కట్ చేసి, ఉద్యోగులకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులందరూ చిత్తశుద్ధితో, అంకితభావంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేదలకు చేరేలా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఒంటెల రవీందర్ రెడ్డి, ఒంటెల ప్రసాద్ రెడ్డి, గంగార రమేశ్ గౌడ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, ఎలక్షన్స్ కార్యదర్శి నేరెళ్ల కిషన్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమల్ల శారద, జేఏసీ నాయకులు గుంటి భిక్షపతి, మల్కా రాజేశ్వరరావు, అరసవిల్లి రాజేశ్వరరావు, పవన్‌కుమార్, కొండయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు మంజీత్ సింగ్, వెంకటయ్య, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం


సంజీవ్ (ఫైల్)

పెగడపల్లి:మండలంలోని బతికపల్లి శివారు కొండాయపల్లికి చెందిన క్యాస సంజీవ్ (40) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం సంజీవ్ పనినిమిత్తం మంగళవారం రాత్రి జగిత్యాలకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. సుద్దపల్లి నుంచి లింగాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఆరబోసిన వడ్ల కుప్ప కనిపించకపోవడంతో ఢీకొట్టాడు. అనంతరం బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చే స్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. సంజీవ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 20 గొర్రెలు మృత్యువాత


మృతిచెందిన గొర్రెల వద్ద బాధితుడు ఐలయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో గొర్రెలమందపై కుక్కలు దాడి చేయడంతో ఇరవై గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గంగాళ్ల ఐలయ్య తన షెడ్డులో ఉంచిన గొర్రెల మందపై కుక్కలు మంగళవారం రాత్రి దాడి చేశాయి. కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతిచెందగా, మరికొన్ని గొర్రెలు గాయపడ్డాయి. ఉదయం ఐలయ్య మంద వద్దకు వెళ్లి చూడగా గొర్రెలు చనిపోయి కనిపించాయి. నెల రోజుల క్రితమే సింగిల్‌విండో నుంచి రూ.6లక్షల రుణం తీసుకుని గొర్రెలను కొనుగోలు చేశానని బాధితుడు విలపించాడు. కుక్కలదాడితో రూ.2లక్షల వరకు నష్టపోయానని వాపోయాడు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఆదుకోవాలని వేడుకున్నాడు. కాగా వారం క్రితమే పెంటయ్య గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి పది గొర్రెలను చంపివేశాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం:జగిత్యాల జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన నక్క రాజయ్య (48) అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా వెదికారు. చివరకు గుట్టరాజేశ్వరస్వామి ఆలయం సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. రాజయ్య భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితి మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఏఎస్సై వేణురావు తెలిపారు.

ఇంద్రజాలికుడు రత్నాకర్ మృతి


రత్నాకర్‌గౌడ్ (ఫైల్)

రాయికల్:రాయికల్ పట్టణానికి చెందిన జాతీయస్థాయి ఇంద్రజాలికుడు గొల్లపల్లి రత్నాకర్‌గౌడ్ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. 20 ఏళ్లుగా ఇంద్రజాల ప్రదర్శనలు ఇస్తున్న ఆయన రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. ఆయన మృతిపట్ల కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

7న ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ మహిళ, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక పోటీలు ఈనెల 7న అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నటరాజు రవి, మహేందర్‌రావు తెలిపారు. ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

పొగమంచుతో ప్రమాదం

- చిరువ్యాపారి ఆటోను చిదిమేసిన లారీ
- ఒకరికి తీవ్ర గాయాలు
- త్రుటిలో తప్పి పెనుప్రమాదం


ప్రమాదానికి కారణమైన లారీ


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

సిరిసిల్లక్రైం: శీతాకాలంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు పెను ప్రమాదానికి కారణమైంది. చిరువ్యాపారాకి చెందిన టిఫిన్ తయారీ వాహనాన్ని లారీ ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడఅర్బన్ మండల పరిధిలోని చంద్రగిరిలోని తెట్టికుంట ఏరియాలో నివసించే బొప్పరాజు శ్రీకాంత్, రమాదేవి రగుడు సమీపంలోని వాటర్‌ట్యాంక్‌కు ఎదురుగా మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే బుధవారం తెల్లవారుజాము 5.30 గంటల ప్రాంతంలో వారి ఇంటి నుంచి టిఫిన్ విక్రయించే ప్రాంతానికి ఆటోలో సామగ్రితో బయలుదేరారు. ఇదే సమయంలో కరీంనగర్ ప్రధాన రహదారి నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న ఫ్లైయాష్(బూడిద)తో కూడిన లారీ మొబైల్ టిఫిన్ సెంటర్ ఆటోను వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమాదేవి తీవ్రంగా గాయపడగా, శ్రీకాంత్‌కు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికంగా ఉదయం వాకింగ్‌కు వచ్చిన వాళ్లు ప్రమాదాన్ని గుర్తించి క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ చంద్రయ్యను స్థానికులు అడ్డుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్య

- బర్త్‌డేకు గిఫ్ట్ అంటూ సోషల్ మీడియాలో వైరలవుతున్న వీడియో
- కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదు


శివసాయి

తిమ్మాపూర్: సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో మండలంలోని మల్లాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన కోమటి శివసాయి(23) కరీంనగర్‌లో సెల్‌ఫోన్ రిపేర్ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శివసాయి ఈనెల ఒకటిన ఎల్‌ఎండీ కట్టపై పురుగుల మందు తాగాడు. తర్వాత బావ అడిచర్ల నరేశ్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. వెంటనే నరేశ్ 108కు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు.

ఆత్మహత్యపై అనుమానాలు..

ఇదిలా ఉండగా శివసాయి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతన్నాయి. ప్రేమ విఫలంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బర్త్‌డేకు చిన్న గిఫ్ట్ అంటూ ఆ వీడియోలో పేర్కొన్నాడు. దీంతో లవ్ ఫెయిల్యూర్ అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

పోలీసుల విచారణ..

ఇదిలా వుండగా కడుపునొప్పి భరించలేక తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నట్లు శివసాయి తండ్రి కోమటి కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో విద్యుత్ మోటార్ల దొంగలు

- చితకబాది పోలీసులకు అప్పగించిన రైతులు


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

జగిత్యాలక్రైం:జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొద్దిరోజులుగా విద్యుత్ మోటార్లు, సర్వీస్ వైర్లను దొంగిలిస్తున్న దొంగలను రైతులు పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. మండలంలోని జాబితాపూర్, తిమ్మాపూర్, లక్ష్మీపూర్, కన్నాపూర్, కల్లెడ, పొలాస గ్రామాల్లో ఎన్నికలకు ముందు నుంచి విద్యుత్ మోటార్లు, విద్యుత్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. ఈ క్రమంలో రైతులు అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మోతె శివారులో విద్యుత్ వైరును దొంగిలిస్తుండగా ఓ రైతు పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అతడి నుంచి తప్పించుకుని పారిపోయేందుకు యత్నించగా.. సమీపంలోని రైతులందరూ వెంబడించి ముగ్గురు దొంగలను పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో ఒకరిది బోధన్‌గా.. మిగిలిన ఇద్దరిని జంబిగద్దె ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. వీరు దొంగిలించిన వైరును కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు తెల్సింది.

జగిత్యాలలో యువకుడి వీరంగం


మత్తుమందు చల్లిన యువకుడు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. తనవద్ద బస్‌చార్జీలు లేవని, తనను మల్యాల వద్ద దింపాలని అక్కడే ఉన్న ఓ ప్రయాణికుడిని కోరాడు. అతను నిరాకరించడంతో తన వద్దనున్న మత్తుమందు చల్లాడు. దీంతో సదరు ప్రయాణికుడు అస్వస్థతకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన సునీల్ కొద్దిరోజులుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి జగిత్యాలకు చేరుకున్న అతడు.. అక్కడే ఉన్న ఓ ప్రయాణికుడిపై మత్తుమందు చల్లాడు. అస్వస్థతకు గురైన సదరు ప్రయాణికుడు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సునిల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతడి వద్ద చిన్నచిన్న మారణాయుధాలు కూడా లభించాయి. బుధవారం అతని కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకుడిని ఇలా వదిలిపెట్టవద్దని సూచించారు.

'సహకార' సేవ.. సాంకేతిక తోవ

కరీంనగర్ అర్బన్: సహకార శాఖ సాంకేతిక బాటలో సాగుతోంది. మూసధోరణికి స్వస్తి పలికి కాలానుగుణంగా ఆన్‌లైన్ దారి పడుతోంది. కొత్త సంఘాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు ప్రభుత్వం 'ఈ–సహకార సేవ' పోర్టల్‌ను తీసుకువచ్చింది. కొత్త సొసైటీల ఏర్పాటుకు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లోనే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ చేతికొస్తుంది. దీనికితోడు ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో రిజిస్టర్ అయిన సొసైటీలు, సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సహకార శాఖ కమిషనర్ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సభ్యులు మేజర్ అయి ఉండాలి

కొత్తగా ఏర్పాటయ్యే సంఘాలు సంబంధిత శాఖ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తెలంగాణ సహకార సంఘాల చట్టం–1904 ప్రకారం 21 మంది సభ్యులు, పరస్పర సహాయ సహకార సంఘాల చట్టం–1995 ప్రకారం 10 మంది సభ్యులతో కొత్త సొసైటీ కోసం అర్జీ పెట్టుకోవచ్చు. తర్వాత సొసైటీ పేరు, సభ్యుల వివరాలు ఆన్‌లైన్ ద్వారా జిల్లా సహకార శాఖ అధికారి లాగిన్‌కు వెళ్తాయి. సదరు అధికారి పరిశీలించి, నూతన సంఘం రిజిస్ట్రేషన్ చేసేందుకు కిందిస్థాయి అధికారితో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయిస్తారు. వివరాలు సరిగా ఉంటే డీసీవోకు నివేదిస్తారు. అనంతరం జిల్లా అధికారి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. దీన్ని ఆన్‌లైన్, మీసేవ సెంటర్లలో తీసుకోవచ్చు. ఆయా సంఘాలను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించడంతోపాటు దరఖాస్తు హార్డ్‌కాపీని డీసీవో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. కాగా, ప్రభుత్వం వెబ్ పోర్టల్‌ను గత జూలైలో ప్రారంభించింది. దీనిపై అంతగా అవగాహన లేకపోవడంతో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసుకునేవారు మాన్యువల్‌గానే చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఏటా 4 నుంచి 5 కొత్త సంఘాలు, అధిక సంఖ్యలో మహిళా సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని అంటున్నారు. సహకార సంఘాల నియమావళి ప్రకారం కొత్త సంఘాలు ఏర్పాటు చేసుకునే సభ్యులు మేజర్ అయి ఉండాలి. కుటుంబంలోని ఇద్దరు ఒకే సంఘంలో సభ్యులుగా ఉండకూడదు. జైలుశిక్ష పడినవారు అనర్హులు.

ఏయే సంఘాలు చేసుకోవచ్చంటే..

ఉద్యోగుల పరపతి, గృహ నిర్మాణ, కార్మిక, వినియోగదారుల, మహిళా పొదుపు సహకార సంఘాలు, రైతు పరస్పర సహకార సంఘాలు, జాయింట్ ఫార్మింగ్, వెల్ఫేర్ సొసైటీలు.

తక్కువ సమయంలో పూర్తి..

కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం రిజిస్టర్ అయిన సొసైటీలు, సభ్యుల వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. సహకార, పరస్పర సహకార చట్టాల ప్రకారం జిల్లాలో 51 సంఘాలు, వాటిలో 1.25 లక్షల మందికి పైగా సభ్యులు ఉన్నారు. కాగా, ఆన్‌లైన్ విధానం ద్వారా కొత్త సంఘాలను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవచ్చని, తక్కువ సమయంలోనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని జిల్లా సహకార శాఖ అధికారులు తెలిపారు.

పోక్సో కేసులో ఇద్దరి అరెస్టు

- విద్యార్థులను వేధించిన ప్రబుద్ధులు
- సిరిసిల్లలోని హాస్టల్స్ వద్ద పోకిరీల వేధింపులు
- కటకటాలకు పంపించిన పోలీసులు

సిరిసిల్లక్రైం: వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన ఇద్దరు పోకిరీలపై సిరిసిల్ల పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు విధులు నిర్వర్తించే కార్యాలయాల సమీపంలో ఉన్న ఓ హాస్టల్‌లోని విద్యార్థినులను ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేసే వ్యక్తితోపాటు మరొకరు కొద్ది రోజులుగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. వీరి ఆగడాలు గమనించిన స్థానికులు, హాస్టల్ నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన సిరిసిల్ల పోలీసులు విద్యార్థుల వ్యక్తిగత వివరాలు బయటకు పొక్కకుండా పోకిరీలపై పోక్సో కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

చోరీ కేసులో అరెస్ట్

రామగిరి(మంథని): లద్నాపూర్ గ్రామంలోని మహలక్ష్మి వైన్‌షాపులో ఈనెల 2న జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు మంథని సీఐ సతీశ్ తెలిపారు. రామగిరి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లద్నాపూర్ గ్రామానికి చెందిన మహలక్ష్మి వైన్స్‌లో చోరీ జరిగిందని ఈనెల 2న దాడి రజనీకాంత్ తమకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సమీప సీసీ కెమెరాల ద్వారా నిందితులు, వారు ఉపయోగించిన ఆటో గుర్తించారు. ఈక్రమంలో పన్నూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అటుగా అనుమానితులు వచ్చారు. వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితుల్లో పెద్దపల్లికి చెందిన సయ్యద్ షఫీఉద్దీన్, మరొకరు మైనర్‌గా గుర్తించారు. నిందితుల వద్ద రూ.98వేల నగదు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన 24 గంటల్లో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రవిప్రసాద్, సిబ్బంది సదానందం, కిరణ్, శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

బిల్లులు రాక.. భోజనం లేక

- యామాపూర్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టని నిర్వాహకులు
- ఇంటినుంచి తెచ్చుకుని తింటున్న వైనం
- పట్టించుకోని అధికారులు, గ్రామస్తులు


ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుని పాఠశాలలో తింటున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల కన్నా దీటుగా బోధించడంతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, ఉచిత పుస్తకాలను అందిస్తామని హామీ ఇచ్చి పాఠశాలల్లో చేర్చుకున్నారు. గ్రామంలో బడిబాట నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కోరారు. కానీ విద్యార్థులకు మాత్రం మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు. మండలంలోని యామాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7 వ తరగతి వరకు 41 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 6,7 తరగతుల్లో విద్యార్థులు లేకపోవడంతో 6 గురు ఉపాధ్యాయుల్లో ఇద్దరిని డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు పంపించారు. 1 నుండి 5 వ తరగతి చదువుతున్న తరగతుల విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన నుంచి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వారికి సరిగ్గా బిల్లులు, జీతాలు రావడం లేదని మధ్యాహ్న భోజనం వండడం లేదు. దీంతో హెచ్ఎం, ఉపాధ్యాయులు ఇన్‌చార్జి ఎంఈవో ఆనంద్‌రావుకు రాతపూర్వకంగా ఇచ్చి సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామస్తులకు తెలిపినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న 41 మంది విద్యార్థులు ఇంటి నుంచి భోజన బాక్సులను తెచ్చుకుని మధ్యాహ్నం పాఠశాలల్లో తింటున్నారు. కొంత మంది విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనం చేసి మళ్లీ పాఠశాలకు వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను ఏర్పాటు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రారంభం నుంచే అన్నం పెడుతలేరు



బడి ప్రారంభమైన నుంచి పాఠశాలలో అన్నం పెడుతలేరు. నేను, చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచే డబ్బాలో అన్నం తెచ్చుకుని తింటున్నాం. అధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం పెట్టించాలి.

– ఎర్ర తేజస్, యామాపూర్, 5వ తరగతి విద్యార్థి

ఎవరూ పట్టించుకోవడం లేదు



పాఠశాల ప్రారంభం నుంచి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వంట వండేందుకు రావడం లేదు. ఎన్నో సార్లు చెప్పినప్పటికీ నిర్వాహకులు వస్తలేరు. మధ్యాహ్న భోజనం వండేందుకు ఎవరినైనా నియమించాలని సర్పంచ్‌కు, ఎంపీటీసీకి, గ్రామస్తుల దృష్టికి తీసుకపోయినా పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు.

– కోటగిరి రత్నం, హెచ్ఎం

డిప్యూటీ సీఎంకు రాజన్న ప్రసాదం


డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు ఎడ్ల శివసాయి

వేములవాడ: రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కలిసి రాజన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ఎడ్ల శివసాయి, వేదపండితులు పాల్గొన్నారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం


కాంస్య పతకం సాధించిన సిరిచందనను అభినందిస్తున్న డాక్టర్ వంశీ కృష్ణారావు

కరీంనగర్‌స్పోర్ట్స్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గత డిసెంబర్ 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరిగిన నేషనల్ ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లాకు చెందిన తుడి సిరిచందన అద్వితీయ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. 52 కేజీల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి మే నెలలో హంకాంగ్‌లో జరగబోయే ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సిరిచందనను ద్వారకామయి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వంశీ కృష్ణారావు, అడ్మినిస్ట్రేషన్ రాజమహేందర్ అభినందించారు. ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వెళ్లటానికి హాస్పిటల్ తరుపున ఆర్థికసాయం అందించేందుకు ముందుకు రావడం విశేషం.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ట్రినిటి విద్యార్థి


రతన్‌ను అభినందిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్: మహబూబ్‌నగర్ జిల్లాలో గత డిసెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ట్రినిటి కళాశాల విద్యార్థి పులిరూబి రతన్ అత్యంత ప్రతిభ కనబరిచి హర్యానాలోని హిస్సార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల పీఈటీ తెలిపారు. ట్రినిటి కళాశాలల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ దయాకర్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది బుధవారం రతన్‌ను అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రినిటి గ్రూఫ్ ఆఫ్ కళాశాలల నుంచి విద్యార్థులు వివిధ క్రీడల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి


మాట్లాడుతున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్అర్బన్: కేడీసీసీ బ్యాంకు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుదవారం నిర్వహించిన జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు కోసం ఇస్తున్న టర్మ్‌లోన్, అంతరపంటలకు కేడీసీసీబీ ద్వారా ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఉద్యానవన పంటలు, పాడిపశువులు, చేపల పెంపకం, పౌల్ట్రీలకు సంబంధించిన వివరాలను ఉమ్మడి జిల్లాకు ప్రతిపాదించి, రాష్ట్రస్థాయి సాంకేతిక సమావేశానికి సిఫారసు చేశారు. నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, కేడీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.సత్యనారాయణరావు, కరీంనగర్, జగిత్యాల జిల్లాల ఎల్డీఎంలు ఆంజనేయులు, వెంకటరెడ్డి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల వ్యవసాయాధికారులు శ్రీధర్, వి.భాస్కర్, జిల్లా పశువైద్యాధికారి బి.నరేందర్, ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

మానకొండూర్‌రూరల్: ఇల్లంతకుంట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ఏడో తరగతి చదువుతున్న మానకొండూర్‌కు చెందిన దావ శ్రీహర్షిణి, శ్రీనివాసనగర్ కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతున్న రమాదేవి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్ క్రీడాప్రాంగణంలో బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీల ఎంపికలు నిర్వహించారు. నాలుగు జిల్లాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. అత్యంత ప్రతిభ కనబరిచి శ్రీహర్షిణి, రమాదేవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6,7,8వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రిన్సిపల్ శోభారాణి, స్పెషల్ ఆఫీసర్ స్వప్న పీఈటీ వరలక్ష్మి, కోమలత, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రావి ఆకు మీద సావిత్రిబాయి పూలే



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్న సూక్ష్మ కళాకారుడు, కవి, సైకతశిల్పి గాలిపెల్లి చోళేశ్వర్‌చారి రావి ఆకు మీద సావిత్రి బాయి పూలే చిత్రాన్ని చిత్రీకరించాడు. చోళేశ్వర్‌చారిని ప్రిన్సిపాల్ రాజేశ్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

క్లుప్తంగా

ప్రజాపాలన పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో టీం లీడర్లు, ఇన్‌చార్జి వార్డు అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, అధికారులతో రివ్యూ నిర్వహించారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులు పరిశీలించాలని, ఏవైనా లోపాలుంటే అప్పుడే సరిచేయించాలన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకూడదన్నారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ స్వరూపరాణి, సహాయ కమిషనర్ నరేశ్ బాబు, డీసీపీ సుభాష్, ఈఈ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ


ఎలబోతారంలో అక్షింతలతో నాయకులు

కరీంనగర్‌రూరల్: మండలంలోని ఎలబోతారంలో అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామస్తులకు స్వామివారి ఫొటో, కరపత్రాలను అందజేశారు.

సిమెంట్ బెంచీల కొనుగోలుకు విరాళం


విరాళం ఇస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌లో ప్రజల సౌకర్యార్థం 21 సిమెంట్ బెంచీల కొనుగోలుకు ఎంపీటీసీ సభ్యుడు వెంగల్‌దాసు శ్రీనివాస్ రూ.50 వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ప్రతినిధులకు నగదు అందజేశారు. వారం రోజుల్లో గ్రామంలోని ప్రధాన చౌరస్తాల్లో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్లబ్ సభ్యులు రాజిరెడ్డి, రమణారెడ్డి, తోట కిరణ్‌కుమార్, కపిల్ మాధవ, చక్రధర్, రాంరెడ్డి, చింతల కిషన్, ర్యాకం మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సప్తగిరికాలనీ: తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రేవెల్లి తిరుపతి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్, ప్రధాన కార్యదర్శి బలరాం, ఉపాధ్యక్షులు సురేశ్, కోదాని రవీందర్, భూక్య రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్‌లో నిర్వహించాలి

విద్యానగర్: పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్‌లో నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి కోరారు. బుధవారం ఆయన స్థానికంగా ఓ ప్రకటన విడుదల చేశారు. పెళ్లిళ్ల సమయంలో డబ్బుల నియంత్రణతో తల్లిదండ్రులు, అటు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. వచ్చేనెలలో శుభ మూహుర్తాలు ఉన్నాయని.. పెళ్లిళ్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు.

విద్యార్థులపై దాడిచేసిన వారిపై కేసు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని రాంనగర్‌లో జరిగిన ఒక గొడవ విషయంలో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూటౌన్ ఎస్సై రాజన్న తెలిపారు. రాంనగర్ ఎస్సీ హాస్టల్‌లో గత నెల 31న విద్యార్థులు, బయటి వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. పాత గొడవను దృష్టిలో ఉంచుకొని మంగళవారం రాత్రి 11.30 గంటలకు తిరిగి సాయిరాం, నాగరాజు, అరుణ్, సిద్ధార్థ, మధు, రవిప్రసాద్, శ్రీధర్, ఈశ్వర్, పవన్ రాంనగర్‌లోని ఎస్సీ హాస్టల్‌లోకి అక్రమంగా ప్రవేశించి వేల్పుల మధుతో పాటు ఇతర విద్యార్థులపై కట్టెలు, రాళ్లతో దాడిచేశారు. వాచ్‌మన్ గూడూరి సతీశ్ అడ్డురాగా ఆయనపై దాడిచేశారు. ఈ ఘటనపై వేల్పుల మధు పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడిలో పాల్గొన్న తొమ్మిది మందిపై కేసు ఫైల్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ట్రాఫిక్ కష్టాలపై సీపీ ఫోకస్

- తొలుత నగరంలో జీబ్రా, స్టాప్‌లైన్లు ఏర్పాటు చేయాలని యోచన
- తర్వాత ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించాలని నిర్ణయం
- స్మార్ట్‌సిటీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో ముందుకు


బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్, నిలిచిన వాహనాలు

కరీంనగర్ క్రైం: నగరంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ సమస్యకు త్వరలోనే మోక్షం కలగనుంది. మొత్తం 12 కూడళ్లలో సిగ్నల్స్ ఏర్పాటు చేసిన అధికారులు ట్రయల్స్ నిర్వహించి, ప్రస్తుతం వాటిని నిలిపివేశారు. వాహనాల సంఖ్య పెరగడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లపై రద్దీ ఎక్కువగా ఉంటోంది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పనికి ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో సీపీ అభిషేక్ మహంతి నగరంలోని ట్రాఫిక్ కష్టాలపై దృష్టిసారించి, స్మార్ట్‌సిటీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో ముందుకుసాగుతున్నారు.

రోజుకు సమారు లక్ష వాహనాలు

కరీంనగర్ నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులకు, ఇతర అవసరాలకు అధిక సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. ఇవన్నీ కలిపితే రోజుకు సమారు లక్ష వరకు నగర రోడ్లపై తిరుగుతుంటాయి. దీంతో బస్టాండ్ చౌరస్తా, తెలంగాణ చౌక్, ఆర్‌అండ్‌బీ చౌరస్తా, కమాన్‌చౌరస్తా, కోతిరాంపూర్, ఎన్టీఆర్ విగ్రహం చౌరస్తా, గాంధీరోడ్డు, రేకుర్తి, నాఖాచౌరస్తా, మంకమ్మతోట, రాంగనర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం అవుతోంది. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

జీబ్రా క్రాసింగ్, స్టాప్ లైన్లు..

నగరంలోని ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపాలని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించాలంటే అన్ని చౌరస్తాల వద్ద జీబ్రా క్రాసింగ్, స్టాప్ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ముందుగా ఈ పని పూర్తి చేయాలని చూస్తున్నారు. అంతకంటే ముందు ప్రస్తుతం ఉన్న పలు చౌరస్తాల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టనున్నారు. ఎస్సారార్ కళాశాల చౌరస్తా వద్ద దారిని మూసివేసి, యూటర్న్ చేసుకోవడం, వావిలాలపల్లిలోని పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం చౌరస్తాను మూసివేసి, ముందుగా ఉన్న విద్యుత్ కార్యాలయం, చైతన్యపురి యూటర్న్‌లకు వాడతారు. కమాన్‌చౌరస్తా కేబుల్ బ్రిడ్జి వద్ద నుంచి వస్తున్న వాహనాలు ట్రాఫిక్‌జాంకు కారణమవుతున్నాయని గుర్తించారు. దీంతో కోతిరాంపూర్ వెళ్లే దారిలో ఒక యూటర్న్ ఏర్పాటు చేస్తున్నారు. కేబుల్ బ్రిడ్జి జంక్షన్ వద్ద మూసివేసి, పెట్రోల్ బంక్ పెద్దపల్లి–కరీంనగర్ రోడ్డులో రెండు చోట్ల యూటర్న్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ బస్సులు ఎక్కడపడితే అక్కడ నిలపకుండా చూస్తున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించడంతోపాటు పండగల సీజన్ వ్యాపారాలు చేసుకునేవారికి అంబేడ్కర్ స్టేడియంలో తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. జీబ్రా లైన్స్, స్టాప్ లైన్స్ పూర్తవగానే ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించాలని, నెల రోజుల్లోపే ఈ పనులు పూర్తి చేయాలని అనుకుంటున్నారు.

సమస్యలు గుర్తించాం



నగరంలోని ట్రాఫిక్ సమస్యలను గుర్తించాం. మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, స్మార్ట్‌సిటీ అధికారులతో చర్చించాం. త్వరలోనే జీబ్రా క్రాసింగ్, స్టాప్ లైన్స్ ఏర్పాటు చేసి, ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభిస్తాం. దీంతోపాటు ట్రాఫిక్ జాంకు గల కారణాలు విశ్లేషించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– సీపీ అభిషేక్ మహంతి

పథకాలకు దరఖాస్తు చేసుకోండి

- మేయర్ సునీల్ రావు


దరఖాస్తు స్వీకరిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: ఆరుగ్యారంటీ పథకాలకు సంబంధించి ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు సూచించారు. బుధవారం నగరంలోని 5, 10, 29, 32, 36, 39, 41, 52, 53, 57 డివిజన్‌లలో సభలు నిర్వహించారు. ఆయా డివిజన్‌లలోని పలు ప్రజాపాలన కేంద్రాలను మేయర్ సందర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే అభయహస్తం పథకాలకు డివిజన్‌ల వారీగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డివిజన్ సభలు నిర్వహించే చోటే దరఖాస్తులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.

ఐదోరోజు 8,705 దరఖాస్తులు

ప్రజాపాలనలో భాగంగా ఐదోరోజు నగరంలోని 60 డివిజన్లలో 8,705 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గ్యారంటీ పథకాలకు సంబంధించినవి 7,917 కాగా, ఇతరాలు 788 ఉన్నాయి. ఇప్పటివరకు నగరవ్యాప్తంగా 58,548 అర్జీలు స్వీకరించారు.

నగరంలో మెరుగైన లైటింగ్

నగరం సుందరంగా ఉండేలా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మెరుగైన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. బుధవారం 5, 27 డివిజన్‌లలో స్థానిక కార్పొరేటర్లు గౌసియా బేగం అబ్బాస్ సమీ, నుజహత్ ఫర్వీన్ అలీతో కలిసి మినీ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. పాలకవర్గం హయాంలో సుమారు రూ.20 కోట్ల నిధులతో నగరంలో ఇప్పటి వరకు 600 మినీ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. గతంలోనే ఎన్టీఆర్ చౌరస్తా నుంచి పద్మానగర్ బైపాస్ వరకు, ఎన్టీఆర్ చౌరస్తా నుంచి రామగుండం బైపాస్ వరకు, రేకుర్తి నుంచి చింతకుంట వరకు, అలుగునూరు నుంచి మహాత్మానగర్ వరకు అన్ని ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. విలీన గ్రామాల డివిజన్లలో కూడా చాలాచోట్ల వీధిదీపాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఇద్దరికి కారుణ్య ఉద్యోగాలు

నగరపాలకసంస్థ కార్యాలయంలో బుధవారం మేయర్ సునీల్‌రావు కారుణ్య ఉద్యోగాలు పొందిన ఆరెపల్లి అన్వేశ్, శ్రీనివాస్‌కు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ స్వరూప రాణి, కార్పొరేటర్లు చాడ గొండ బుచ్చిరెడ్డి, బండారి వేణు తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సైబర్ ఇన్‌స్పెక్టర్ సునీల్

కరీంనగర్‌క్రైం: సైబర్ జాగ్రుత దివస్‌లో భాగంగా నగరంలోని సహస్ర జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ సునీల్ సైబర్ మోసాలు, హ్యాకింగ్, ఓటీపీలు చెప్పడం ద్వారా జరిగే మోసాలు ఎలా అరికట్టాలో వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది వసీం, వెంకటేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలుపై అనుమానమెందుకు?


మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు అనుమానాలు ఎందుకని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీలాగా మాటిచ్చి మోసంచేసే పార్టీ కాంగ్రెస్ కాదన్నారు. బుధవారం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలపై అనుమానాలున్నాయంటూ వినోద్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆరుగ్యారంటీ పథకాలు అమలైతే బీఆర్‌ఎస్ భవిష్యత్ ఉండదనే భయంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్‌కే చెందిన మేయర్ సునీల్‌రావు అనుకూలంగా మాట్లాడుతుంటే, వినోద్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడమేమిటన్నారు. దరఖాస్తు దారుల ఇండ్లకు వెళ్లి అర్హతలు పరిశీలించి అధికారులు బ్యాంక్ అకౌంట్ నెంబర్లు తీసుకొంటారని తెలిపారు.

గ్రామాల్లో ప్రజాపాలన అర్జీల స్వీకరణ


మొగ్దుంపూర్‌లో అర్జీలు తీసుకుంటున్న సర్పంచ్ నర్సయ్య, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్, జూబ్లీనగర్, మందులపల్లి గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొగ్దుంపూర్‌లో–1,085, జూబ్లీనగర్‌లో–403, మందులపల్లిలో–244 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జక్కం నర్సయ్య, రాయమల్లు, ఉపసర్పంచు కూకట్ల తిరుపతి, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, ఏపీవో శోభ, ఏవో సత్యం, ఐకేపీ ఏపీఎం భార్గవ్, మాజీ సర్పంచ్ రుద్ర రాము, నాయకులు ఎం.సాయిలు, నాగరాజు, డి.నారాయణ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతోనే సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న బ్రహ్మకుమారి మనీషా

విద్యానగర్: మానసిక ప్రశాంతతతోనే మనుషులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కరీంనగర్ శాఖ బాధ్యురాలు బ్రహ్మకుమారి బీకే మనీషా అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కరీంనగర్ శాఖల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శారీరక శ్రమ నుంచి ఉపశమనం పొందాలంటే మానసిక ప్రశాంతత ముఖ్యమని, అది మెడిటేషన్ ద్వారా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పాత్రికేయ వృత్తిలో ఉన్నవారు నిత్యం అనేక ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహించాల్సి ఉంటుందని, అలాంటివారికి మెడిటేషన్ ద్వారానే సాంత్వన చేకూరుతుందని తెలిపారు. కరీంనగర్‌లో తాము నిర్వహిస్తున్న కేంద్రాల్లో నిత్యం మెడిటేషన్ చేసే అవకాశం లభిస్తుందని, జర్నలిస్టులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు తాడూరు కరుణాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బల్మూరి విజయసింహారావు, పి.ప్రభుదాస్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల భిక్షాటన


భిక్షాటన చేస్తున్న ఆటోడ్రైవర్లు

సప్తగిరికాలనీ: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో బతుకులు రోడ్డున పడ్డాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నగరంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. బీఆర్టీయూ అనుబంధ సంఘమైన కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి తెలంగాణ చౌక్ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, యూనియన్ నగర అధ్యక్షుడు మద్దెల రాజేందర్, ప్రధాన కార్యదర్శి బండారి నరసింహ, సంపత్, అంతగిరి సంపత్, ఆటో యూనియన్ నాయకులు గొర్రె రవి, సంపత్, మల్లేశం, వంద మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గోవధను నిరసిస్తూ బీజేపీ నాయకుల ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మొలంగూర్‌లో గోవధ ఘటనకు నిరసనగా బీజేపీ నాయకులు మండల కేంద్రంలో కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గోవధకు పాల్పడిన నిందితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రహదారిపై భారీసంఖ్యలో వాహనాలు నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకో, ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పుల్లెల పవన్‌కుమార్, సొల్లు అజయ్‌వర్మ, మాడ వెంకట్‌రెడ్డి, నరేందర్, కొమురయ్య, రాజిరెడ్డి, గిరిధర్, జగ్గారెడ్డి, సారయ్య, వీరార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులపై కేసు

మండల కేంద్రంలో రాస్తారోకో, ధర్నా చేపట్టి ప్రయాణికులు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేసిన బీజేపీ నాయకులపై కేసునమోదు చేశామని ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు. నగునూరు కళాశాలలో అధ్యాపకులు..


బీసీ యువజన సంఘం నాయకులు..


ముకరంపుర ధన్గర్‌వాడీ స్కూల్లో నివాళి అర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు


డీవైఎఫ్ఐ నాయకులు..

కరీంనగర్: దేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని జిల్లా కేంద్రంలోని రిషి కాన్వెంట్ స్కూల్‌లో బుధవారం నిర్వహించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అక్షర జ్ఞానం ద్వారా సమాజ అభ్యున్నతే సావిత్రిబాయి పూలే జీవిత ధ్యేయమని, అట్టడుగు వర్గాల, మహిళల హక్కుల కోసం పోరాడారన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు పెంట అజయ్, హరికుమార్, వేణుగోపాల్, మధుబాబు, కాల్వ కిషన్, గరిగె కోటేశ్వర్, మధు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ డి.శ్రీహరి, అధ్యాపకులు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. స్త్రీల విద్యాభివృద్ధి కోసం సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమన్నారు. విద్యార్థినులు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని, ముందుకు సాగాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, ఎన్ఎస్ఎస్ పీవో లావణ్య, రోజారమణి తదితరులున్నారు.

ఆశ్రమంలో పండ్ల పంపిణీ

సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ వృద్ధుల, అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్, కన్వీనర్ శ్రీరాముల రమేశ్, కరీంనగర్ సింగిల్‌విండో వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, సంస్థ ప్రతినిధులు స్వరూప, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్: దేశం గర్వించదగ్గ మహోన్నతమైన స్త్రీమూర్తి సావిత్రిబాయి పూలే అని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ఆమె 193వ జయంతి నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. సమాజంలో అసమానతలు తొలగించడమే ఆమె లక్ష్యమన్నారు. నాయకులు గుంటి స్వరూప, గున్నాల కన్నాంబ, లింగంపల్లి శ్రీనివాస్, నరేందర్, మారుతి, శ్రీకాంత్, శేఖర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ఆడపిల్లల చదువుల కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్య మూర్తి సావిత్రిబాయి పూలే అని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. నగరంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. సావిత్రిబాయి పూలే స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. నేడు మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యారంగాన్ని కాపాడాలని కోరారు. నాయకులు నరేశ్, శివరాజ్, అఖిలప్రియ, అజయ్, నరహరి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సప్తగిరికాలనీ: సావిత్రిబాయి పూలే జయంతిని నగరంలోని పలు సంస్థల్లో నిర్వహించారు. సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఖాజా నజీరుద్దీన్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, బీసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషిని ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ముకరంపురలోని ధన్గర్‌వాడీ స్కూల్లో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు.

పోస్టల్ వడ్డీరేట్ల పెంపు

విద్యానగర్: తపాలా శాఖ వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుందని.. ఈనెల నుంచి మార్చి 31 వరకు కొత్త వడ్డీ రేట్లు వర్తిస్తాయని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజీ తెలిపారు. బుధవారం స్థానికంగా ఓ ప్రకటన విడుదల చేశారు. పెరిగిన వడ్డీ రేట్ల ప్రకారం సేవింగ్స్ డిపాజిట్‌పై 4.0 శాతం, ఏడాది టైమ్ డిపాజిట్‌పై 6.9, రెండు సంవత్సరాల టైమ్ డిపాజిట్‌పై 7.0, మూడు సంవత్సరాల టైమ్ డిపాజిట్‌పై 7.1, ఐదు సంవత్సరాల టైమ్ డిపాజిట్‌పై 7.5, ఐదు సంవత్సరాల రికరింగ్ డిపాజిట్‌పై 6.7, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌పై 8.2, నెలవారీ ఆదాయ ఖాతా పథకంపై 7.4, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్స్‌పై 7.7, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకంపై 7.1, సుకన్య సమృద్ధి ఖాతా పథకంపై 8.2 శాతం వడ్డీ పెంచినట్లు ఆయన పేర్కొన్నారు.



కాలువ ఇలా.. నీరు వెళ్లేదెలా?

కరీంనగర్ మండలంలోని చామనపల్లి ఎస్సారెస్పీ కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గడ్డి, పిచ్చిమొక్కలు నీటి ప్రవాహానికి అడ్డు వస్తున్నాయి. బుధవారం ప్రధాన రహదారిలోని అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కాలువ పైపులకు అడ్డుగా ప్లాస్టిక్ సీసాలు, చెత్తాచెదారం చేరడంతో నీరు ముందుకు వెళ్లని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి, చెత్త తొలగించాలని రైతులు కోరుతున్నారు. – కరీంనగర్‌రూరల్

మాజీ సీఎం అక్రమాలపై విచారణ చేపట్టాలి



విద్యానగర్: మాజీ సీఎం కేసీఆర్ అవి నీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని టీడీపీ లీడర్లు కోరారు. బుధవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నిరసనలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య మాట్లాడుతూ మాజీ సీఎం అవినీతితో రాష్ట్రం పదేళ్లపాటు వెనక్కి పో యిందన్నారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకొన్న కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, కల్వకుంట్ల కవిత, సంతోష్‌రావుపై న్యాయ విచారణ జరపించాలన్నారు. నిరసనలో పార్టీ లీడర్లు ఎస్.రాజేశం, తీగుట్ల రమేశ్ కుమార్, ఎర్రోజు హైగ్రీవచారి, రోడ్డ శ్రీనివాస్, ఇట్ట మల్లేశం, అందే లక్ష్మణ్, వేల్మల లక్ష్మణ్ రావు, ఎ.రజిత, బోగ సీతయ్య, బుర్ర రాంచెంద్రంగౌడ్, డి.నరేందర్ దత్తు, ఎస్‌కే సమీర్, తుంగ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



బుధవారం కాకినాడలో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు కార్యక్రమానికి హాజరైన అశేష జనసందోహాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఊరు మారింది

ఇచ్ఛాపురం–కుప్పం.. ఏ ఊరైనా సరే.. మనం తెచ్చిన మార్పులు మీరే చూడండి: సీఎం జగన్

- కేవలం 55 నెలల కాలంలో పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం
- ఏ రాష్ట్రమూ ఇవ్వని విధంగా 66.34 లక్షల మందికి పింఛన్లు
- రూ.3,000 వైఎస్సార్ పింఛన్ కానుకను కాకినాడ నుంచి ప్రారంభించిన ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా 'వైఎస్సార్ పెన్షన్ కానుక' ద్వారా అవ్వా తాతలకు రూ.3,000 చొప్పున పింఛన్‌ను మన రాష్ట్రంలో మాత్రమే అందిస్తున్నామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మాట నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని పెంచి ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రతి నెలా 66.34 లక్షల మందికి టంఛన్‌గా ఇంటి వద్దే చేతిలో పెడుతున్నామన్నారు. ఇందుకోసం నెలకు రూ.2 వేల కోట్లు వరకు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పెన్షన్ మొత్తాన్ని పెంచడమే కాకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూరేలా పెన్షన్ల సంఖ్యను కూడా పెంచామన్నారు. నాడూ నేడూ.. ఇదే రాష్ట్రం, అంతే బడ్జెట్, నిరుపేదలూ అదే సంఖ్యలో ఉన్నా చంద్రబాబు హయాంలో మేలు చేయాలనే ఆలోచన ఎందుకు చేయలేదు? బటన్లు ఎందుకు నొక్కలేదు? ఇవాళ మీ బిడ్డ ఇవన్నీ ఎలా చేయగలుతున్నాడు? అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. అవ్వా తాతలకు పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచుకుంటూ వెళతానంటూ నాడు పాదయాత్రలో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్ బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందచేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, సీఎం జగన్ అభిమానుల ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీ వరకు ఈ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు.

> చంద్రబాబు హయాంలో పింఛన్ కేవలం రూ.1,000 మాత్రమే ఉండేది. గత ఎన్నికలకు రెండు నెలల ముందు మాత్రమే రూ.2 వేలు చేశారు. ఆ ఎన్నికలే రాకపోతే చంద్రబాబు పింఛన్ మొత్తాన్ని పెంచేవారా?
>
> –కాకినాడ సభలో సీఎం జగన్

ఈ సందర్భంగా కాకినాడకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనవాహినిని ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు.

క్యాలెండర్‌లో కాదు.. జీవితంలో మార్పు

అవ్వాతాతల పెన్షన్ రూ.3,000 వరకూ పెంచుకుంటూ పోతాం అని మేనిఫెస్టోలో చెప్పిన మాటను తు.చ. తప్పకుండా నెరవేరుస్తూ మీ అందరి సమక్షంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం దేవుడు నాకిచ్చిన అదృష్టంగా భావిస్తున్నా. కొత్త సంవత్సరం అంటే కేవలం క్యాలెండర్‌లో ఒక మార్పు మాత్రమే కాదు. కొత్త సంవత్సరం అంటే ప్రతి ఒక్కరి జీవితంలో ఆదాయం, ఆనందం పెరగాలి. మరింత మెరుగైన పరిస్థితుల్లోకి వెళ్లాలి. అలాంటి గొప్ప కార్యక్రమంలో ఇవాళ పాలు పంచుకుంటున్నా.

నా వలంటీర్ తమ్ముళ్లు, చెల్లెమ్మలు..

పెన్షన్ తీసుకుంటున్న వీళ్లందరి పరిస్థితిని ఒక్కసారి గమనిస్తే పెద్ద వయసు వల్ల గానీ, విధిరాత వల్ల గానీ తమను తాము పోషించుకోలేని పరిస్థితుల్లో తల్లడిల్లుతున్నారు. అటువంటి 66.34 లక్షల మంది అవ్వాతాతలకు, అభాగ్యులకు, వితంతువులకు మంచి చేస్తూ మన ప్రభుత్వం సామాజిక పెన్షన్‌ను రూ.3,000 చేసింది. ఈ రోజు మనం పెన్షన్ల కోసం ప్రతి నెలా చేస్తున్న ఖర్చు దాదాపు రూ.2 వేల కోట్లు. నెలలో ఒకటో తారీఖు మిగిలిన ప్రపంచానికి సెలవు, పండగ రోజు కావచ్చు కానీ మీ జగనన్న సైన్యం, నా వలంటీర్ తమ్ముళ్లు, చెల్లెమ్మలకు మాత్రం అది ప్రతి అవ్వాతాతల ముఖంలో చిరునవ్వు చూసే రోజు. సూర్యోదయానికి ముందే చిరునవ్వుతో గుడ్ మార్నింగ్ చెబుతూ ప్రతి అవ్వకు, తాతకు మంచి మనవడిగా, మనవరాలిగా చేయూతనిస్తున్న నా వలంటీర్లకు మాత్రం అది సెలవు రోజు కాదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మీ ఇష్టం.. ఏ గ్రామాన్నైనా తీసుకోండి

ఇవాళ రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి కుప్పం దాకా ఏ గ్రామాన్నైనా తీసుకోండి. మీ ఇష్టం.. ప్రతి గ్రామంలోనూ మార్పు కనిపిస్తోంది. అడుగు పెడుతూనే ప్రతి గ్రామంలోనూ గతంలో లేని విధంగా మార్పు కనిపిస్తూ గ్రామ సచివాలయం గోచరిస్తుంది. అందులో 10 మంది శాశ్వత ఉద్యోగులు కనిపిస్తారు. ప్రతి గ్రామంలోనూ వలంటీర్ వ్యవస్థతోపాటు ఇంటి వద్దకే అందుతున్న రేషన్, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ కనిపిస్తాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమూ కనిపిస్తుంది. నాడు–నేడుతో గ్రామంలో మారిపోయిన స్కూళ్లు, ఆస్పత్రులతో మన కళ్ల ఎదుటే మార్పులు కనిపిస్తాయి. మెరుగులు దిద్దిన 108, 104 కనిపిస్తాయి. గతంలో 1,050 రోగాలకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీని ఇవాళ 3,250 ప్రొసీజర్లకు వర్తింపచేస్తూ ప్రతి పేదవాడికి అండగా నిలబడ్డాం. రైతులకు పగటి పూటే ఉచిత కరెంటు 9 గంటలు ఇస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. చదువుకుంటున్న పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అండగా నిలబడుతున్నాం. వసతి దీవెనతో అండగా ఉన్న పరిస్థితులూ కనిపిస్తున్నాయి. పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, స్కూళ్లలో ఐఎఫ్‌పీ తరగతి గదులు కనిపిస్తాయి. కేవలం 55 నెలల కాలంలో మీ బిడ్డ పరిపాలనలో మాత్రమే చోటుచేసుకున్న మార్పులు ఇవన్నీ.

కుటుంబాలను చీల్చే కుట్రలు!

అలాంటి రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కుటుంబాలను చీల్చే రాజకీయ కుట్రల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మంచి చేయడం, పేదవాడికి అండగా నిలబడటమే మీ బిడ్డకు తెలిసిన రాజకీయం అని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ అబద్ధాలు చెబుతారని, పొత్తులతో మోసపూరితంగా మీ ముందుకు వస్తారని హెచ్చరించారు. అవ్వా తాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంపు సందర్భంగా బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో సీఎం జగన్ మాట్లాడారు.

అడ్డుకునే దిక్కుమాలిన ఆలోచన..

గతంలో ఒకాయన సీఎంగా ఉన్నాడు. ఆయనకో దత్తపుత్రుడూ ఉన్నాడు. ఆ దత్తపుత్రుడు, దత్త తండ్రి ఇద్దరూ కలిసి 2014 ఎన్నికలప్పుడు ప్రతి పేదవాడికీ 3 సెంట్ల స్థలం, ఇల్లు కట్టిస్తామని వాగ్దానం చేసి చివరికి ఒక్క సెంటు కూడా ఇచ్చిన పాపాన పోలేదు. అక్కచెల్లెమ్మలను, పేదవాళ్లను అడ్డగోలుగా మోసం చేస్తే ఈ దత్తపుత్రుడు ఏ ఒక్క రోజూ ప్రశ్నించకపోగా కేంద్రానికి ఒక లేఖ కూడా రాయలేదు. ఇవాళ మీ బిడ్డ 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చి 22 లక్షల ఇళ్లను కడుతూ అక్కచెల్లెమ్మల ముఖాల్లో సంతోషం చూడాలని కోరుకుంటుంటే ఈ దత్తపుత్రుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తాడు. పేదల కోసం కట్టే ఇళ్లలో, ఇంటి స్థలాల్లో అవినీతి జరిగిందంటూ ఆ కార్యక్రమాన్ని ఆపించాలనే దిక్కుమాలిన ఆలోచన చేయగలిగిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఈ అన్యాయస్తులు మాత్రమే!

ఆ అవినీతిలో.. పార్టనర్

చంద్రబాబు అవినీతిపరుడని సాక్షాత్తూ కేంద్ర ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఈడీ సమన్లు ఇచ్చాయి. కోర్టులు కూడా నిర్ధారించి అన్నీ పరిగణలోకి తీసుకుని ఆయన్ను జైల్లో పెడితే ఈ దత్తపుత్రుడు వెళ్లి దత్తతండ్రిని పరామర్శిస్తాడు. అంత అవినీతిపరుడు ప్రపంచంలో ఎక్కడా లేకపోయినా ఆ పెద్దమనిషి చాలా మంచోడని ఈయన సర్టిఫికెట్ ఇస్తాడు. అక్కడేమో అవినీతి జరిగినా మాట్లాడడు. ఇక్కడేమో అవినీతి జరగకపోయినా మన ప్రభుత్వంపై అభాండాలు వేస్తాడు. చంద్రబాబు అవినీతి చేసినా ఎందుకు నోరు మెదపడంటే.. ఆ అవినీతిలో ఈయన కూడా పార్టనర్ కాబట్టి! దీనిపై ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్తపుత్రుడు ప్రశ్నించరు, మాట్లాడరు.

బాబు ఎందుకు చేయలేదు?.. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు?

గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు నొక్కిన బటన్లు ఎన్ని? ఉత్త సున్నా! ఇవాళ మీ బిడ్డ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ పెన్షన్, ఇతర పథకాలు అందిస్తూ నేరుగా బటన్ నొక్కుతున్నాడు. నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయి. ఇంతవరకూ రూ.2.46 లక్షల కోట్లు నేరుగా జమ అయ్యాయి. ఎక్కడా లంచాలు లేవు. వివక్ష లేదు. మీ బిడ్డ ఎలా చేయగలిగాడు? చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడో ఆలోచించాలి. అప్పుడూ ఇప్పుడూ అదే రాష్ట్రం, అదే బడ్జెట్. చంద్రబాబు పాలనలో కన్నా మీ బిడ్డ ప్రభుత్వంలో అప్పుల గ్రోత్ రేటు తక్కువ. కేవలం మారిందల్లా ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న వ్యక్తి మాత్రమే. అప్పట్లో ఈ బటన్లు నొక్కే కార్యక్రమం ఎందుకు జరగలేదు? ఎందుకు రూ.2.46 లక్షల కోట్లు ఇవ్వలేకపోయారు? అప్పట్లో దోచుకోవడం, దోచుకున్నది పంచుకున్నది తప్ప పాలన జరగలేదు. అప్పట్లో ఒక గొప్ప గజదొంగల ముఠా పాలన చేసేది. అప్పట్లో డీపీటీ (దోచుకో, పంచుకో, తినుకో) జరిగితే మీ బిడ్డ హయాంలో డీబీటీ జరుగుతోంది.

ఎలా ముందుకెళ్దాం..

- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కదలాలి
- బీఆర్ఎస్ నేతలు, శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం
- ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం
- ముఖ్య నేతల నుంచి అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, ఆదిలాబాద్: 'శాసనసభ ఎన్నికల్లో మన నుంచి ఏం తప్పు జరిగింది.. పార్లమెంట్ ఎన్నికలకు ఎలా ముందుకెళ్దాం.. గెలుపునకు ఎలాంటి వ్యూహం అనుసరిద్దాం..' అంటూ ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతల నుంచి కేటీఆర్ అభిప్రాయ సేకరణ చేశారు. వారు తమ సూచనలు, సలహాలు అందజేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సెక్రెటరి జనరల్ కేశవ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, మాజీ ఎంపీలు వేణుగోపాల్‌చారి, గొడం నగేష్, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, నియోజకవర్గ నేతలు భుక్యా జాన్సన్ నాయక్, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

అభిప్రాయ సేకరణ..

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్లాలనే విషయంలో ముఖ్య నేతల నుంచి కేటీఆర్ అభిప్రాయ సేకరణ చేశారు. ఒకరొకరు వారి అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ రాకముందే కాంగ్రెస్ ఎన్నికల హామీలు నెరవేర్చేలా ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసిందని పేర్కొన్నారు. గెలుపే లక్ష్యంగా ఈ లోక్‌సభ పరిధిలోని శాసనసభ నియోజకవర్గాల్లో అందరు కష్టపడాలన్నారు. ప్రధానంగా శాసనసభ ఎన్నికల్లో మొత్తం లోక్‌సభ పరిధిలో మనమే అత్యధిక ఓట్లు సాధించిన దృష్ట్యా శ్రేణులు సమన్వయంగా కృషి చేస్తే ఇక్కడ గెలుపు సాధించడం సులువవుతుందని పేర్కొన్నారు.

వ్యూహరచన..

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో తిరిగి విజయం సాధించాలని బీఆర్ఎస్ వ్యూహం రచిస్తోంది. ఇందులో భాగంగానే ఈ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలతో సన్నాహక సమావేశాన్ని అధిష్టానం నిర్వహించింది. మళ్లీ పాగ వేసేందుకు ఎలా ముందుకెళ్లాలనే విషయంలో సమాలోచనలు చేస్తోంది. 2014లో బీఆర్ఎస్ నుంచి గొడం నగేశ్ ఎంపీగా గెలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 2004 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి విజయం సాధించారు. ప్రధానంగా బీఆర్ఎస్‌కు ఓటు బ్యాంక్ ఉన్న దృష్ట్యా ఈ స్థానాన్ని మరోసారి గెలవాలనే లక్ష్యంగా ముందుకు కదులుతోంది.



పాల్గొన్న బీఆర్ఎస్ ముఖ్య నేతలు

ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ దూరం..

బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి ముఖ్య ప్రజాప్రతినిధులందరు హాజరు కావాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. అయితే ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

పెంచిన సాయంతో ప్రయోజనం

- దళిత న్యాయవాదుల శిక్షణకు సాయం రెట్టింపు

కరీంనగర్: సీనియర్ లాయర్ల వద్ద శిక్షణ పొందే దళిత లా పట్టభద్రులకు 2023– 24 ఆర్థిక సంవత్సరంలో చెల్లించే స్కాలర్‌షిప్, గ్రాంట్‌ను పెంచుతూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేయడంతో జూనియర్ న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పెంచిన ఆర్థికసాయంతో మూడేళ్ల శిక్షణను సులభంగా పూర్తిచేస్తామని అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ పొందుతున్న వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్ల వద్ద శిక్షణ తప్పనిసరి..

లా కోర్సు పూర్తి, కేసుల వాదన, పత్రాల సిద్ధం, పేషీలు, తీర్పు.. ఇలా ప్రతీ అంశం గురించి తెలుసుకోవడం న్యాయవాద వృత్తిలో భాగం.

- ఇవన్నీ సీనియర్ న్యాయవాదుల వద్ద శిక్షణ పొందితేనే అవగాహన వస్తుంది.
- వాదనలో పట్టు సాధించడానికి అవకాశం కలుగుతుంది.
- అయితే, శిక్షణ పొందడం ఖర్చుతో కూడుకున్నది.
- అందుకే దళిత న్యాయవాదులకు ప్రభుత్వం ఉపకారవేతనం, గ్రాంట్ అందిస్తోంది.

పెరిగిన 'సాయం'

న్యాయవాది వృత్తిలోకి అడుగుపెట్టే జూనియర్లు.. సీనియర్ లాయర్ల వద్ద శిక్షణ తీసుకోవడం ఖర్చుతో కూడుకున్నది. పుస్తకాలు, నల్లకోటు, కంప్యూటర్ తదితర వస్తు, సామగ్రి కొనుగోలు చేయాలి. గతేడాది వరకు ప్రభుత్వం ప్రతినెలా రూ.వెయ్యి చొప్పున 36 నెలల పాటు స్టైఫండ్ అందించేది. వన్‌టైం గ్రాంట్ కింద రూ.6 వేలు చెల్లించేది. అయితే, ఉపకారవేతనం రూ.వెయ్యి నుంచి రూ. రూ.3 వేలు, వన్‌టైం గ్రాంట్‌ను రూ.50వేలకు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. అంతే కాదు.. బార్ కౌన్సిల్ నిర్ణయించిన రూ.585 అడ్మిషన్ ఫీజును సైతం షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ చెల్లించేలా ఆదేశాలు ఇచ్చింది.


ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం..

ఉపకార వేతనం, గ్రాంట్ కోసం జిల్లావ్యాప్తంగా 11 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయవాదులు అర్హులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సీనియర్ల వద్ద శిక్షణ పొందేందుకు కలెక్టరేట్ రోడ్డులోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. కమిటీలో జిల్లా జడ్జి, ఎస్సీ వెల్ఫేర్ డీడీ సభ్యులుగా ఉంటారు. మూడు సంవత్సరాల సర్వీసు పైబడిన జూనియర్ న్యాయవాదులను సీనియార్టీ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారి ఖాతాల్లో ట్రెజరీ ద్వారా డబ్బులు జమచేస్తారు.



కరీంనగర్ న్యాయస్థాన భవన సముదాయం

మంచి అవకాశం



షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయవాద కోర్సు పూర్తిచేసిన వారు ఉపకారవేతనాలు, గ్రాంట్‌కు అర్హులు. సీనియర్ లా అధికారి వద్ద శిక్షణ పొందే వారికే ఈ సాయం అందిస్తాం. ఎస్సీ వెల్ఫేర్ జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. కమిటీ పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తుంది. ఇది మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోండి.

– నేతానియల్,జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి, కరీంనగర్

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ



ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న వీసీ వెంకటరమణ

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న 1200మంది విద్యార్థులకు వీసీ ప్రొఫెసర్ వెంకట రమణ బుధవారం నూతన ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతికంగా ఎదిగేందుకు ల్యాప్‌టాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. రాబోయే రోజుల్లో బాసర ట్రిపుల్‌ఐటీని ఉత్తమ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయిలో పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రతీ సమస్య పరిష్కరించేందుకు తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని చెప్పారు.

ట్రిపుల్‌ఐటీని సందర్శించిన కలెక్టర్

- అధికారులతో కలిసి సమావేశం
- శాఖల పనితీరు, సమస్యలపై ఆరా

భైంసా: ఈ నెల 2వ తేదీన సాక్షిలో ప్రచురించిన 'ట్రిపుల్ ట్రబుల్స్ తీరేనా' శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందన లభించింది. బుధవారం కలెక్టర్ ఆశిశ్‌సంగ్వాన్ ఆర్జీయూకేటీ క్యాంపస్‌ను సందర్శించారు. వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్, ఆయాశాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆయా శాఖల పనితీరు, సమస్యల పరిష్కారం, భవిష్యత్ ప్రణాళికపై చర్చించారు. నూతన భోజనశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వాటర్‌స్టోరేజీ ప్రాంతాన్ని పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై ఆరాతీశారు. గంటకుపైగా ట్రిపుల్‌ఐటీలో అధికారులతో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విద్యార్థుల తరగతి గదులు, ఇతర గదులు పరిశీలించారు.



బాసర ట్రిపుల్‌ఐటీని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

సమస్యల పరిష్కారంపై ఆశలు

- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాలకు మోక్షం
- కొత్త సీఎండీ నియామకంపై కార్మికుల్లో సంతోషం

గోదావరిఖని: మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)గా బలరాంనాయక్ బాధ్యతలు స్వీకరించడంతో ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సంస్థ అదనపు సీ అండ్ ఎండీగా బుధవారం బాధ్యతలు స్వీకరించడంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. గతంలో ఫైనాన్స్, ప్రాజెక్టు అండ్ ప్లానింగ్, పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ వింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన బలరాం నాయక్‌కు సంస్థపై పట్టు అధికంగా ఉంది. కార్మిక సంఘాలతో కలుపుగోలుగా ముందుకు సాగడం, సమ్మె నోటీసు ఇచ్చిన కీలకసమయాల్లో ట్రబుల్ షూటర్‌గా వ్యవహరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. సీఎండీగా శ్రీధర్ వ్యవహరించినా.. కార్మిక సంఘాలు, అధికారులు, ప్రభుత్వంతో అనుసంధానంగా వ్యవహరిస్తూ అనేక సమస్యలు పరిష్కరించడంలో బలరాంనాయక్ కీలకంగా వ్యవహరించారు. ఈక్రమంలో సీఅండ్ఎండీగా బలరాం బాధ్యతలు స్వీకరించడంతో కార్మిక సంఘాల నేతలు, కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బలరాం

పర్యావరణ ప్రేమికుడిగా రికార్డు

పర్యావరణ ప్రేమికుడిగా సింగరేణి ఆధ్వర్యంలో సొంతంగా మొక్కలు నాటించి రికార్డు నెలకొల్పారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఓబీ డంప్‌యార్డుపై పార, పలుగు పట్టుకుని మొక్కలు నాటి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అలాగే డైరెక్టర్ ఫైనాన్స్‌గా లాభాల వాటా, వేతన ఒప్పందం బకాయిలను ఉద్యోగులకు చెల్లించడంలో కీలకంగా వ్యవహరించారు.

సంక్షేమానికి పెద్దపీట

కొత్త గనులు ప్రారంభించడంతోపాటు థర్మల్, సోలార్ విద్యుత్ ప్లాంట్లను విస్తరిస్తాం. ప్రభుత్వ దిశానిర్దేశం మేరకు కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేస్తాం. రక్షణపూ మరింత శ్రద్ధ వహిస్తాం. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యం సాధిస్తాం. సంస్థ అభివృద్ధితోపాటు సమీప గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాం. ఉద్యోగ ఖాళీలను గుర్తించి వెంటనే భర్తీ చేస్తాం.

– బలరాం, సింగరేణి సీఎండీ

బ్యూటిప్స్



- జుట్టు కుదుళ్లు బలంగా ఉండాలంటే... ఒక పాత్రలో టీ స్పూన్ తేనె, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, ఒక టీ స్పూన్ నిమ్మరసం, కోడిగుడ్డు సొన ఒకదాని తరువాత ఒకటి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కుదుళ్ల దగ్గర నుండి చివరి వరకూ పట్టించి ఇరవై నిమిషాలుంచి కడిగేయాలి.
- వారంలో ఒక్కసారయినా టీ డికాషన్‌తో జుట్టును కడిగితే సిల్కీగా అవుతుంది.
- తలంటుకునే ముందు షాంపూలో కొద్దిగా వెనిగర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని కురులంతటికీ పట్టించి పది నిమిషాల తరువాత తలస్నానం చేస్తే జుట్టు మెరుస్తుంది.

వికాసం

చీకటి వెలుగుల దారుల్లో...



తనూజకు జాడ చూపిన డాక్యుమెంటరీ: ఆంటీ సుధ ఆంటీ రాధ

కథలు ఆకాశం నుంచి నేలకు దిగి రావు. ఈ నేలలో అనేక కథలు దాగున్నాయి. వాటి జాడలు వెదుక్కుంటూ వెళ్లడమే సృజనకారుల పని. బంధువులను వెదుక్కుంటూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలకు వెళ్లిన రైటర్, డైరెక్టర్ తనూజ చంద్ర తనకు తెలియని ఎన్నో విషయాల గురించి తెలుసుకుంది. మహిళలు ఎదుర్కొంటున్న రకరకాల సమస్యలపై డాక్యుమెంటరీలు తీయాలని నిర్ణయించుకుంది...

తనూజ చంద్ర తల్లి కామ్నా చంద్ర రైటర్, సోదరుడు విక్రమ్ చంద్ర రైటర్, సోదరి అనుపమ చోప్రా ఫిల్మ్ క్రిటిక్. రెండు ముక్కల్లో చెప్పుకోవాలంటే ఇంటి నిండా సృజనాత్మక వాతావరణం కొలువై ఉండేది.

టీవీ సిరీస్ జమీన్ ఆస్మాన్(1996)తో డైరెక్టర్‌గా వినోద రంగంలోకి అడుగుపెట్టింది తనూజ. మహేష్‌భట్ 'జఖ్మ్' సినిమాకు స్క్రీన్‌ప్లే రాసి మంచి పేరు తెచ్చుకుంది. సంజయ్ దత్, కాజోల్ జంటగా నటించిన 'దుష్మన్' సినిమాతో బాలీవుడ్‌లో డైరెక్టర్‌గా తొలి అడుగు వేసింది. 'నేను కమర్షియల్ డైరెక్టర్‌ని మాత్రమే' అనే ధోరణిలో కాకుండా మహిళల జీవితానికి సంబంధించిన సమస్త కోణాలను సినిమా, ఓటీటీ మాధ్యమాలపై ఆవిష్కరిస్తోంది తనూజ.

'ఊహల్లో నుంచి మహిళలకు సంబంధించిన కథలను అల్లడం కంటే వారి దగ్గరకు వెళ్లి మాట్లాడితే నిజమైన కథలు వస్తాయి' అంటున్న తనూజ స్క్రిప్ట్ మేకింగ్ కోసం రైటింగ్ రూమ్‌కు మాత్రమే పరిమితం కాలేదు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఎంతోమంది మహిళలతో మాట్లాడింది. ఆ క్రమంలో తనకు ఏదైనా ఆలోచన వస్తే అది స్క్రిప్ట్‌గా రూపొందుతుంది.

వెండితెరపై రాణిస్తున్న వారు షార్ట్ ఫిల్మ్స్‌పై పెద్దగా దృష్టి పెట్టరు. తనూజకు మాత్రం ఎలాంటి పట్టింపులు లేవు. పెద్ద డైరెక్టర్‌గా పేరు వచ్చిన తరువాత కూడా రొమాంటిక్ డ్రామా షార్ట్ ఫిల్మ్ 'సిల్వత్' తీసింది. 'ఏ మాన్‌సూన్ డేట్' అనే షార్ట్ ఫిల్మ్‌కు కూడా విశ్లేషకుల నుంచి ప్రశంసలు లభించాయి. అయిదు సంవత్సరాల క్రితం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్రా అనే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది తనూజ. అక్కడ తనకు ఇద్దరు మేనత్తలు ఉన్నారు. ఇద్దరూ భర్తను కోల్పోయి ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. ఆంటీ రాధ సరదా మనిషి. శాంతస్వభావి. ఎంత పెద్ద కష్టానికైనా అడ్డస్టైపోతుంది. సుధా ఆంటీ మాత్రం రాధ ఆంటీకి పూర్తి భిన్నం. ఒకరకంగా చెప్పాలంటే ఫైర్‌బ్రాండ్. చాలా స్ట్రిక్ట్. పర్‌ఫెక్షన్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. ఎక్కడ తేడా వచ్చినా గొడవకు దిగుతుంది. ఒకరి వయసు 93. మరొకరి వయసు 83. వేరు వేరు ప్రపంచాలకు చెందిన ఇద్దరికీ తమ మనస్తత్వాల మూలంగా ఎప్పుడూ గొడవలు రాలేదు. వీరి జీవితాన్ని గురించి లోతుగా తెలుసుకున్న తరువాత 'ఆంటీ సుధా ఆంటీ రాధ'కు శ్రీకారం చుట్టింది తనూజ. నలభై ఎనిమిది నిమిషాల ఈ డాక్యుమెంటరీలో హాయిగా నవ్వుకునే సన్నివేశాలే కాదు కంట తడి పెట్టించే సన్నివేశాలు కూడా ఉన్నాయి. 'సాధారణ ప్రజలు అనే మాట వింటుంటాం. అయితే వారి జీవితాలలోకి తొంగి చూస్తే అసాధారణ సన్నివేశాలు, సాహసాలు కనిపిస్తాయి' అంటున్న తనూజకు ఇది తొలి డాక్యుమెంటరీ ఫిల్మ్.

గమనాన్ని మార్చింది

బంధువులను వెదుక్కుంటూ ఉత్తర్ ప్రదేశ్‌లోని మారుమూల గ్రామాలకు వెళ్లినప్పుడు సాధారణ జీవితాల్లోని అసాధారణ దృశ్యాలు కనిపించాయి. ఎంతో మంది మహిళలతో మాట్లాడిన తరువాత...మహిళల గురించి ఓటీటీ మాధ్యమం ద్వారా సీరియస్‌గా చెప్పాల్సిన కథలు ఎన్నో ఉన్నాయి అనిపించింది. ఆంటీ సుధా ఆంటీ రాధ నా గమనాన్ని మార్చింది అని చెప్పవచ్చు.

– తనూజ చంద్ర, రైటర్, డైరెక్టర్

కట్ చేస్తే...

'వెడ్డింగ్.కాన్' అనే సరికొత్త డాక్యుమెంటరీ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది తనూజ. పెళ్లి చేసుకుంటానని ఎంతోమంది మహిళలకు మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు కాజేశాడు ప్రజిత్. రకరకాల మారుపేర్లతో మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్ల ద్వారా మోసాలకు పాల్పడేవాడు. మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్...మొదలైన రాష్ట్రాల్లో ఎంతోమంది మహిళలను మోసం చేశాడు.



థానేలోని ధోకాలీ ప్రాంతానికి చెందిన ఒక బాధిత మహిళ ఫిర్యాదు చేయడంతో ప్రజిత్ మోసం వెలుగులోకి వచ్చింది. థానే పోలీసులు ప్రజిత్‌ను అరెస్ట్ చేశారు. 'వెడ్డింగ్.కాన్' డాక్యుమెంటరీ ప్రజిత్‌లాంటి ఎంతోమంది మోసగాళ్ల మోసాలకు అద్దం పడుతుంది.

'మ్యాట్రిమోనియల్ మోసాల ద్వారా నష్టపోయిన మహిళలు ఎందరో ఉన్నారు. అయితే చాలామంది పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడానికి ఇష్టపడడం లేదు. దీనికి కారణం తాము తప్పు చేశాం అనే భావన. నలుగురు నవ్వుతారేమో అనుకోవడం. ఇది నన్ను చాలా బాధ పెట్టింది' అంటుంది తనూజ చంద్ర.

అయితే 'వెడ్డింగ్.కాన్' బాధిత మహిళలకు ధైర్యాన్ని ఇస్తుంది, న్యాయం కోసం పోరాటం చేసే స్ఫూర్తిని అందిస్తుంది అనడంలో సందేహం లేదు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

ఒడ్డును.. ఒడ్డున పడేస్తారు

మొన్న జనవరి 1 వేడుకలు. లక్షలాది మంది ముంబై బీచుల్లో చేరి ఎంజాయ్ చేశారు. మంచిదే. లెక్కలేనంత చెత్త పారబోశారు. అందమైన సాగర తీరాలను శుభ్రంగా ఉంచాలన్న స్పృహ మనకు ఎప్పుడూ లేదు. అందుకే ముంబైలోని 'చేంజ్ ఈజ్ అజ్' సంస్థలోని టీనేజ్ పిల్లలే ఈ క్లీనింగ్‌కి పూనుకున్నారు. బుద్ధులు వినాల్సిన పిల్లలే పెద్దలకు బుద్ధులు చెబుతున్నారు. విందామా వారి మాట?





ముంబై బీచ్‌లను క్లీన్ చేస్తున్న 'చేంజ్ ఈజ్ అజ్' వాలంటీర్లు

మనిషి బావిని, చెరువును తవ్వించగలడు. సముద్రాన్ని కాదు. ఒక ప్రాంతంలో సముద్రం ఉందంటే అది ప్రకృతి ఆ ప్రాంతానికి ఇచ్చిన వరం. ఎన్ని చికాకులున్నా, ఎన్ని బాధలున్నా, ఎంత బిజీగా ఉన్నా, ఎంతో సంతోషంగా అనిపించినా అలా బీచ్‌కు వెళితే, సముద్రం ఒడ్డున కూచుంటే, అలల ఘోషను వింటూ, ఆ నమతల అగాధపు గాంభీర్యాన్ని కంటూ, ఎగిరే పక్షుల వల్ల, తిరిగే పడవల వల్ల, వీచే గాలుల వల్ల ఓదార్పు పొందడం ఎంత బాగుంటుంది!

కాని ఆ భావాలన్నీ పేరుకున్న చెత్త వల్ల నాశనమైతే?

మన దేశంలో పేద, మధ్యతరగతి వారికి ఖర్చులేని కాలక్షేపం బీచ్. దానికి కూడా వెళ్లలేనంతగా వాటిని గలీజ్ చేస్తే? అలా చేసేంత దుర్గుణం మనుషులకే ఉంది. దానికి జవాబు యువత దగ్గర ఉంది.

ఛేంజ్ ఈజ్ అజ్

ముంబైలో ఎంతలేదన్నా డజన్ అందమైన బీచ్‌లు ఉన్నాయి. అతి చిన్న ఇరుకు ఇళ్లలో జీవించే ముంబై జీవులు బీచ్‌లకు వచ్చే ఊపిరి పీల్చుకుంటారు. 75 ఏళ్ల కుంతీ ఓజా అనే మహిళ మూడు నాలుగేళ్ల క్రితం సోషల్ మీడియాలో 'చిన్నప్పటి నుంచి చౌపాటి బీచ్‌కు వచ్చి ఆహ్లాదం పొందేదాన్ని. పసుపు రంగు ఇసుక చూడటం, చిరుతిళ్లు తినడం భలే ఉండేది. కాని ఇప్పుడు బీచ్ మొత్తం చెత్త. మా చిన్నప్పుడు మిగిలిన తిండి పారేసేవారు. ఇప్పుడు మొత్తం ప్లాస్టిక్ చెత్తను పారేస్తున్నారు' అని రాసింది. ఆమె గోడు విన్నట్టుగా ఆ సమయంలోనే సీనియర్ ఇంటర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అక్షత్ షా, శుభ్ మెహతా పర్యావరణ విధ్వంసం గురించి స్కూల్లో, బయట వింటున్న వార్తలతో ప్రభావితం అయ్యారు. అప్పుడే అమెజాన్ అడవులు తగలబడటం వారిని కలిచి వేసింది. 'మన వంతుగా ఏదో ఒకటి చేద్దాం' అని సోషల్ మీడియా వేదికగా 'ఛేంజ్ ఈజ్ అజ్' గ్రూప్‌ను ప్రారంభించి ముంబైలోని బీచ్‌ల క్లీనింగ్‌కి నడుం కట్టారు.

జూలై 2019న మొదటిసారి

అక్షత్ షా, శుభ్ మెహతా జూలై, 2019లో మొదటిసారి చౌపాటి బీచ్‌ను క్లీన్ చేయడానికి సోషల్ మీడియాలో పిలుపునిచ్చినప్పుడు కేవలం 18 మంది టీనేజ్ విద్యార్థులు హాజరయ్యారు. వారంతా కలిసి బీచ్‌ను క్లీన్ చేయడం జనం వింతగా చూశారు. కాని మంచి పనికి కొత్త తరం అండ తప్పక లభిస్తుంది. క్రమం తప్పకుండా బీచ్‌లను క్లీన్ చేయడం, ఫొటోలను ప్రచారంలో పెట్టడంతో హైస్కూల్, కాలేజీ స్థాయి పిల్లలు స్పందించడం మొదలెట్టారు. తల్లిదండ్రులు కూడా ఈ మంచి పనికి అడ్డు చెప్పలేదు. 'ఇప్పటి వరకూ మేము ముంబై బీచ్‌ల నుంచి 480 టన్నుల చెత్త పారబోశాం' అంటారు అక్షత్ షా, శుభ్. ప్రస్తుతం అక్షత్ ముంబైలోనే ఉంటూ చదువుకుంటుంటే శుభ్ యూకేలో చదువుకుంటూ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నాడు.

పాతిక వేలమంది వాలంటీర్లు

'ఛేంజ్ ఈజ్ అజ్' గ్రూప్ ఎంత సక్సెస్ అయ్యిందంటే ముంబై మొత్తం నుంచి 25,200 మంది విద్యార్థినీ విద్యార్థులు ఇందులో వాలంటీర్లుగా చేరారు. బీచ్‌ల శుభ్రత గురించి ఛేంజ్ ఈజ్ అజ్ సభ్యులు స్కూళ్లు, కాలేజీలకు తిరిగి ప్రచారం చేయడం వల్ల కూడా ఈ చేరిక సాధ్యమైంది. వీరంతా తమకు వీలున్నప్పుడల్లా ముంబైలోని బీచ్‌లను శుభ్రం చేస్తుంటారు. ముఖ్యంగా పండగలప్పుడు, డిసెంబర్ 31 వంటి సందర్భాల్లో వీరి పని ఎక్కువగా ఉంటుంది.

మన దేశంలో బీచ్‌లు టూరిస్ట్ అట్రాక్షన్ కూడా. పట్టణ, నగర సంస్థలు బీచ్‌ల శుభ్రత కోసం ఎంతోకొంత నిధులు వెచ్చిస్తున్నా నిరంతర అలల్లాగే నిరంతరం చెత్త పడుతూనే ఉంటుంది. అందుకే ఇటు బంగాళాఖాతం, అటు అరేబియా సముద్రం... తీరాల పొడవునా బీచ్‌లను శుభ్రం చేయడానికి విద్యార్థినీ విద్యార్థులు నడుం బిగించాలి. వారు కదిలితే పెద్దలూ కదులుతారు.

ముగ్గు–ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



వంజారి రోహిణి
హైదరాబాద్


21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చేవరకు





పంట వసుంధర
కుంఫిణీపురం,
నందలూరు,
అన్నమయ్య జిల్లా

21 చుక్కలు, సరి చుక్క,
5 వరుసలు, 5 వచ్చేవరకు





కబడ్డీ.. కబడ్డీ... గెలిచింది

- నాగపూర్ నుంచి జకార్తా దాకా... • కోచ్ శైలజ విజయ ప్రస్థానం

40 ఏళ్ల క్రితం సమాజం ఛీత్కారాల మధ్య కబడ్డీ ఆటను ఎంచుకుంది. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. వివక్షలను ఎదుర్కొంది. అవార్డులను గెలుచుకుంది. వందలాది అమ్మాయిలను చాంపియన్లుగా మలిచి అంతర్జాతీయ కబడ్డీ కోచ్‌గా పేరొందింది మహారాష్ట్రలోని నాసిక్ వాసి శైలజా జైన్. ఆటుపోట్ల మధ్య ధైర్యంగా ఎంచుకున్న మార్గం గురించి ఎన్నో విషయాలను పంచుకుంటుంది.



శైలజా జైన్

''నా చిన్నతనం అంతా నాగపూర్‌లో గడిచింది. అమ్మ టీచర్, నాన్న బ్యాంకు ఆఫీసర్. అమ్మకు క్రీడలంటే చాలా ఇష్టం. ఆ రోజుల్లోనే చీర కట్టుకుని కబడ్డీ ఆడేది. నేను కూడా ఆమె నుండి ఈ గుణాన్ని వారసత్వంగా పొందాను. అమ్మానాన్నలకు నాతో కలిపి నలుగురం ఆడపిల్లలం సంతానం. కానీ, నేనే క్రీడాకారిణి అయ్యాను. స్కూల్లో జరిగే క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ.. ప్రతి పోటీలో పాల్గొనేదానిని. ఒక నెల రోజులు ఇంటికి దూరంగా క్రికెట్ క్యాంపులో చేరడానికి వెళ్లాను. ఈ రోజుల్లో ఎలాంటి అడ్డంకులు లేవు కానీ, యాభై ఏళ్ల క్రితం అంటే ఆడపిల్లలు ఆడుకోవడం అంత సులువు కాదు.

హాఫ్ ప్యాంట్

'అమ్మాయి ఎదిగింది. హాఫ్ ప్యాంట్ వేసుకొని మగపిల్లల్లా ఆడుకోవడానికి బయటకు వెళుతోంది చూడు' అని స్థానికులు చెప్పుకునేవారు. కానీ, మా అమ్మానాన్నలు ఎప్పుడూ అలాంటి మాటలు పట్టించుకోలేదు. నాకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడమే కాదు, సపోర్ట్‌గా నిలిచారు. కబడ్డీ క్లబ్‌లో చేరడంతో నా జీవితమే మారిపోయింది.

మొదటి మార్పు

నాగపూర్‌లోనే మరాఠా లాన్సర్స్ పేరుతో కబడ్డీ క్లబ్ ఉండేది. అక్కడి కోచ్ నా స్నేహితుల్లో ఒకరిని ప్రాక్టీస్‌కు పిలిచారు. నన్ను పిలవలేదు. ఆ రోజు చాలా ఏడ్చాను. నాకు అవకాశం రాదనుకున్నాను. కానీ నేరుగా క్లబ్‌కి వెళ్లి, కోచ్‌తో నాకూ ఆడాలని ఉందని చెప్పాను. వారి అనుమతితో క్లబ్‌లో చేరిపోయాను. అటు నుంచి మిగతా క్రీడలను వదిలేసి కబడ్డీపైనే దృష్టి పెట్టాను. గ్రౌండ్‌కు చేరుకోవడంలో నేనే ముందుండేదానిని. వేరే వాళ్లు రాకముందే గ్రౌండ్ ఊడ్చటం, నీళ్లు చల్లడం, మార్కింగ్ చేయడం మొదలైన పనులన్నీ చేసేదాన్ని. గ్రౌండ్‌లోనే నా భవిష్యత్తు ఉందని బలంగా నమ్మేదాన్ని. అందుకే, తక్కువ డబ్బు వచ్చినా గ్రౌండ్‌ను వదలలేదు.

చీకటి దారుల గుండా..

ఇంటికి గ్రౌండ్‌కి మధ్య 12 కి.మీ దూరం. అందుకే ఇంట్లో సైకిల్ కావాలని పట్టుబట్టాను. సైకిల్‌పై కాలేజీకి, ప్రాక్టీస్ కోసం క్లబ్‌కు వెళ్లేదాన్ని. దీని కోసం నాగ్‌పూర్‌లోని సివిల్ లైన్ ఏరియాను దాటాల్సి వచ్చేది. సాయంత్రం 5 గంటల నుంచే సివిల్ లైన్స్ మొత్తం నిర్మానుష్యంగా మారేవి. కానీ, నేను 8 గంటలకు చీకట్లో అదే మార్గంలో సైకిల్‌పై ఇంటికి వచ్చేదాన్ని. ఎప్పుడూ భయం అనిపించలేదు. ఎవరైనా వేధించినప్పుడు నడిరోడ్డుపై కొట్టి గుణపాఠం చెప్పేదాన్ని.

చిన్న చిన్న అవార్డులైనా...

యూనివర్శిటీ, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాను. చిన్న చిన్న అవార్డులు వచ్చినా గర్వంగా ఫీలయ్యేదాన్ని. నాకు నేనే అత్యుత్తమ ప్లేయర్‌ననే విశ్వాసం పెరుగుతుండేది. పెళ్లయ్యే వరకు అదే మైదానంలో రోజూ ప్రాక్టీస్ చేసేదాన్ని. పెళ్లి తర్వాత నాసిక్‌కు వచ్చాను. అప్పటికే చదువు పూర్తయింది కాబట్టి ఉద్యోగం వేటలో ఉన్నాను. ఆ సమయంలో రాష్ట్ర కోచ్‌ని కలిశాను. కోచ్ అవడానికి 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్' నుంచి కోర్సు చేయాలని సలహా ఇచ్చారు. బెంగళూరు వెళ్లి కోర్సు పూర్తి చేశాను. అక్కడి నుంచి తిరిగొచ్చాక క్రీడా విభాగంలో కోచ్ ఉద్యోగం వచ్చింది.

పాఠశాల స్థాయి నుంచి...

కబడ్డీ, ఖోఖో ఆటలకు నేనే కోచ్‌ని. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను సిద్ధం చేయడం ప్రారంభించాను. నా శిక్షణలో అమ్మాయిలు అవార్డులు గెలుచుకోవడం చూసి నాలో ధైర్యం కూడా పెరుగుతూ వచ్చింది. శిక్షణ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. అందుకు మా అత్తింటివారు ఎలాంటి అడ్డు చెప్పలేదు. స్పోర్ట్స్ ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చినప్పుడు ఆరు నెలల్లోనే దానిని తిరిగి ఇచ్చేశాను. ప్రమోషన్ తీసుకోకపోతే భవిష్యత్తులో చాలా నష్టపోతారని చెప్పారు. కానీ, ప్రమోషన్ పేరుతో ఆఫీసులో కూర్చొని ఉండటం నా వల్ల అయ్యే పని కాదు.

డిప్రెషన్‌ను అధిగమించి..

నా దగ్గర శిక్షణ తీసుకున్న 400 మంది అమ్మాయిలకు జాతీయ స్థాయిలో ఆడే అవకాశం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్నాను. రికార్డ్ ఉన్నప్పటికీ టీమ్ ఇండియా టీ షర్ట్ ధరించే అవకాశం రాలేదు. అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఎంపికైనా అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి అడుగడుగునా అవరోధాలు. దీంతో డిప్రెషన్‌కు గురయ్యాను. కొన్నాళ్లు ఏం చేయాలో అర్థం కాని స్థితి. 2008లో జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో కోచ్‌గా అవకాశం వచ్చింది. ఫలితాలు బాగుండటంతో ఆ తర్వాత అంతర్జాతీయ జట్టుకు కోచ్‌గా వెళ్తానని అందరికీ చెప్పాను. నా కల నెరవేరుతుందని అనుకున్నాను. కానీ, నా ఆశలు మళ్లీ నేలకు జారాయి. అదే ఏడాది మళ్లీ ప్రమోషన్ వచ్చింది. 2014 వరకు అదే జాబ్‌లో కొనసాగి రిటైరయ్యాను. అసంతృప్తి అలాగే ఉండిపోయింది.



జకార్తా ఆసియా క్రీడల్లో... ఇరాన్ జట్టుతో...

అంతర్జాతీయంగా అవకాశాలు...

రిటైరయ్యాక ఇరాన్ నుండి బాలికల జట్టుకు కోచ్‌గా ఉండమని ఆహ్వానం అందింది. మా ఇంట్లోవాళ్లు ఆ దేశంలో ఉండటం సులభం కాదన్నారు. ఒకసారి పాస్‌పోర్ట్‌పై ఇరాన్ ముద్ర పడితే ఇక అంతే అన్నారు. కానీ, అవేవీ పట్టించుకోకుండా వెళ్లాను. అలా మొదలైన నా ప్రయాణం రెండేళ్లకు జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల వరకు వెళ్లింది. అక్కడి అలవాట్లు, తిండి, భాష, వేషధారణ అన్నీ మనకు భిన్నమైనవే. అయినా లభించిన అవకాశాన్ని బంగారంగా మార్చుకునే ధైర్యాన్ని పెంచుకున్నాను. నేను జైన్ కమ్యూనిటీకి చెందినదానిని, మాంసాహారం తినలేను. ఇరాన్‌లో శాకాహారం దొరకడం చాలా కష్టం. కోచ్‌గా ఉంటూ నాన్‌వెజ్ తినకుండా ఉండటం ఎలా సాధ్యం అని అక్కడివాళ్లు ఆశ్చర్యపోయేవారు. భారతదేశానికి వచ్చినప్పుడు నా ఆహారానికి కావల్సిన పదార్థాలను తీసుకెళ్లేదాన్ని. కానీ, ఆహారం గురించి పై అధికారులకు ఎప్పుడూ కంప్లైంట్ చేయలేదు. రాని భాషలు నేర్చుకున్నాను. టీమ్‌తో అనుబంధాలను పెంచుకున్నాను. ఏడాదిన్నరలో 14 క్యాంపులు నిర్వహించాను.

జకార్తా నుంచి భారత్‌కు

జకార్తా ఆసియా క్రీడల్లో నా జట్టు సెమీఫైనల్స్‌కు చేరుకొని భారత జట్టుతో ఫైనల్స్‌కు ఎంపికయ్యింది. ఆ మ్యాచ్‌లో నేను చాలా ఒత్తిడికి గురయ్యాను. నా దేశానికి ప్రత్యర్థిగా నేనే ఉన్నాను... దీంతో తిండి, నిద్రకు దూరమయ్యాను. కానీ, నా బాధ్యత గుర్తుకొచ్చింది. నా జట్టు అమ్మాయిలను ప్రోత్సహించాను. నేను చెప్పిన ట్రిక్కులు పాటించి, గెలుపొందారు. స్వర్ణం గెలిచిన తర్వాత అమ్మాయిలు గ్రౌండ్‌లో ఉత్సాహంగా జెండాతో పరుగులు ప్రారంభించారు. నా చేయి పట్టుకుని 'మేడమ్ రండీ.. మీ వల్లే మాకు బంగారు పతకం వచ్చింది..' అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కానీ, వారితో 'నా కాంట్రాక్ట్ మిమ్మల్ని ఫైనల్ మ్యాచ్ వరకే, అది పూర్తయిపోయింది. నా భారత ఆటగాళ్లు బాధపడుతుంటే, నేను సంబరాలు చేసుకోలేను' అని చెప్పాను. తొలిసారి భారత్ ఓడిపోయి ఇరాన్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఆ చరిత్రలో నా పేరు కూడా నమోదయ్యింది.

స్వదేశానికి...

'నా దేశాన్ని గెలిపించుకోవాలే కానీ, పరాయి దేశాన్ని కాదు' అనే ఆలోచనతో తిరిగి నాసిక్ వచ్చేశాను. ఇక్కడ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో నివసిస్తున్న గిరిజన బాలికలకు కబడ్డీలో శిక్షణ ఇస్తున్నాను. వారిని నా అకాడమీకి తీసుకువచ్చి డైట్ కిట్స్ ఇస్తుంటాను. ఇందుకు వనవాసి కళ్యాణ్ ఆశ్రమం నుంచి సహాయం అందుతుంది. గిరిజన బాలికలు క్రీడల్లో చాలా బాగా రాణిస్తున్నారు. దేశానికి మంచి క్రీడాకారిణులు లభించేలా వారిని తీర్చిదిద్దడంలో ఇప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను'' అని వివరించారు శైలజా జైన్.



గిరిజన అమ్మాయిలకు శిక్షణ ఇస్తున్న శైలజా జైన్

సూర్యకుమార్ వరుసగా ఈ ఏడాది రేసులో...



భారత స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ (స్కై) 'ఐసీసీ టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో నిలిచాడు. 33 ఏళ్ల డాషింగ్ బ్యాటర్ 2022లో పొట్టి ఫార్మాట్‌లో ఈ అవార్డును గెలుచుకున్నాడు. గతేడాది కూడా తన ఫామ్‌ను కొనసాగించిన సూర్య 17 ఇన్నింగ్స్‌ల్లోనే 48.86 సగటుతో 733 పరుగులు సాధించాడు. 155.95 స్ట్రయిక్ రేట్ నమోదు చేశాడు. గతేడాది సంబంధించిన అవార్డు రేసులో స్కైతో పాటు సికందర్ రజా (జింబాబ్వే), చాప్‌మన్ (న్యూజిలాండ్), అల్పెష్ రంజాని (ఉగాండ) ఉన్నారు. భారత్ నుంచి యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ 'ఐసీసీ ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' నామినీల్లో ఉన్నారు. మరోవైపు ఆటగాళ్ల ర్యాంకుల్లో సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి మళ్లీ టెస్టుల్లో టాప్-10లోకి దూసుకొచ్చాడు. 2022లో ఐసీసీ టెస్టు బ్యాటర్ల జాబితాలో టాప్-10 నుంచి దిగజారిన కోహ్లి 'బాక్సింగ్ డే' టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో (38, 76) రాణించడం ద్వారా 761 రేటింగ్ పాయింట్లతో తొమ్మిదో ర్యాంకుకు ఎగబాకాడు. భారత్ నుంచి అతనొక్కడే టాప్-10లో కొనసాగుతున్నాడు.

సిరాజ్ 6తో మొదలై 23తో ముగిసె...



సిరాజ్

ఒకే రోజు 23 వికెట్లు... ఎన్ని మలుపులు... ఎన్ని అనూహ్యాలు... భారత్ టాస్ ఓడగానే వెనుకబడిపోయినట్లు అనిపించింది...కానీ మొహమ్మద్ సిరాజ్ అద్భుత బౌలింగ్ ఆటను మార్చేసింది...అతని పదునైన అవుట్‌స్వింగర్లను తట్టుకోలేక దక్షిణాఫ్రికా కుప్పకూలింది... పునరాగమనం తర్వాత అతి తక్కువ స్కోరుకు ఆలౌటైంది...అనంతరం భారత్ వేగంగా పరుగులు సాధించి ముందంజ వేసింది...ఆధిక్యం దాదాపు వందకు చేరింది... కానీ ఇంతలో మరో అద్దంకి ...ఒక్క పరుగు చేయకుండా చివరి 6 వికెట్లు చేజార్చుకొని టీమిండియా కాస్త డీలాపడింది. కానీ రెండో ఇన్నింగ్స్‌లో మళ్లీ మన బౌలింగ్ చెలరేగి ప్రత్యర్థిని ఆత్మరక్షణలోకి నెట్టింది. మొత్తంగా చూస్తే మొదటి రోజు మనదే పైచేయి కాగా... రెండో రోజు సఫారీలను కట్టడి చేస్తే టెస్టు భారత్ ఖాతాలో చేరినట్లే!



ఎల్గర్

తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 55 ఆలౌట్

సిరాజ్‌కు 6 వికెట్లు ● భారత్ 153 ఆలౌట్

● రెండో ఇన్నింగ్స్‌లో సఫారీ టీమ్ 62/3

కేప్‌టౌన్: భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు తొలి రోజు ఆట ఆసక్తికర మలుపులతో సాగి టెస్టు క్రికెట్ మజాను పంచింది. బుధవారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 23.2 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. మొహమ్మద్ సిరాజ్ (6/15) తన అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. అనంతరం భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 34.5 ఓవర్లలో 153 పరుగులకే ఆలౌటైంది. కోహ్లి (46), రోహిత్ (39), శుబ్‌మన్ గిల్ (36) మినహా అంతా విఫలమయ్యారు. జట్టులో ఏడుగురు ఆటగాళ్లు 'సున్నా'కే పరిమితమయ్యాడు. ఆ తర్వాత ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు ఇంకా 36 పరుగులు వెనుకబడి ఉంది.

టపటపా...

మ్యాచ్‌కు ముందు రోజు అంచనా వేసినట్లుగానే ఆరంభంలో పేస్ బౌలర్లకు పిచ్ అద్భుతంగా అనుకూలించడంతో దక్షిణాఫ్రికా బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. సిరాజ్ తన రెండో ఓవర్ రెండో బంతికి మార్క్‌రమ్ (0)ను అవుట్ చేయడంతో సఫారీల పతనం ప్రారంభమైంది. గత మ్యాచ్ స్టార్, కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న ఎల్గర్ (2) కూడా సిరాజ్ బంతికే బౌల్డ్ అయి నిరాశగా వెనుదిరిగాడు. స్టబ్స్ (3)ను వెనక్కి పంపి బుమ్రా కూడా జత కలిశాడు. జోర్జి (2)ని కూడా పెవిలియన్ పంపించిన సిరాజ్, ఆ తర్వాత ఒకే ఓవర్లో బెడింగామ్ (12), జాన్సెన్ (0)ల పని పట్టి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఆ తర్వాతి చివరి 4 వికెట్లు తీసేందుకు భారత్‌కు ఎక్కువ సమయం పట్టలేదు.

అదే వరుస...

యశస్వి జైస్వాల్ (0) ఆరంభంలోనే వెనుదిరిగినా రోహిత్, గిల్ కలిసి చకచకా పరుగులు రాబట్టారు. దాంతో పదో ఓవర్లోనే భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే వీరిద్దరిని తక్కువ వ్యవధిలోనే పెవిలియన్‌కు పంపించిన బర్గర్...శ్రేయస్ (0)ను కూడా అవుట్ చేశాడు. అయితే కోహ్లి చక్కటి షాట్లతో స్కోరును వేగంగా నడిపించాడు. మరో వైపు బాగా ఇబ్బంది పడిన రాహుల్ (8) తాను ఎదుర్కొన్న 22వ బంతికి గానీ తొలి పరుగు తీయలేకపోయాడు. ఒక దశలో స్కోరు 153/4 వద్ద నిలిచింది. అయితే తర్వాతి 11 బంతులు భారత్‌ను బాగా దెబ్బ తీశాయి. ఈ 11 బంతుల్లో ఒక్క పరుగు కూడా తీయకుండా జట్టు 6 వికెట్లు కోల్పోవడంతో అదే స్కోరు వద్ద టీమ్ ఆలౌట్ అయింది.

స్కోరు వివరాలు:

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) యశస్వి (బి) సిరాజ్ 2; ఎల్గర్ (బి) సిరాజ్ 4; జోర్జి (సి) రాహుల్ (బి) సిరాజ్ 2; స్టబ్స్ (సి) రోహిత్ (బి) బుమ్రా 3; బెడింగామ్ (సి) యశస్వి (బి) సిరాజ్ 12; వెరీన్ (సి) గిల్ (బి) సిరాజ్ 15; జాన్సెన్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; మహరాజ్ (సి) బుమ్రా (బి) ముకేశ్ 3; రబాడ (సి) శ్రేయస్ (బి) ముకేశ్ 5; బర్గర్ (సి) యశస్వి (బి) బుమ్రా 4; ఎన్‌గిడి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (23.2 ఓవర్లలో ఆలౌట్)** 55. **వికెట్ల పతనం:** 1-5, 2-8, 3-11, 4-15, 5-34, 6-34, 7-45, 8-46, 9-55, 10-55. **బౌలింగ్:** బుమ్రా 8-1-25-2, సిరాజ్ 9-3-15-6, ప్రసిధ్ 4-1-10-0, ముకేశ్ 2.2-2-0-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (బి) రబడ 0; రోహిత్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 39; గిల్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 36; కోహ్లి (సి) మార్క్‌రమ్ (బి) రబడ 46; శ్రేయస్ (సి) వెరీన్ (బి) బర్గర్ 0; రాహుల్ (సి) వెరీన్ (బి) ఎన్‌గిడి 8; జడేజా (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 0; బుమ్రా (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 0; సిరాజ్ (రనౌట్) 0; ప్రసిధ్ (సి) మార్క్‌రమ్ (బి) రబడ 0; ముకేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (34.5 ఓవర్లలో ఆలౌట్)** 153. **వికెట్ల పతనం:** 1-17, 2-72, 3-105, 4-110, 5-153, 6-153, 7-153, 8-153, 9-153, 10-153. **బౌలింగ్:** రబడ 11.5-2-38-3, ఎన్‌గిడి 6-1-30-3, బర్గర్ 8-2-42-3, జాన్సెన్ 9-2-29-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (నాటౌట్) 36; ఎల్గర్ (సి) కోహ్లి (బి) ముకేశ్ 12; జోర్జి (సి) రాహుల్ (బి) ముకేశ్ 1; స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1; బెడింగ్‌హామ్ (నాటౌట్) 7; మొత్తం (17 ఓవర్లలో 3 వికెట్లకు) 62. **వికెట్ల పతనం:** 1-37, 2-41, 3-45. **బౌలింగ్:** బుమ్రా 6-0-25-1, సిరాజ్ 5-2-11-0, ముకేశ్ 6-2-25-2.

యువ రెజ్లర్ల నిరసన

టోర్నీలు కోల్పోవడంతో అసహనం



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ), సీనియర్ రెజ్లర్ల మధ్య గొడవలతో తమ భవిష్యత్తు నాశనం అవుతోందని యువ రెజ్లర్లు నిరసనకు దిగారు. ఏడాది కాలంగా డబ్ల్యూఎఫ్ఐ వివాదాల్లో కూరుకుపోవడంతో శిబిరాలు, జాతీయ జూనియర్, సబ్-జూనియర్ టోర్నీలు లేక యువ రెజ్లర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. దీనిపై ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీలకు చెందిన సుమారు 300 మంది వర్ధమాన రెజ్లర్లు బస్సుల్లో వచ్చి జంతర్‌మంతర్ వద్ద మూడు గంటల పాటు నిరసన చేపట్టారు. ఒలింపిక్స్ పతక విజేతలు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్, కామన్వెల్త్ చాంపియన్ వినేశ్ ఫొగాట్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఈ ముగ్గురి బారి నుంచి మమ్మల్ని కాపాడండి' అనే బ్యానర్లతో పెద్దఎత్తున నినాదాలతో హోరెత్తించారు. 10 రోజుల్లోగా సమాఖ్యపై నిషేధాన్ని ఎత్తేయాలని, వెంటనే టోర్నీల నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే తాము కూడా అవార్డుల్ని వెనక్కిస్తామని ప్రకటించారు. మరో వైపు దీనిపై అడ్‌హక్ కమిటీ అవసరమైన చర్యలు చేపట్టింది. ఆరు వారాల్లోనే అండర్-15, అండర్-20 కేటగిరీలో జాతీయ చాంపియన్‌షిప్‌లను నిర్వహిస్తామని కమిటీ చైర్మన్ భూపేందర్ సింగ్ బజ్వా తెలిపారు. రెజ్లర్ల కెరీర్‌కు సంబంధించిన వ్యవహారాలను తీవ్రంగా పరిశీలిస్తామని, ఇకపై సమాఖ్య బాధ్యతల్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తామని చెప్పారు. మరోవైపు జరుగుతున్న పరిణామాలపై రియో ఒలింపిక్ మెడలిస్ట్ సాక్షి స్పందించారు. వివాదాస్పద మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ విధేయుడు సంజయ్ సింగ్‌ను అధ్యక్ష స్థానం నుంచి తప్పిస్తే కొత్త కార్యవర్గంతో తమకు ఏ ఇబ్బందీ లేదని ఆమె ప్రకటించింది.

జైపూర్ విజయం

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ ఐదో విజయాన్ని సాధించింది. బుధవారం జరిగిన పోరులో పింక్‌పాంథర్స్ 45-34తో హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో పుణేరి పల్టాన్ 40-31తో యూపీ యోధాస్‌పై గెలిచింది.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	9	8	1	0	41
గుజరాత్ జెయింట్స్	10	6	4	0	34
జైపూర్ పింక్ పాంథర్స్	9	5	2	2	33
దబంగ్ ఢిల్లీ	9	5	3	1	30
పట్నా పైరేట్స్	9	5	4	0	27
యు ముంబా	7	5	2	0	26
హరియాణా స్టీలర్స్	9	5	4	0	26
బెంగళూరు బుల్స్	10	4	6	0	25
బెంగాల్ వారియర్స్	9	3	4	2	22
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	9	2	7	0	13
తెలుగు టైటాన్స్	9	1	8	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

పాకిస్తాన్ 313 ఆలౌట్



జమాల్

సిడ్నీ: పేస్ బౌలర్ ఆమిర్ జమాల్ (97 బంతుల్లో 82; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) బ్యాటింగ్‌లో వీరోచిత పోరాటం చేయడంతో ఆస్ట్రేలియాతో బుధవారం మొదలైన చివరి టెస్టులో పాకిస్తాన్ మెరుగైన స్కోరు చేసింది. పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 77.1 ఓవర్లలో 313 పరుగులకు ఆలౌటైంది. రిజ్వాన్ (103 బంతుల్లో 88; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆగా సల్మాన్ (67 బంతుల్లో 53; 8 ఫోర్లు) రాణించారు. ప్యాట్ కమిన్స్ (5/61) నిప్పులు చెరిగాడు. ఓపెనర్లు షఫీక్ (0), అయూబ్ (0) డకౌట్ కాగా, కెప్టెన్ షాన్ మసూద్ (35; 3 ఫోర్లు), బాబర్ ఆజమ్ (26; 4 ఫోర్లు) కొద్దిగా పోరాడారు. ఒక దశలో స్కోరు 96/5కి చేరింది. జట్టును ఆదుకున్న రిజ్వాన్, సల్మాన్ ఆరో వికెట్‌కు 94 పరుగులు జోడించారు. మళ్లీ ఆఖరి వరుస బ్యాటర్లతో ఆమిర్ స్కోరు బోర్డును నడిపించాడు. తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఆట నిలిచే సమయానికి 6/0 స్కోరు చేసింది. వీడ్కోలు టెస్టు ఆడుతున్న వార్నర్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. బ్యాగీ గ్రీన్ క్యాప్ అపహరణకు గురవడంతో అతను కొత్త టోపీతో ఆఖరి టెస్టు బరిలోకి దిగాడు.

సినిమా

సంక్రాంతికి సైంధవ్ అసలైన ట్రీట్ - వెంకటేశ్



● వెంకటేశ్, శైలేష్ కొలను, వెంకట్ బోయనపల్లి

"సైంధవ్ ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా అందరికీ బాగా నచ్చుతుంది. సంక్రాంతికి సినిమా రిలీజ్ చేస్తున్నాం. ఎప్పటిలానే మీ (ప్రేక్షకులు, అభిమానులు) అందరి ప్రేమ, అభిమానం, ప్రోత్సాహం కావాలి. నా కెరీర్‌లో 75వ చిత్రంగా 'సైంధవ్' చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని హీరో వెంకటేశ్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా నటించిన చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా, బేబీ సారా, జయప్రకాశ్ కీలక పాత్రల్లో నటించారు. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'సైంధవ్' ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ వేడుకలో వెంకటేశ్ మాట్లాడుతూ– ''న్యూ ఏజ్ థ్రిల్లర్ చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. 'సైంధవ్'తో అది నెరవేరింది. ఈ సినిమా ప్రేక్షకులకు వైవిధ్యమైన అనుభూతిని ఇస్తుంది. నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్. సంక్రాంతికి అసలైన ట్రీట్. తప్పకుండా అలరిస్తుంది'' అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ– ''వెంకటేశ్‌గారి 75వ చిత్రం 'సైంధవ్' నేను చేయడం నా అదృష్టం. ఇది నా బెస్ట్ ఫిల్మ్. నాకు వచ్చిన ఫిల్మ్ మేకింగ్ అంతా ఈ సినిమా కోసం వాడేశా. ఈ పండక్కి మా సినిమా అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు. ''వెంకటేశ్‌గారితో సినిమా చేయడం నా కల నెరవేరినట్లయింది. మా సినిమా విందు భోజనంలా ఉంటుంది'' అన్నారు వెంకట్ బోయనపల్లి.

టైసన్ నాయుడి యాక్షన్



● బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'టైసన్ నాయుడు' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ సినిమా నిర్మిస్తున్నారు. బుధవారం (జనవరి 3న) సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ని 'టైసన్ నాయుడు'గా ఫిక్స్ చేసి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. సాయి శ్రీనివాస్‌ను బాక్సింగ్ లెజెండ్ మైక్‌టైసన్ అభిమానిగా ఈ చిత్రం వీడియో గ్లింప్స్ ద్వారా పరిచయం చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ– ''యునిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'టైసన్ నాయుడు'. సాయి శ్రీనివాస్‌ను మునుపెన్నడూ చూడని మాస్, యాక్షన్ అవతార్‌లో చూపిస్తున్నారు సాగర్ కె. చంద్ర. హై బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతోంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా.



● సూర్య

మ్యూజిక్ టైమ్

'**సూ**రరై పోట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా!') వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధ కొంగర కాంబినేషన్‌లో ఓ పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, నజ్రియా, విజయ్ వర్మ కీలక పాత్రలు పోషించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను ఫిబ్రవరిలో ప్రారంభించాలనుకుంటున్నారట. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ వర్క్ జరుగుతోంది. సుధ పర్యవేక్షణలో సంగీతదర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలను రికార్డ్ చేస్తున్నారు. ఇప్పటికే గాయకురాలు ధీతో జీవీ ప్రకాశ్‌కుమార్ ఓ పాటను రికార్డ్ చేశారు. అలాగే ఇది జీవీ ప్రకాశ్‌కుమార్‌కు సంగీత దర్శకుడిగా నూరవ చిత్రం కావడం విశేషం. ఇక ఈ సినిమాలో సూర్య డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారని, స్టూడెంట్ లీడర్ నుంచి ఓ గ్యాంగ్‌స్టర్‌గా మారే వ్యక్తి కథగా ఈ చిత్రం ఉంటుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది.


చైనా గోడ దూకినా తప్పు లేదు...

''**ఈ** మనసుందే.. అది ప్రేమించే వరకు బాగానే ఉంటుంది. కానీ ప్రేమించగానే ఆలోచించడం మానేస్తది. తన కోసం ఏమైనా చేసేయొచ్చు.. ఏమడిగినా ఇచ్చేయొచ్చు అనిపిస్తది. అలా ఇచ్చినప్పుడు తన మోహం మీద వచ్చే చిరునవ్వు, అది చూసి మన మనసులో కలిగే ఆనందం. అబ్బబ్బబ్బా... దాని కోసం పక్క ఊరి ప్రెసిడెంట్ గాడి గోడ ఏంటి? పక్క దేశం చైనా గోడ దూకినా తప్పు లేదు..'' అంటూ రాజ్ తరుణ్ వాయిస్ ఓవర్‌తో 'నా సామిరంగ'లోని భాస్కర్ లవ్‌స్టోరీ వీడియో విడుదలైంది. నాగార్జున హీరోగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'నా సామిరంగ'. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించగా, మరో హీరోయిన్ రుక్సార్ కీలక పాత్రలో నటించారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మించారు. ఇందులో అంజి పాత్రలో 'అల్లరి' నరేశ్, భాస్కర్ పాత్రలో రాజ్ తరుణ్, కుమారి పాత్రలో రుక్సార్, వరలక్ష్మి పాత్రలో ఆషికా నటించారు. ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలో రాజ్ తరుణ్ నటించిన భాస్కర్ పాత్ర తాలూకు వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి.



● రాజ్ తరుణ్, రుక్సార్

రం రం రం రక్తవర్ణం..



● తేజ సజ్జా

తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా నటించిన చిత్రం 'హను–మాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించారు. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న తెలుగు, హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ, మలయాళ తదితర భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్ భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి 'దినకర వదనం, రం రం రం రమ్యతేజం..' అంటూ సాగే నాలుగో పాట 'శ్రీ రామదూత స్తోత్రం..' లిరికల్ వీడియోను విడుదల చేశారు. గౌర హరి ఈ పాటకి స్వరాలు అందించగా, సాయి చరణ్ భాస్కరుణి, లోకేశ్వర్ ఎడర, హర్షవర్ధన్ చావలి పాడారు. ''హను–మాన్' నుంచి ఇప్పటికే విడుదలైన మూడు పాటలకు మంచి స్పందన వచ్చింది. 'శ్రీ రామ దూత స్తోత్రం..' పాట కూడా ప్రేక్షకుల మనసులని గెలుచుకుంటుందనే నమ్మకం ఉంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దాశరధి శివేంద్ర, సంగీతం: గౌరహరి–అనుదీప్ దేవ్–కృష్ణ సౌరభ్.



● లావణ్యా త్రిపాఠి

లావణ్య మిస్ పర్ఫెక్ట్

లావణ్యా త్రిపాఠి, అభిజీత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్'. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ వెబ్ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''న్యూ ఇయర్‌ను పర్ఫెక్ట్‌గా మొదలు పెట్టబోతున్నాం'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు లావణ్యా త్రిపాఠి. ''ప్రతి పనిని పర్ఫెక్ట్‌గా చేసే మిస్టర్ పర్ఫెక్ట్‌ల గురించి మాట్లాడుకుంటుంటాం. కానీ మిస్ పర్ఫెక్ట్‌గా ఓ అమ్మాయి ఎంత పర్ఫెక్ట్‌గా వర్క్ చేస్తుంది? ఎలా పని చేయిస్తుంది? అనే అంశాలను హిలేరియస్‌గా ఈ వెబ్ సిరీస్‌లో చూపించబోతున్నాం'' అన్నారు విశ్వక్ ఖండేరావ్. ''అనుకోకుండా ఏర్పరచుకునే కొన్ని అనుబంధాలు మన జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి? అనే ప్రేమకథతో 'మిస్ పర్ఫెక్ట్'ని రూపొందించాం'' అన్నారు సుప్రియ యార్లగడ్డ. ఈ సిరీస్‌కు సంగీతం: ప్రశాంత్ ఆర్. విహారి, కెమెరా: ఆదిత్య జవ్వాది.

ఇకపై నీతోనే...

రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటించిన చిత్రం 'శశివదనే'. సాయి మోహన ఉబ్బర దర్శకత్వంలో గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా సాగే ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. 'గడిచే కాలంతో ఈ నేలపై నేను నడిచే ప్రతి అడుగు ఇకపై నీతోనే... రైట్ హ్యాండ్‌తో ప్రామిస్...' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శరవణన్ వాసుదేవన్, నేపథ్య సంగీతం: దేవ్.



● రక్షిత్, కోమలి

వినోదం... సందేశం

శివ కంఠమనేని హీరోగా రాశీ, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాఘవ రెడ్డి'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో కేఎస్ శంకర్ రావ్, జి. రాంబాబు యాదవ్, ఆర్. వెంకటేశ్వర్ రావు నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా విచ్చేసిన నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''శ్రీహరి ఎలా మంచి స్టార్‌గా ఎదిగారో శివ కూడా అలాగే ఎదగాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''మా బ్యానర్‌లో వస్తోన్న మూడో సినిమా 'రాఘవ రెడ్డి'ని సక్సెస్ చేయాలి'' అన్నారు ఆర్. వెంకటేశ్వర్ రావు. ''వినోదం, సందేశంతో రూపొందిన మా చిత్రం గుర్తుండిపోతుంది'' అన్నారు సంజీవ్ మేగోటి. ''మా 'మధురపూడి గ్రామం అనే నేను' సినిమా రాజస్థాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి ఎంపికవడం మాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. 'రాఘవ రెడ్డి' కూడా ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు శివ కంఠమనేని.



● శివ, వెంకటేశ్వర్ రావు, సంజీవ్, గంటా శ్రీనివాసరావు

పల్లెటూరి ప్రేమ



● ప్రణమ్, రవి శివతేజ, ఆకాశ్ పూరి

కన్నడ నటుడు దేవరాజ్ తనయుడు ప్రణమ్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీతో శంకర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. హరి క్రియేషన్స్ ప్రొడక్షన్ బ్యానర్‌లో పి. హరికృష్ణ గౌడ్ నిర్మిస్తున్న తొలి సినిమా ఇది. ఈ సినిమా మూహూర్తపు సన్నివేశానికి దేవరాజ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో ఆకాశ్ పూరి క్లాప్ ఇచ్చారు. నటులు–దర్శకులు తనికెళ్ల భరణి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించి, తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ–''దేవరాజు పాన్ ఇండియా యాక్టర్. ఆయన వారసత్వాన్ని వాళ్ల అబ్బాయి ప్రణమ్ దేవరాజ్ అందిపుచ్చుకుని, ఈ రంగంలోకి రావడం సంతోషం. శంకర్ ప్రతిభ ఉన్న దర్శకుడు. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''ఈ చిత్రకథ బాగుంది. సినిమా హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు దేవరాజ్. 'ఈ కథలో మంచి యాక్షన్, లవ్‌స్టోరీ ఉన్నాయి'' అన్నారు ప్రణమ్ దేవరాజ్. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు దర్శక–నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: బాల సరస్వతి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	539	71,357
నిఫ్టీ ▽	149	21,517

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	14,625	▽ 140
డోజోన్స్	37,455	▽ 258
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,682	▽ 39
డాక్స్	16,538	▽ 231
షాంఘై	2,967	△ 5
నికాయ్	33,464	▽ 75

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	63,013 ▽ 589
బంగారం (99.5 స్వచ్ఛత)	62,761 ▽ 586
వెండి (కేజీ)	72,691 ▽1,441

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.91	83.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.11	106.67
€	యూరో	ఎస్‌బీఐ	90.19	92.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.09	59.43
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.41	57.35
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.35
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.59	12.45

కోపికో కాఫీ క్యాండీ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని



హైదరాబాద్: కోపికో కాఫీ క్యాండీ బ్రాండ్ తన అంబాసిడర్‌గా క్రికెటర్ మహీంద్ర సింగ్ ధోనిని నియమించుకుంది. ఇండియాలోని క్యాండీ కేటగిరీలో అగ్రస్థానంలో ఉన్న 'కోపికో కాఫీ' స్థాయిని మరింత బలోపేతం చేసేందుకు త్వరలో చేపట్టే ప్రచార కార్యక్రమాల్లో ధోని పాల్గొంటారని కంపెనీ తెలిపింది. కోపికో కాఫీ తనను ప్రచారకర్తగా ఎన్నుకోవడం పట్ల ధోని సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే నంబర్ వన్ కాఫీ క్యాండీతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ధోని పేర్కొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ చేతికి మెనోల్యాబ్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తాజాగా అమెరికాకు చెందిన మహిళల ఆరోగ్య సంరక్షణ, సప్లిమెంట్స్ ఉత్పత్తుల సంస్థ మెనోల్యాబ్స్‌ను కొనుగోలు చేసింది. అమెరికన్ బయోటెక్నాలజీ కంపెనీ అమిరిస్‌లో భాగమైన మెనోల్యాబ్స్‌ను దివాలా కోడ్ ద్వారా దక్కించుకున్నట్లు పేర్కొంది. మెనోల్యాబ్స్ పోర్ట్‌ఫోలియోలో ఏడు బ్రాండెడ్ ఉత్పత్తులు, యాప్ మొదలైనవి ఉన్నట్లు వివరించింది. మహిళల పౌష్టికాహార, వెల్‌నెస్ ఉత్పత్తుల మార్కెట్లో తమ వ్యాపారాన్ని మరింతగా విస్తరించేందుకు మెనోల్యాబ్స్ కొనుగోలు ఉపయోగపడగలదని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఉత్తర అమెరికా విభాగం సీఈవో మార్క్ కికుచి తెలిపారు. మెనోల్యాబ్స్ అమెరికాలో తమ సొంత ఈ-కామర్స్ మార్కెట్‌ప్లేస్‌తో పాటు అమెజాన్, వాల్‌మార్ట్ ద్వారా కూడా ఉత్పత్తులను విక్రయిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-1-2024	
విశాఖ	625-00
చిత్తూరు	608-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	72.00
3-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	582-00
వరంగల్	584-00
రిటైల్ ధర	6.40

పసిడి రుణాల ఎన్‌బీఎఫ్‌సీలదే హవా..

- బ్యాంకుల నుంచి పోటీ ఉన్నా ఆధిపత్యం
- క్రిసిల్ రేటింగ్స్ నివేదిక

న్యూఢిల్లీ: బ్యాంకుల నుంచి గట్టి పోటీ ఉంటున్నప్పటికీ పసిడి రుణాలిచ్చే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) వ్యాపార కార్యకలాపాలు పటిష్టంగా సాగుతున్నాయి. కరోనా సమయంతో పోలిస్తే కాస్తంత తగ్గినా మార్కెట్లో అవి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటున్నాయి. క్రిసిల్ రేటింగ్స్ నివేదిక ప్రకారం 2021 మార్చి నుంచి 2023 సెప్టెంబర్ మధ్య కాలంలో మార్కెట్ పరిమాణం రూ. 2.5 లక్షల కోట్లకు చేరగా, వాటి మార్కెట్ వాటా 61 శాతంగా నమోదైంది. కరోనా విస్తృతంగా ఉన్న 2022 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ పరిమాణం దాదాపు రూ. 2 లక్షల కోట్లుగా ఉండగా, పసిడి రుణాల ఎన్‌బీఎఫ్‌సీల వాటా 64 శాతంగా ఉండేది. ఆ తర్వాత 2023 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రూ. 2.3 లక్షల కోట్లకు చేరగా, వాటి వాటా 62 శాతానికి పరిమితమైంది. మార్కెట్లో మూడింట రెండొంతుల వాటా ప్రైవేట్ సంస్థలదే ఉన్నప్పటికీ.. అత్యధికంగా పసిడి రుణాలిచ్చిన సంస్థగా (రూ. 1.3 లక్షల కోట్లు) ప్రభుత్వ రంగ కెనరా బ్యాంకు ఉంది.

వాటా పెంచుకుంటున్న బ్యాంకులు..

బ్యాంకులు కూడా క్రమంగా పసిడి రుణాల మార్కెట్లో తమ వాటాను పెంచుకుంటున్నాయి. రూ. 2.5 లక్షల కోట్ల మార్కెట్లో 39 శాతం వాటాను (1 శాతం వృద్ధి) దక్కించుకున్నాయి. అలాగే, గత మూడేళ్లుగా వ్యవసాయేతర బంగారు రుణాలపై.. ముఖ్యంగా రూ. 3 లక్షల పైబడిన లోన్స్‌పై ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. కొత్త ప్రాంతాల్లో మరిన్ని శాఖలను ఏర్పాటు చేయడం, ఆన్‌లైన్‌లో రుణాలివ్వడం, ఇంటి వద్దకే సర్వీసులు అందించడం వంటి వ్యూహాలతో పసిడి రుణాల ఎన్‌బీఎఫ్‌సీలు ముందుకెడుతున్నట్లు క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ బి. మాళవిక తెలిపారు. బంగారం ధరల పెరుగుదల కూడా ఎన్‌బీఎఫ్‌సీల పోర్ట్‌ఫోలియో వృద్ధిని ప్రభావితం చేస్తున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్స్ ఏయూఎం వృద్ధికి ప్రధానంగా మూడు కారణాలు ఉంటున్నాయని క్రిసిల్ పేర్కొంది. కస్టమర్లు చేజారిపోకుండా ఎన్‌బీఎఫ్‌సీలు తగు ప్రయత్నాలు చేస్తుండటం, చిన్న..మధ్య స్థాయి రుణాలపై దృష్టి పెట్టడం, శాఖల నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా కస్టమర్లకు మరింత చేరువయ్యే ప్రయత్నాలు చేస్తుండటం ఇందుకు దోహదపడుతున్నట్లు వివరించింది.



ఐటీ, మెటల్, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

- ఫెడరల్ రిజర్వ్ మినిట్స్ వెల్లడి ముందు అప్రమత్తత
- సూచీలకు రెండో రోజూ నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 539 పాయింట్లు
- 21,550 స్థాయి దిగువకు నిఫ్టీ

ముంబై: ఫైనాన్స్, మెటల్, ఫైనాన్స్ రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ నష్టాలు చవిచూశాయి. కీలక వడ్డీ రేట్లను నిర్ణయించే యూఎస్ ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాలు(మినిట్స్), ఉపాధి కల్పన డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. దేశీయ తయారీ రంగం డిసెంబర్‌లో 19 నెలల కనిష్టానికి క్షీణించి 54.9 స్థాయికి దిగిరావడం సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందాయి. ఫలితంగా సెన్సెక్స్ 539 పాయింట్లు నష్టపోయి 71,357 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 149 పాయింట్లు క్షీణించి 21,517 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు బలహీనంగా మొదలయ్యాయి. ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో సూచీలు రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 588 పాయింట్లు క్షీణించి 71,304 వద్ద, నిఫ్టీ 166 పాయింట్లు నష్టపోయి 21,500 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. నష్టాల మార్కెట్లోనూ వినిమయ, సర్వీసెస్, రియల్టీ, విద్యుత్, ఫార్మా రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.666 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.863 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతో, చైనాలో డిమాండ్ తగ్గుదల ఆందోళనలతో మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దేశీయ ఐటీ రంగ డిసెంబర్ త్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



అదానీ షేర్ల పరుగు..

అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలపై సెబీ జరుపుతున్న దర్యాప్తులో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో బుధవారం అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు పరుగులు పెట్టాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 12%, అదానీ టోటల్ గ్యాస్ 10%, అదానీ గ్రూప్ ఎనర్జీ 6%, అదానీ పవర్ 5% చొప్పున లాభపడ్డాయి. అదానీ విల్మార్ 4%, ఎన్‌డీటీవీ 3.50%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.50%, అదానీ పోర్ట్స్ 1.30%, అంబుజా సిమెంట్స్ 1%, ఏసీసీ 0.10% పెరిగాయి. ఫలితంగా అదానీ గ్రూప్ 10 కంపెనీల సంయుక్త మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.64,189 కోట్లు పెరిగి రూ.15.11 లక్షల కోట్లకు చేరింది.

ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్



న్యూఢిల్లీ: హైదరాబాద్‌సహా ఎనిమిది నగరాల్లో కార్యాలయ స్థలాలకు 2023లో డిమాండ్ ఏర్పడింది. ఒక్క హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ లీజు గతేడాది (2023) 32 శాతం పెరిగి 8.8 మిలియన్ చదరపు అడుగులుగా నమోదైంది. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రముఖ పట్టణాల్లోనూ ఆఫీస్ స్పేస్ లీజు గతేడాది 15 శాతం వృద్ధి చెంది 59.6 మిలియన్ చదరపు అడుగులుగా (ఎస్ఎఫ్‌టీ) ఉన్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. దేశ హౌసింగ్, ఆఫీస్ మార్కెట్‌పై ఈ సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్స్ (జీసీసీలు) ఆఫీస్ స్పేస్ లీజులో ముఖ్య పాత్ర పోషించాయి. వీటికి సంబంధించిన లీజు పరిమాణం 20.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.

బజాజ్ ఆటో షేర్ల బైబ్యాక్..!

బజాజ్ ఆటో షేర్ల కొనుగోలు(బైబ్యాక్) ప్రతిపాదనను తీసుకువచ్చింది. ఈ నెల 8న జరిగే బోర్డు సమావేశంలో చర్చించే అంశాల్లో ఇది ఒకటని పేర్కొంది. కంపెనీ అత్యున్నత అధికారులు, వీరి తరఫు బంధువులు సంస్థ సెక్యూరిటీలు, ఈక్విటీ షేర్లలో లావాదేవీలు నిర్వహించే విండోను ఈ నెల 1 నుంచి 26వరకూ మూసివేస్తున్నట్లు వెల్లడించింది.

బైబ్యాక్ వార్తల నేపథ్యంలో షేరు బీఎస్ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 6,989 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 52 వారాల గరిష్టం రూ. 7,060 వరకూ ఎగసింది.

తీవ్ర ఒడిదుడుకుల్లో చమురు మార్కెట్లు

రేట్లు స్థిరపడ్డాకే పెట్రోల్ తగ్గింపుపై నిర్ణయం: కేంద్రం

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా చమురు మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. అవి స్థిరపడ్డాకే దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్ల తగ్గింపు నిర్ణయం తీసుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతానికైతే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో ఈ విషయం గురించి ఎటువంటి చర్చలూ జరపలేదని చెప్పారు. ముడి చమురు రేట్లు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ రేట్లను తగ్గించే అవకాశాలపై స్పందిస్తూ మంత్రి ఈ విషయాలు తెలిపారు. 'అంతర్జాతీయంగా రెండు ప్రాంతాల్లో (రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా) ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరిన్ని సవాళ్లేమైనా తలెత్తినా .. లేదా ఆటంకాలేమైనా ఎదురైనా దాని ప్రభావాలు ఎదుర్కొనాల్సి రావచ్చు. కానీ అలాంటిదేమీ జరగకూడదని కోరుకుందాం. తీవ్ర ఒడిదుడుకులు నెలకొన్న పరిస్థితుల్లో ఇంధన లభ్యత, అందుబాటు ధరలో అది అందేలా చూడటం ప్రాథమిక బాధ్యత. జాగ్రత్తగా దీన్నుంచి బైటపడే ప్రయత్నం చేస్తున్నాం' అని పురి వివరించారు. మరోవైపు, చమురు దిగుమతులకు సంబంధించి రష్యాకు చెల్లింపుల విషయంలో ఎలాంటి సమస్యా లేదని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు.



బజాజ్ ఫైనాన్స్ ప్రత్యేక డిపాజిట్

8.85 శాతం రేటు ఆఫర్

న్యూఢిల్లీ: బజాజ్ ఫైనాన్స్ డిజిటల్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను ప్రారంభించింది. బజాజ్ ఫైనాన్స్ యాప్, వెబ్‌సైట్ లేదా బజాజ్ ఫిన్‌సర్వ్ యాప్ ద్వారా డిపాజిట్ చేసే వృద్ధులకు (60 ఏళ్ల అంతకంటే ఎక్కువ) 8.85 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తోంది. ఈ డిపాజిట్ కాల వ్యవధి 42 నెలలు. 60 ఏళ్ల లోపు వారికి ఇదే డిపాజిట్‌పై 8.60 శాతం రేటు లభిస్తుంది. గడువు తీరిన డిపాజిట్‌ను రెన్యువల్ చేసుకున్నా, తాజాగా డిపాజిట్ చేసినా రూ.5 కోట్ల వరకు ఈ రేటు వర్తిస్తుందని సంస్థ ప్రకటించింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్-2023

ప్రభుత్వరంగ బీమా సంస్థ.. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభ కలిగిన విద్యార్థులకు గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్-2023 పేరుతో ఉపకార వేతనాన్ని అందిస్తోంది. అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత

» **జనరల్ స్కాలర్‌షిప్:** 2022-23 విద్యా సంవత్సరంలో కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2,50,000 మించకూడదు.ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలలు/సంస్థల్లో ఏదైనా డిగ్రీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఇంటిగ్రేటెడ్, డిప్లొమా, వృత్తి విద్య లేదా తత్సమాన కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపకార వేతనం అందుతుంది.

» **స్పెషల్ గర్ల్ చైల్డ్ స్కాలర్‌షిప్:** పదో తరగతి తర్వాత బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి ఉద్దేశించిందే ఈ స్కాలర్‌షిప్. 2022-23 విద్యా సంవత్సరంలో కనీసం 60 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,50,000 మించకూడదు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలలు/సంస్థల్లో ఇంటర్మీడియట్,ఒకేషనల్, డిప్లొమా,ఐటీఐ కోర్సు అభ్యసిస్తున్న బాలికలకు ఉపకార వేతనం అందుతుంది.

ఆర్థిక సాయం

» జనరల్ స్కాలర్‌షిప్‌నకు మెడికల్ విద్యార్థులకైతే ఏటా రూ.40,000 ఇస్తారు. ఇంజనీరింగ్ విద్యార్థులైతే ఏడాదికి రూ.30,000 ఇస్తారు. డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, డిప్లొమా, ఒకేషనల్ కోర్సులు చేసేవారికైతే ఆ కోర్సు పూర్తయ్యేవరకు ఏటా రూ.20,000 చొప్పున ఇస్తారు.

» స్పెషల్ గర్ల్ చైల్డ్ స్కీమ్ కింద ఎంపికైన విద్యార్థినులకు ఏడాదికి రూ.15,000 చొప్పున ఇస్తారు. పదో తరగతి పూర్తయిన తర్వాత ఇంటర్, ఒకేషనల్/డిప్లొమా కోర్సులను పూర్తిచేసేందుకు ఈ మొత్తాన్ని మూడు విడతల్లో చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** పదోతరగతి లేదా ఇంటర్‌లో పొందిన మార్కుల మెరిట్, కుటుంబ ఆర్థిక పరిస్థితి ఆధారంగా అభ్యర్థులను స్కాలర్‌షిప్‌నకు ఎంపికచేస్తారు. తక్కువ ఆదాయ వర్గాలకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** 14.01.2024.

» **వెబ్‌సైట్:** https://licindia.in

విశాఖపట్నం జోన్ వైద్యారోగ్య శాఖలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ.. విశాఖపట్నం జోన్-1 పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో సేవలు అందించడానికి ఒప్పంద ప్రాతిపదికన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్/మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 08

» **అర్హత:** ఏపీ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.లేదా సర్టిఫికేట్ ప్రోగ్రామ్ ఫర్ కమ్యూనిటీ హెల్త్(సీపీసీహెచ్) కోర్సుతో బీఎస్సీ పూర్తిచేసి ఉండాలి. **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

» **వేతనం:** నెలకు రూ.25,000.

» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్, విశాఖపట్నం చిరునామకు పంపించాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.01.2024.

» **మెరిట్ జాబితా వెల్లడి తేది:** 27.01.2024.

» **అభ్యంతరాల స్వీకరణకు చివరితేది:**31.01.2024

» **తుది మెరిట్ జాబితా వెల్లడి తేది:** 07.02.2024.

» **తుది మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు చివరితేది:** 09.02.2024.

» **తుది ఎంపిక జాబితా వెల్లడి తేది:** 12.02.2024.

» **కౌన్సిలింగ్ తేది:** 14.02.2024.

» **వెబ్‌సైట్:** https://nagendrasvst.wordpress.com

సీఎస్ఐఆర్, న్యూఢిల్లీలో 294 పోస్టులు

న్యూఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 294

» **పోస్టుల వివరాలు:** సెక్షన్ ఆఫీసర్-ప్రైవేట్ సెక్రటరీ-110, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్-170, పీడబ్ల్యూబీడీ-14.

» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ డేటాను ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఈమెయిల్:** సీఎస్ఐఆర్, హెచ్‌క్యూ, idce@csir.res.in.

» **దరఖాస్తులకు చివరితేది:** 31.01.2024.

» **వెబ్‌సైట్:** www.csir.res.in

డిగ్రీతో.. డిఫెన్స్ ఆఫీసర్

» సీడీఎస్ (1)-2024 నోటిఫికేషన్ విడుదల చేసిన యూపీఎస్సీ
» త్రివిధ దళాల్లో మొత్తం 457 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» బ్యాచిలర్ డిగ్రీ, బీటెక్ అర్హతలతో పోటీ పడే అవకాశం
» ఎంపికైతే శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టయిఫండ్

బ్యాచిలర్ డిగ్రీతో దేశ భద్రతలో కీలకమైన త్రివిధ దళాల్లో అడుగుపెట్టే అద్భుత అవకాశం! యూపీఎస్సీ తాజాగా కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 457 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇందులో విజయం సాధిస్తే.. భద్రతా దళాల్లో ఉజ్వల కెరీర్ సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. సీడీఎస్ఈ(1)-2024 పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. త్రివిధ దళాల్లోని నాలుగు విభాగాల్లో ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష. ఈ ఎగ్జామ్‌ను యూపీఎస్సీ ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంది. తాజాగా 2024 సంవత్సరానికి సంబంధించి సీడీఎస్ఈ(1)-2024కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.

మొత్తం పోస్టులు 457

సీడీఎస్ఈ (1)-2024 ద్వారా త్రివిధ దళాలకు చెందిన నాలుగు అకాడమీల్లోని అయిదు విభాగాల్లో 457 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్): 100 పోస్టులు, ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా): 32 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్): 32 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(పురుషులు): 275 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(మహిళలు): 18 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- సీడీఎస్ఈకి ఆయా అకాడమీల ఆధారంగా వేర్వేరు అర్హతలను పేర్కొన్నారు. అన్ని అకాడమీలకు అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళా అభ్యర్థులు ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి మాత్రమే అర్హులు.
- **ఇండియన్ మిలటరీ అకాడమీ:** అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** జనవరి 2, 2001 - జనవరి 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **నేవల్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్/బీఈ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** జనవరి 2, 2001 - జనవరి 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. 10+2 స్థాయిలో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ చదివుండాలి. **వయసు:** 2025, జనవరి 1 నాటికి 20 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. డీజీసీఏ జారీచేసిన కమర్షియల్ పైలట్ లైసెన్స్ కలిగి ఉన్నవారికి రెండేళ్ల సడలింపు లభిస్తుంది.
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** జనవరి 2, 2000 - జనవరి 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. ఇప్పటి వరకు పూర్తయిన పరీక్షల్లో ఎలాంటి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉండకూడదు.

రెండు దశల్లో ఎంపిక

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ద్వారా త్రివిధ దళాల్లో ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. మొదట యూపీఎస్సీ.. సీడీఎస్ రాత పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. మలిదశలో ఆయా సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌లు ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి.



రాత పరీక్ష విధానం

- సీడీఎస్ఈ రాత పరీక్ష రెండు విధాలుగా ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. రాత పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కు కోత విధిస్తారు.
- ఇండియన్ మిలటరీ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పరీక్షల్లో.. ఇంగ్లిష్ వంద మార్కులకు (పరీక్ష సమయం 2గంటలు), జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు (పరీక్ష సమయం 2గంటలు), ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ (పరీక్ష సమయం 2గంటలు) ఉంటాయి.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ పరీక్షలో.. ఇంగ్లిష్ వంద మార్కులకు (పరీక్ష సమయం 2గంటలు), జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు (పరీక్ష సమయం 2 గంటలు) ఉంటాయి.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

రాత పరీక్షలో విజయం సాధించిన వారికి మలిదశలో ఆయా సర్వీస్ సెలక్షన్ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. దీనికి కేటాయించిన మార్కులు 300. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా పలు రకాల పరీక్షలు, చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. వీటి ద్వారా ఆఫీసర్ ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాలున్న అభ్యర్థులను ఖరారు చేస్తారు. స్టేజ్-1లో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే స్టేజ్-2కు అనుమతిస్తారు. స్టేజ్-1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ (ఓఐఆర్) టెస్ట్‌లు, స్టేజ్-2లో సైకాలజీ టెస్ట్‌లు, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, ఇంటర్వ్యూలు, కాన్ఫరెన్స్‌లు ఉంటాయి. వీటిని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. తర్వాత వర్డ్ అసోసియేషన్ టెస్ట్ (డబ్ల్యూఏటీ), సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ (ఎస్ఆర్‌టీ)ల ద్వారా విద్యార్థుల సమయస్ఫూర్తిని పరీక్షిస్తారు. చివరగా సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్(ఎస్‌డీ)లో.. అభ్యర్థి తన కుటుంబం, స్నేహితులు, కాలేజీ, ఉపాధ్యాయుల గురించి రాయాలి. ఈ టెస్టుల తర్వాత రెండు రోజుల పాటు 9 రకాల గ్రూప్ టాస్కులు నిర్వహిస్తారు.

చివరగా ఇంటర్వ్యూ

సర్వీస్ సెలక్షన్ బోర్డ్ ఎంపిక ప్రక్రియలో ఫిజికల్ టెస్ట్‌లు పూర్తయ్యాక చివరగా..బోర్డ్ ప్రెసిడెంట్ లేదా సీనియర్ సభ్యుడి ఆధ్వర్యంలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.చివరగా కాన్ఫరెన్స్ ఉంటుంది. ప్యానెల్ ముందు అభ్యర్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికి పీఏబీటీ ఉంటుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సాధించుకున్న విద్యార్థులకు మరోసారి శారీరక, వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు.

శిక్షణ.. స్టయిఫండ్

- అన్ని దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి ఆయా విభాగాల్లో శిక్షణకు ఎంపికైన వారిని జెంటిల్‌మెన్ క్యాడెట్, లేడీ క్యాడెట్స్‌గా పిలుస్తారు. ఇలా శిక్షణ సమయంలో వీరికి నెలకు రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జనవరి 9
- దరఖాస్తు సవరణ: 2024 జనవరి 10-16
- రాత పరీక్ష తేదీ: 2024, ఏప్రిల్ 21
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- వెబ్‌సైట్: https://upsconline.nic.in, www.upsc.gov.in

మెరుగైన స్కోర్ సాధించేలా

ఇంగ్లిష్

ఈ విభాగంలో ఇంగ్లిష్ భాషపై పట్టును, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఆర్డరింగ్ ఆఫ్ సెంటెన్సెస్, ప్యాసేజ్‌లు, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, క్లోజ్ టెస్టు, ఫిల్ అప్స్, అనాలజీస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్ ద ఎర్రర్స్ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్ రూల్స్ తెలుసుకోవాలి. అలాగే ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్ కోసం సాధ్యమైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ నాలెడ్జ్


అభ్యర్థుల్లో సామాజిక అంశాల పట్ల ఉన్న అవగాహనను పరీక్షించే విభాగమిది. ఇందులో కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఇండియన్ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర అన్ని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయాలు, ప్రాముఖ్యం ఉన్న అంశాలు,అవార్డులు, జాయింట్ మిలిటరీ ఎక్సర్‌సైజెస్-అందులో పాల్గొన్న దేశాలు, ఆయా ఉమ్మడి సైనిక విన్యాసాల పేర్లు మొదలైన వాటిని తెలుసుకోవడం మేలు. కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు.

ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్

ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్ విభాగం ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ, వాల్యూమ్ అండ్ సర్ఫేస్ ఏరియా, లీనియర్ అండ్ క్వాడ్రటిక్ ఈక్వేషన్స్, ట్రిగనోమెట్రీ, ఫ్యాక్టరైజేషన్ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు.

టుడేస్ గ్రాఫిక్

భూకంపాలు ఎక్కువగా వచ్చిన దేశాలు
(1990–2024 జనవరి 2 వరకు)



- కనీసం రూ.8 కోట్ల ఆస్తి నష్టం లేదా 10 మంది మరణం లేదా సునామీ హెచ్చరిక లేదా రిక్టర్ స్కేలుపై 7.5 తీవ్రత ఉన్నవాటిని పరిగణనలోకి తీసుకున్నారు.
- ఆధారం: నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫరిక్ ఆర్గనైజేషన్



'కరెంట్' ట్రెండ్.. అప్పట్లోనే..

ఇక్కడ ఈవిడ ఏం చేస్తోందో తెలుసా? తన ఎలక్ట్రిక్ కారును చార్జ్ చేస్తోంది! అదీ.. 112 ఏళ్ల క్రితం!! ఎలక్ట్రిక్ కార్లు.. వాటిని ఇలా చార్జ్ చేయడం అన్నది ఆధునిక కాలం తాలూకు ఆవిష్కరణ అనుకుంటే పొరపాటే.. ఎందుకంటే.. ఆ కాలంలో ఎలక్ట్రిక్ కార్లు బాగా ప్రాచుర్యం పొందాయి. ఇందులో ఉన్న కారు కొలంబియా ఎలక్ట్రిక్ విక్టోరియా ఫేటన్ కంపెనీది.. ఈ మోడల్‌ను తొలిసారిగా 1905లో తయారుచేశారు. అప్పట్లో దీని ధర రూ.1.33 లక్షలు. గంటకు 24 కిలోమీటర్ల వేగంతో నడిచేది. నిజానికి తొలి ఎలక్ట్రిక్ కారును 1890లోనే తయారుచేశారు. 1900లో అమెరికాలో 4,192 రిజిస్టర్డ్ వాహనాలుంటే.. అందులో 1,500 ఎలక్ట్రిక్ కార్లే. సంపన్నులు వీటిని కొనడానికి ఎక్కువ ఆసక్తి చూపేవారు. అప్పట్లో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల లభ్యత తక్కువ ఉండటంతో వీటికి ప్రాచుర్యం పెరిగింది. పెట్రోల్ కార్లు ఉన్నా.. సౌండ్ ఎక్కువ వచ్చేవి. దాన్ని ఆపరేట్ చేయడం కూడా కష్టంగా ఉండేది. అయితే, తదనంతర కాలంలో ఫోర్డ్ కంపెనీ మోడల్–టీ రావడం.. ఎలక్ట్రిక్ కారు ధరతో పోలిస్తే.. అందరికీ అందుబాటులో.. సగం ధరకే లభ్యమవడంతో నెమ్మది నెమ్మదిగా ఎలక్ట్రిక్ కారు క్రేజ్ తగ్గడం ప్రారంభించింది. ఇప్పుడు కొత్త తరం ఎలక్ట్రిక్ కార్లు రావడంతో మళ్లీ వాటి క్రేజ్ పెరుగుతున్న సంగతి తెలిసిందే.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. గోదాదేవిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కట్టె పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. శ్రీరంగనాథుడిని కొలుస్తూ గోదాదేవి రచించి, కీర్తించిన పాశురాలను ఆచార్యులు భక్తులకు వివరించారు. ఉపవాస దీక్షల్లో భాగంగా మహిళలు గోదాదేవికి మంగళహార తులతో నీరాజనాలు పలికారు.

42 రోజులు.. రూ.1.51 కోట్లు

భారీగా పెరిగిన భద్రాద్రి హుండీ ఆదాయం



భద్రాచలం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయ హుండీలను అధికారులు బుధవారం లెక్కించారు. 42 రోజులకు రూ.1,51,27,386 ఆదాయం సమకూరిందని ఈవో రమాదేవి తెలిపారు. ఇవి కాకుండా యూఎస్ డాలర్లు- 352, మలేసియా రింగిట్స్–71, ఇండోనేసియా రూపాయలు – 1,10,000, ఖతర్ రియాల్ – 100, యూఏఈ దీరమ్స్ – 125, ఒమన్ బైస–200, నేపాల్ రూపీస్–10, యూకే యూరో–10, థాయ్‌లాండ్ బాత్స్–20, బంగారం 92 గ్రాములు, వెండి 1.5 కిలోలు వచ్చాయని వెల్లడించారు.



బుధవారం బ్రిటన్‌లోని సియం పట్టణ సముద్ర తీరంలో విరుచుకుపడుతున్న తుపాను అలలు.. హెంక్ తుపాను నేపథ్యంలో ప్రయాణాలు చేయవద్దని పలు ప్రాంతాల్లో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

రామాయపట్నం రెడీ

రామాయపట్నం పోర్టులో త్వరలో తొలి నౌక లంగరు | **వాణిజ్య కార్యకలాపాలకు సిద్ధమవుతున్న పోర్టు** | **నెల్లూరు జిల్లాలో రూ.4,902 కోట్లతో నిర్మాణం**

- 2022 జూన్‌లో పోర్టు నిర్మాణ పనులకు ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన
- 18 నెలల్లోనే అందుబాటులోకి తీసుకొచ్చి రికార్డు సృష్టించిన రాష్ట్ర ప్రభుత్వం



రామాయపట్నం పోర్టులో నిర్మాణం పూర్తయిన బల్క్ బెర్త్

సాక్షి, అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.20,000 కోట్లతో కోస్తా తీరాన్ని అభివృద్ధి చేస్తోంది. ఒకేసారి నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులతో పాటు 10 మినీ పోర్టుల తరహాలో ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించనుంది. రాష్ట్రంలోని 974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతంలో ప్రతి 50 కి.మీ.కు ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఉండేలా ఏపీ మారిటైమ్ బోర్డు అడుగులు ముందుకు వేస్తోంది. ప్రస్తుతం విశాఖలో మేజర్ పోర్టుతో పాటు మరో ఐదు నాన్ మేజర్ పోర్టులు గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ డీప్‌వాటర్, కాకినాడ యాంకరేజ్, రవ్వ కాపిటివ్‌పోర్టులున్నాయి. ఇవి కాకుండా ఇంకో నాలుగు పోర్టులను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను రాష్ట్ర ల్యాండ్ లార్డ్ మోడల్‌లో అభివృద్ధి చేస్తుండగా, కాకినాడ గేట్‌వే పోర్టును పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. రూ.91.18 కోట్లతో చేపట్టిన కాకినాడ యాంకరేజ్ పోర్టు ఆధునికీకరణ పనులు పూర్తి కానుండటంతో పోర్టు సామర్థ్యం పెరగనుంది. రామాయపట్నంలో బల్క్ బెర్త్ పనులు దాదాపు పూర్తి కావడంతో ఈనెలాఖరు లేదా ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు మారిటైమ్ బోర్డు ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి కాకినాడ గేట్‌వే పోర్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2025 నాటికి రాష్ట్రంలో మొత్తం పది పోర్టులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ప్రస్తుతం 150 మిలియన్ టన్నులుగా ఉన్న రాష్ట్ర ఎగుమతులు 300 మిలియన్ టన్నులకు చేరుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు లక్షలాది మందికి ఉపాధి లభించడంతో పాటు వ్యాట్, జీఎస్టీ రూపంలో రాష్ట్ర ఖజానాకు భారీ ఆదాయం సమకూరనుంది.

> ఒక మంచి ఆలోచనతో ఏపీ దశ, దిశలను మార్చవచ్చని ఆ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ నిరూపించారు. సముద్ర తీరం ఉండాలే కానీ సంపద సృష్టించడం కష్టం కాదనే దిశగా అడుగులు ముందుకు వేశారు. కొత్త పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో లాజిస్టిక్స్, ఎగుమతులు, దిగుమతుల ద్వారా అద్భుతాలు సృష్టించడానికి మార్గం సుగమం చేస్తున్నారు. ఒక్కో పోర్టు, ఒక్కో ఫిషింగ్ హార్బర్ అందుబాటులోకి రావడం ద్వారా తీర ప్రాంత అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు వెల్లువెత్తడం ఖాయం. రాష్ట్రానికి సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవచ్చని గత ప్రభుత్వం ఆలోచించక పోవడం ఇప్పుడు ఏపీ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

త్వరలోనే తొలి నౌక ఆగమనం

మొదలు పెట్టిన 18 నెలల్లోనే రామాయపట్నం పోర్టు వాణిజ్యపరంగా కార్యకలాపాలు ప్రారంభించడానికి సిద్ధమయ్యిందంటే పనులు ఎంత వేగంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. సుమారు 850 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,902 కోట్ల పెట్టుబడి అంచనాతో అభివృద్ధి చేస్తున్న రామాయపట్నం పోర్టుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2022 జూన్‌లో భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. తొలి దశలో 34.04 ఎంఎంటీపీఏ (మిలియన్ మెట్రిక్ టన్స్ పర్ ఆనమ్) సామర్థ్యంతో నాలుగు బెర్తులు (రెండు జనరల్, ఒకటి కోల్, ఒకటి మల్టీపర్పస్) అభివృద్ధి చేయనుండగా, అందులో ఇప్పటికే బల్క్ బెర్త్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్ బిల్డింగ్‌ల నిర్మాణ పనులు కూడా పూర్తి కావడంతో త్వరలో తొలి నౌకను తీసుకొచ్చి లంగరు వేయడం ద్వారా వాణిజ్య పరంగా పోర్టును ప్రారంభించడానికి ఏపీ మారిటైమ్ బోర్డు ప్రణాళికలను సిద్ధం చేసింది. వచ్చే ఆరు నెలల్లో మిగిలిన మూడు బెర్తులను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

23 ఎకరాల్లో పునరావాస గ్రామ నిర్మాణం

రామాయపట్నం పోర్టుకు సమీపంలోని తెంటు గ్రామం వద్ద 23 ఎకరాల్లో పునరావాస గ్రామాన్ని అభివృద్ధి చేసింది. పోర్టు కోసం భూమిని ఇచ్చిన ప్రతి కుటుంబానికి 5 సెంట్ల భూమి చొప్పున 675 మందికి పునరావాసం కల్పించారు. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం సుమారు రూ.160 కోట్లు వ్యయం చేసింది. ఈ గ్రామంలో రహదారులు, విద్యుత్, తాగునీరు, మురుగు నీటి సరఫరా వంటి మౌలిక సౌకర్యాలను కల్పించారు. దేవాలయాలు, ప్రార్థన మందిరాలు, పాఠశాల, వైద్యశాల, కమ్యూనిటీ భవనాలు వంటి అన్ని సదుపాయాలను ప్రభుత్వమే కల్పించింది. పునరావాస గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.20 కోట్ల వరకు వ్యయం చేసింది.

ప్రాజెక్టు వ్యయం	: రూ.4,902 కోట్లు
తొలి దశలో పోర్టు సామర్థ్యం	: 34.04 ఎంఎంటీపీఏ
పూర్తి స్థాయి సామర్థ్యం	: 138.54 ఎంఎంటీపీఏ
తొలి దశలో బెర్తులు	: నాలుగు (రెండు జనరల్, ఒకటి కోల్, ఒకటి మల్టీపర్పస్)
తొలి దశలో వచ్చే ఓడల పరిమాణం	: 80,000 డీడబ్ల్యూటీ (డెడ్ వెయిట్ టన్నేజ్)
పనులు ప్రారంభించిన తేదీ	: 2022 జూన్ 24
కార్యకలాపాలు ప్రారంభం	: 2024 జనవరి

ఇప్పటి వరకు పనులు ఇలా..

- పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్ నిర్మాణం కోసం ఏకంగా ఇప్పటి వరకు 59లక్షల టన్నుల రాళ్ల వినియోగం.
- భారీ ఓడలను సురక్షితంగా తీరానికి తీసుకు వచ్చేలా 7.87 మిలియన్ క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్, టర్నింగ్ సర్కిల్స్, అప్రోచ్ చానల్ నిర్మాణం.
- అప్రోచ్ ట్రెస్టిల్, బల్క్ బెర్త్, కస్టమ్స్ బిల్డింగ్, సెక్యూరిటీ కమ్ రిసెప్షన్ బిల్డింగ్ నిర్మాణం పూర్తి.
- శరవేగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు.. పోర్టును జాతీయ రహదారి ఎన్‌హెచ్16కు అనుసంధానం చేస్తూ రహదారి పనులు వేగవంతం.
- సముద్రంలో చేయాల్సిన పనులు దాదాపు పూర్తి. తీరంలో నిర్మించే భవనాలు, ఇతర నిర్మాణాలు 45% వరకు పూర్తి.

మేయర్ ఫోన్ చేస్తే మాట్లాడవా?

నా చాంబర్ ఎదుట 30 నిమిషాలు నిల్చో!

- పీజీ వైద్య విద్యార్థికి ఎంజీఎం సూపరింటెండెంట్ శిక్ష
- విద్యార్థి మనస్తాపం.. పీజీ సీటు వదిలేస్తానంటూ లేఖ
- వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వివాదం

ఎంజీఎం: ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తన తండ్రి వృత్తిని కించపరుస్తూ తనను డీఎంఓ వచ్చే వరకు 30 నిమిషాలు ఆయన చాంబర్ ఎదుట నిల్చోబెట్టాడని కాకతీయ మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్ విభాగంలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న డాక్టర్ వీర ప్రసాద్ ఆరోపించడం కలకలం రేపింది. మనస్తాపానికి గురైన ప్రసాద్ తన పీజీ సీటు వదిలేస్తానని లేఖ రాసి.. తనకు అవమానం జరిగిందంటూ జూడా ప్రతినిధు లకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు విషయం బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సదరు లేఖ, ఫిర్యాదులోని వివరాల ప్రకారం..'' ఈ నెల రెండో తేదీన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో డ్యూటీలో ఉండగా ఓ రోగి ఛాతీనొప్పితో రావడంతో పరీక్షిస్తున్నాను. సరిగ్గా అదే సమయంలో అటెండర్ ఫోన్ తీసుకువచ్చి మేయర్ మాట్లాడాలనుకుంటున్నారు అని చెప్పగా.. రోగికి వైద్యం అందించగానే మాట్లాడతానని చెప్పాను. వెంటనే ఫోన్ తీసుకోలేదన్న కారణంగా సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్.. నన్ను చాంబర్ దగ్గరికి పిలిపించాడు. నా తండ్రి వృత్తిని పేర్కొంటూ వ్యక్తిగతంగా కించపరిచాడు. డీఎంఓ వచ్చే వరకు 30 నిమిషాలు తన చాంబర్ ఎదుట నిలుచోబెట్టి తీవ్రంగా అవమాపరిచాడు' అని ఆ లేఖ, ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడ చదవడంకంటే పీజీ సీటు వదిలేసుకోవడం ఉత్తమమని పేర్కొన్నాడు.

ప్రజాప్రతినిధుల ఫోన్‌లకు స్పందించాలని చెప్పారంతే: ఆర్ఎంఓ శ్రీనివాస్

ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాస్ ఈ ఘటనపై స్పందించారు. సదరు పీజీ వైద్యుడితో సూపరింటెండెంట్ దురుసుగా ప్రవర్తించలేదని, సాధారణంగా పీజీ విద్యార్థి ఏ స్థాయి నుంచి వచ్చారో అనే కోణంలో ప్రశ్నించారని తెలిపారు. చాంబర్ ముందు 30 నిమిషాలు ఉండమన్నందుకు సదరు విద్యార్థి మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి కాబట్టి ప్రజాప్రతినిధుల ఫోన్‌లకు స్పందించాలని చెప్పారే తప్ప వ్యక్తిగతంగా దూషించలేదని వివరణ ఇచ్చారు.

17 నాటికి డేటా ఎంట్రీ పూర్తి

ప్రజాపాలన దరఖాస్తులపై జిల్లా కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు

- అవసరమైతే ప్రైవేటు డీటీపీ ఆపరేటర్లను వినియోగించుకోవాలని సూచన



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న అభయహస్తం దరఖాస్తుల మొత్తం డేటా ఎంట్రీ ఈనెల 17వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన నిర్వహణ, దరఖాస్తుల డేటా ఎంట్రీపై జిల్లా కలెక్టర్లతో బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో గ్రామ సభలను ఏవిధమైన ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహిస్తుండడం పట్ల జిల్లా కలెక్టర్లను సీఎస్ అభినందించారు. ఈనెల 6వ తేదీన ప్రజాపాలన ముగిసిన వెంటనే అందిన దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను మండల కేంద్రాల్లో చేపట్టి 17 నాటికి పూర్తి చేయాలన్నారు. మండల రెవెన్యూ అధికారులు, మండల అభివృద్ధి అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ డేటా ఎంట్రీ చేపట్టాలని, ప్రజాపాలన కార్యక్రమం సూపర్‌వైజరీ అధికారిగా ఉన్న జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షించాలని ఆదేశించారు.

నేడు టీవోటీలకు శిక్షణ

డేటా ఎంట్రీకి జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర స్థాయిలో ట్రైనీ ఆఫ్ ట్రైనర్ (టీవోటీ)లకు 4వ తేదీన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ టీవోటీలు జిల్లా స్థాయిలో డేటా ఎంట్రీ ఏవిధంగా చేయాలన్న దానిపై 5న శిక్షణ ఇస్తారని చెప్పారు. డేటా ఎంట్రీ సందర్భంగా దరఖాస్తుదా రుల వివరాల నమోదులో ఆధార్ నంబర్, తెల్ల రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకుగాను జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న డీటీపీ ఆపరేటర్ల సేవలను ఉపయోగించుకోవాలని, అవసరమైతే ప్రైవేటు ఆపరేటర్లను నియమించుకోవాలని సీఎస్ శాంతికుమారి సూచించారు.

2వ తేదీ నాటికి 57 లక్షల దరఖాస్తులు

మంగళవారం నాటికి దాదాపు 57 లక్షల దరఖాస్తులు అందాయని సీఎస్ తెలిపారు. ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందున దరఖాస్తు ఇవ్వని వారు, మరోసారి తిరిగి దరఖాస్తులు ఇవ్వడానికి అవకాశం ఉందన్న విషయాన్ని ప్రజలకు తెలపాలని కూడా సీఎస్ స్పష్టం చేశారు. టెలి కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జీహెచ్ ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, పంచాయతీ రాజ్ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

మొత్తం అంతా వాళ్లే చేశారు

కమలంలో ఫిర్యాదుల వెల్లువ!

- పార్టీ ఓటమికి కారణమంటూ ఒకరిపై ఒకరు ఫిర్యాదులు
- నెలాఖరులోగా ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తామంటున్న క్రమశిక్షణా కమిటీ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి నెల రోజులు దాటినా బీజేపీలో ఒకరిపై ఒకరు ఫిర్యాదుల పర్వం మాత్రం ఆగడం లేదు. బుధవారం ఒక్క రోజే పార్టీ కార్యాలయానికి వందల సంఖ్యలో ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది. గత నెల 3న అసెంబ్లీ ఫలితాలు ప్రకటించిన దరిమిలా మొదలైన పితూరీల పరంపర నేటికీ ఆగలేదని అంటున్నారు. దాదాపుగా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి ఫిర్యాదులు రావడం, చిన్న కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు కంప్లెయింట్స్ సమర్పించిన వారిలో ఉండడం చూసి పార్టీ పెద్దలు ఆశ్చర్యపోతున్నారట.

నెలాఖరులోగా ఫిర్యాదుల పరిష్కారం?

ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని, ప్రత్యర్థి పార్టీకి, అభ్యర్థులకు సహకరించారని, పార్టీ అభ్యర్థి ఓటమికి కారణం అయ్యారని, ఇలా వివిధ స్థాయిల్లో నాయకులపై ఫిర్యాదులు వచ్చినట్టుగా తెలుస్తోంది. ఇక కొద్దిమంది నేతలు తమకు పార్టీలో ఇతరులతో ఉన్న వ్యక్తిగత కక్షలు, ద్వేషాల నేపథ్యంలో కూడా ఫిర్యాదులు పంపినట్టు చెబుతున్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర క్రమశిక్షణా కమిటీకి చైర్మన్ ఎం.ధర్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. ఈ కమిటీ గతనెల 30 తొలి సారి భేటీ కాగా, ఫిర్యాదులపై విచారణను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో కమిటీ ప్రతీవారం భేటీ అయి వీలైనంత వేగంగా వాటిని పరిష్కరించాలని భావిస్తోంది.

ఇప్పటికే కొందరికి షోకాజ్‌లు జారీ...

క్రమశిక్షణా కమిటీ మొదటి సమావేశంలో...ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి, ఎన్నికల బాధ్యతలు సరిగా నిర్వహించ ని వారికి, నిర్లక్ష్యం వహించి పార్టీకి నష్టం చేసిన పలువురికి షోకాజ్ నోటీసులు జారీచేసింది. వారం, పదిరోజుల్లో వివరణ ఇవ్వాలంటూ శ్రీముఖాలు అందుకున్న వారిలో ఇద్దరు ముగ్గు రు జిల్లా అధ్యక్షులు, పదిమంది వరకు రాష్ట్ర స్థాయి నాయకులు ఉన్నారని తెలిసింది. వీరిపై ఆరోపణల తీవ్రతను బట్టి చర్యలకు దిగనున్నట్టు తెలుస్తోంది. ఇక మరికొన్ని ఫిర్యాదులపై అదనపు సమాచారాన్ని కోరినట్టు తెలిసింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు సహకరించారనే తీవ్రమైన ఆరోపణలు, పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారన్న దానిపై కచ్చితమైన ఆధారాలు, సమాచారం ఇస్తే సస్పెన్షన్లు, బహిష్కరణలు వంటి తీవ్ర నిర్ణయాలు కమిటీ తీసుకునే అవకాశాలున్నాయని పార్టీనేతలు చెబుతున్నారు.

ఘజియాబాద్ నుంచి హైదరాబాద్‌కు

కల్తీ మందులు

సీజ్ చేసిన ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు



సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా వచ్చిన కల్తీ యాంటీబయాటిక్స్ మందులను ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు సీజ్ చేశారు. దాదాపు రూ.23 లక్షల విలువైన ఈ కల్తీ మందులను ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో దాడులు చేసి పట్టుకున్నట్టు డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వివరించారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వివిధ కొరియర్ సంస్థలపై నిఘా పెట్టినట్టు తెలిపారు. ఉప్పల్‌లోని 'ట్రక్కన్ కొరియర్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థపై కూడా నిఘా పెట్టామని, ఈనెల 30వ తేదీన ఘజియాబాద్ నుంచి పువ్వాడ లక్ష్మణ్ పేరిట నకిలీ మందుల పార్సిల్స్ వచ్చినట్టు గుర్తించినట్టు తెలిపారు. డిసెంబర్ 29వ తేదీన డ్రగ్స్ కంట్రోల్ సంస్థ గుర్తించిన కల్తీ మందుల కేసులోనూ ఇతను నిందితుడు అని పేర్కొన్నారు. ఈ పార్సిల్‌ను పంపిణీ చేయడానికి కొరియర్ సంస్థ బాయ్ వెళుతున్న సమయంలో తమ అధికారులు దిల్‌సుఖ్‌నగర్‌లోని గోడౌన్ నుంచి ఆ బాయ్‌ని వెంబడించగా..అతను పువ్వాడ లక్ష్మణ్‌కు వాటిని ద్వారకాపురంలోని వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ వద్ద అందిస్తున్నప్పుడు ప్రత్యక్షంగా పట్టుకున్నట్టు తెలిపారు. ఇందులో కల్తీ యాంటీబయాటిక్స్ 'సెఫోగిక్మ్–సీవీ' టాబ్లెట్లు అసలు ఉనికిలోనే లేని 'మెగ్ లైఫ్‌సైన్సెస్ ఖసరా, పల్లిగవోన్, సిర్మౌర్, హిమాచల్‌ప్రదేశ్'లో ఉత్పత్తి అయినట్టు ఉందని వివరించారు. విచారణ సందర్భంగా లక్ష్మణ్ తనతోపాటు పాకల రమేశ్, గారపల్లి పూర్ణచందర్‌లు ఉన్నట్టు వెల్లడించారని డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ తెలిపారు.

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ఓయూ నేతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఓయూ జేఏసీ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి లోకేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఓయూ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పీపుల్స్ మార్చ్ పేరుతో సీఎల్పీ నేతగా భట్టి చేసిన పాదయాత్ర ఫొటోలను లోకేశ్ యాదవ్ బహూకరించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 60 శాతం అవకాశాలు కల్పిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు.

చర్లపల్లి టెర్మినల్ పనుల పరిశీలన



టెర్మినల్ పనులపై కాంట్రాక్టర్లతో సమీక్షిస్తున్న డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులను బుధవారం రైల్వే, జీహెచ్ఎంసీ అధికారుల బృందం పరిశీలించింది. అప్రోచ్ రోడ్ల కోసం స్థల సేకరణ విషయమై రైల్వే డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్, ఏడీఆర్ఎం రాజీవ్‌కుమార్ ఇంగ్లే, డీఓఎం జనరల్ మణికుమార్ తదితరులు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో కలిసి సందర్శించారు. ఈసీనగర్ రోడ్డులో మహాలక్ష్మి నగర్ కమాన్‌లోంచి స్టేషన్‌కు వెళ్లేందుకు 30 అడుగులున్న అప్రోచ్ రోడ్డును 80 అడుగులకు పెంచాలని నిర్ణయించారు. నిర్మాణంలో ఉన్న నూతన టెర్మినల్ ప్రధాన అప్రోచ్ రోడ్డు కోసం 100 అడుగుల రోడ్డు మార్గం వేయనున్నారు. ప్రధాన రోడ్డు మార్గం గోకుల్‌నగర్ నుంచి చర్లపల్లి పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డుకు కలపాలని నిర్ణయించారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల సేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జడ్సీ, కాప్రా డీసీలను ఆదేశించారు. అనంతరం మల్లాపూర్ నోమా కల్యాణ మండపం నుంచి రైల్వే ట్రాక్ వరకు ఉన్న బాక్స్‌డ్రైన్ సామర్థ్యాన్ని పెంచాలన్న రైల్వే అధికారుల విన్నపం మేరకు కమిషనర్ రోనాల్డ్ రాస్ బాక్స్‌డ్రైన్‌ను పరిశీలించారు. కార్పొరేటర్ ప్రభుదాస్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, కాప్రా డీసీ ముకుంద రెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.